8-8Pg1exHMNWJQE.qxdo/p:8-8Pg1exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

8-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 189 పేజీలు: 16 వెల: 6.50

మెడికో కేసు: ఇద్దరు నిందితుల అరెస్టు 2లో

నీట్: 13మందిపై సిబిఐ ఛార్జిషీటు 5లో

క్వారీలకు వస్తా..కొరడా తీస్తా

ఇసుక మాఫియాకు సిఎం చంద్రబాబు తీవ్ర హెచ్చరిక

కలెక్టర్, మైనింగ్ అధికారులకు నెల రోజులు గడువు



చీరాల టౌన్, ఆగస్టు 7, ప్రభాతవార్త : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాల అంశంపై తీవ్రంగా స్పందించారు. ఇసుక మాఫియాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేసిన ఆయన, అధికారులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. సభ వేదికపైనే బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తోపాటు మైనింగ్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమాలపై పూర్తి స్థాయి వివరాలతో కూడిన నివేదికను నెలరోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. అక్ర మాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు >>2

త్వరలో బిసి చట్టం

శుక్రవారం చీరాల నియోజకవర్గం కొత్తపేటలో చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ముసాయిదా సిద్ధంగా ఉంది..

నేతన్నలకు మేలు చేసేది కూటమి ప్రభుత్వమే

చీరాలలో 'నేతన్న సేవలో' ప్రారంభించిన సిఎం చంద్రబాబు

కుటుంబానికి రూ.25వేల చొప్పున 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు జమ

చీరాల, ఆగస్టు 7 ప్రభాతవార్త: బిసిల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని, దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బిసి సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్లజిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సిఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థికసాయాన్ని సిఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179కోట్లను >>2

జంతర్‌మంతర్‌ను 'బందీ'ని చేయొద్దు

నిరసనలకు దూరంగా ఉంచండి: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: నిరసనల కారణంగా జాతీయ రాజధానిని 'బందీగా పెట్టలేం' అని వ్యాఖ్యానిస్తూ, జంతర్ మంతర్ వద్ద గానీ, నగరంలోపల గానీ నిరసనలు జరగకపోవడమే ఆదర్శప్రాయమని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ మహాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నగరంలోపల నిరసనలు జరగడం వల్ల రోడ్లు, అంబులెన్సులు వంటి సాధారణ ప్రజల కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుందని, అందువల్ల తాను వ్యక్తిగతంగా అలా భావించడం లేదని జస్టిస్ మహాజన్ పేర్కొన్నారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై ఆగస్టు 10న జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసనకు అనుమతి కోరుతూ దాఖలైన పిటి >>2

డోలీల్లేని ఊళ్లు చూడాలి

అడవితల్లిబాట తొలిదశలో 1,069 కి.మీ. రహదారుల అభివృద్ధికి శ్రీకారం

రెండోదశలో 2,310 కి.మీ నిర్మాణం, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షలో డి.సిఎం పవన్

విజయవాడ.ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి: ప్రతి గిరిజన గ్రామం డోలీ రహితం కావాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.అడవితల్లిబాట పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన పవన్ కళ్యాణ్ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో డోలీరహిత గిరిజన గ్రామాలు లక్ష్యంగా చేపట్టిన అడవితల్లి బాట పనులు స్పష్టమైన పురోగతి దిశగా సాగుతున్నాయి. అడవితల్లి బాట తొలి దశలో రూ. 1,005 కోట్ల అంచనా వ్యయంతో 1,069 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తూ అడవితల్లిబాట 2.0ను ప్రారంభించడం జరిగింది. ఈ విస్తరణతో మొత్తం ప్రాజెక్టును రూ. 2,078 కోట్ల అంచనా వ్యయంతో 2,310 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి విస్తరించడం జరిగింది. ఇందులో ఇప్పటికే 905 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తైంది. అడవితల్లిబాట కార్యక్రమం మొదటి రోజు నుంచి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పనులు వేగంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా పవన్ కళ్యాణ్ సూచనలు చేస్తున్నారు.

సవాళ్ల నడుమ రోడ్డు నిర్మాణం: అడవితల్లిబాట కార్యక్రమంలో భాగంగా చాలా గ్రామాలకు రోడ్డు వేయడం కంటే ముందు దారి

అడవి తల్లిబాటలో గిరిజన ప్రాంతంలో నిర్మించిన రహదారి (ఇన్‌సెట్) డి.సిఎం పవన్ కళ్యాణ్

నిర్మించేందుకు సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోడ్ల నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద గుట్టలను కంట్రోల్డ్ బ్లాస్టింగ్ ద్వారా బ్రేక్ చేసి, రాళ్లు పగలగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఆ దారిపై రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. దారులు వేసిన తర్వాత కొన్ని ప్రాంతాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక నిర్మాణ సామాగ్రి చేరుకోవడం కష్టతరంగా మారింది. అలాంటి సవాళ్ల మధ్య గిరిశిఖర గ్రామాలకు సైతం డోలీ కష్టాలనుంచి విముక్తి కల్పించాలన్న దృఢ సంక >>2

తిరుమల మొదటి ఘాట్‌లో కారు బోల్తా: కర్ణాటక భక్తుని మృతి

తిరుమల,ఆగస్టు 7ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్‌రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఘోరప్రమాదం జరగడంతో ఒకరు మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. >>2

అమిత్‌షాతో స్పీకర్ ఓం బిర్లా భేటీ 5లో

మాజీ మంత్రి సీదిరికి బెయిలు తిరస్కృతి

శ్రీకాకుళం, ఆగస్టు 7 ప్రభాతవార్త: కాశీబుగ్గ పారిశ్రామిక వాడ వద్ద గత నెల 10వతేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎ3 ముద్దాయిగా రిమాండ్‌లో ఉన్న మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బెయిల్ ఫిటీషన్ సొంపేట కోర్టు తిరష్కరించినట్లు తెలిసింది. మాజీ మంత్రి అప్పలరాజు ఇప్పటికే 15రోజులుగా జిల్లా జైలులో ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నారు. ఇటీవల పలాస కోర్టు లో మాజీమంత్రి డాక్టర్ అప్పలరాజుకు పోలీసు విచారణకు అనుమతి ఇవ్వాలని కాశీబుగ్గ పోలీసుల కోరడంతో ఆయనకు 4వ తేదిన పలాస పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో కాశీబుగ్గ పోలీసులు ఈ నెల 4వ తేదిన మాజీ మంత్రి అప్పలరాజుకు జిల్లా జైలు నుంచి కాశీబుగ్గ పోలీస్ స్టేషనుకు తీసుకువచ్చి సాయంత్రానికి మళ్లీ జిల్లా జైలుకు పంపించారు. ఈ నెల 5వ తేది నాటికి అప్పలరాజుకు 14 రోజులు రిమాండ్ పూర్తి కావడంతో 5వ తేదిన జిల్లా జైలు నుంచే మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజుకు వర్చువల్‌గా హాజరు పరచగా పలాస న్యాయమూర్తి యు.మాధురి మరో 14 రోజులు రిమాండ్‌విధించారు. ఈ నెల 5వ తేదిన సొంపేట కోర్టులో అయన తరువు న్యాయవాది వరిశ బాలక్రిష్ణ మరో మారు బెయిల్ పిటిషన్ దాఖలు చేసి >>2

భారీగా ఐఎఎస్‌ల బదలీ

పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం తదితర కీలకశాఖల్లో 22 మంది మార్పు

విజయవాడ,ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టింది. మొత్తం 22మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్‌లను కేటాయించింది. పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం, హౌసింగ్, టీటీడీ, వీఎమ్ఆర్‌డీఏ, ఏపీ టూరిజం తదితర కీలక శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రావత్ నియమితులమవ్వగా.. పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్యామలరావు, రవాణా శాఖ కార్యదర్శిగా కోన శశిధర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. రానున్న గోదావరి పుష్కరాల కోసం సురేశ్ కుమార్, భరత్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జయకృష్ణ, ఏపీఎస్ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్ నియమితులయ్యారు.ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆమ్రపాలిని రిలీవ్ చేసిన ప్రభుత్వం ఆమెను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అలాగే.. తేజ్ భరత్, బి.అనిల్ కుమార్ రెడ్డిలను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచించింది. పి.రవి సుభాష్‌కు ఏపీటీడీసీ ఎండీగా బాధ్యతలప్పగించింది. ఇకపురావస్తు శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజు, ఆరోగ్య శాఖ కమిషనర్‌గా చక్రధర్ బాబుకు అదనపు బాధ్యతలు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా అరుణ్ బాబు నియమితులయ్యారు. విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కమిషనర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రభల గోపీనాథ్, ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పద్మావతి నియమితులయ్యారు. అదేవిధంగా హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా హెప్సిబా రాణి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బి.సునీల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ భారీస్థాయి ఐఏఎస్ బదిలీలతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పలు ముఖ్యశాఖలకు కొత్త అధికారులను నియమించడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో మరింతసమర్థవంతమైన పాలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

రణస్థలానికి తోటపల్లి నీరు తెస్తా

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం, 15 లోగా పంటల బీమా నమోదు చేసుకోవాలి, ఎపి ఎఐ ఐఎంఎస్ యాప్ ద్వారా సేవలు

వేల్పురాయిలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు

రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 7, ప్రభాతవార్త : రైతుల సంక్షేమం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రణస్థలం మండలం వేల్పురాయి గ్రామంలో నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు.రాష్ట్రంలోనే అత్యల్పంగా భూగర్భ జలాలు ఉన్న మండలాల్లో రణస్థలం ఒకటని, వందల అడుగుల లోతుకు బోర్లు వేసినా నీరు పడని తీవ్ర పరిస్థితి ఇక్కడ నెలకొందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తోటపల్లి ప్రాజెక్టు నీటిని రణస్థలం మండలానికి తీసుకువచ్చే బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల సహకారంతో 9 రకాల విత్తనాలతో కూడిన ప్రత్యేక కిట్లను రైతులకు తక్కువ ధరకే పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలకు రక్షణ కల్పించేందుకు పంటల బీమా గడువును ఈ నెల 15వ తేదీ వరకు ఖరారు చేశామని మంత్రి తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంక్ మేనేజర్లే బీమా చెల్లిస్తారని, రుణాలు తీసుకోని

రైతులు స్వయంగా ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఈ బీమా ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతుల సౌకర్యార్థం 'ఏపీ ఏఐఐఎంఎస్' రిజిస్ట్రేషన్ యాప్ లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ యాప్ ద్వారా భూమి వివరాలు, వేసే పంటలు, మార్కెట్ ధరలు, విక్రయించే ప్రాంతాల సమాచారంతో పాటు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ వారం రోజుల కార్యక్ర మంలో వ్యవసాయ అధికారులు ప్రతీ రైతుతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం మం డలాల్లో మొక్కజొన్న సాగుచేసే రైతులు ఎదుర్కొంటున్న నీటి >>2

విశాఖ రైల్వేజోన్ రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు

విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి: విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అతిస్వల్ప కాలంలోనే రికార్డు స్థాయి పురోగతి సాధించి, వార్షికంగా రూ.2,493 కోట్ల రాబడితో వెల్లడించింది. దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.54,000 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, మరో రూ.71,000 కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని పేర్కొంది. విశాఖ రైల్వే యార్డ్ ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లు కేటాయించామని, అందులో భాగంగా 6 కొత్త ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేసింది.

అలాగే గుంతకల్‌బళ్లారి నాలుగు లైన్ల విస్తరణకు రూ.1,205 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. రైళ్ల భద్రత కోసం 100 ఇంజిన్లలో 'కవచ్' వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపింది. ఏపీ వ్యాప్తంగా 300కు పైగా ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, అమృత్ భారత్ కింద 70కి పైగా స్టేషన్ల అభివృద్ధి, విజయవాడలో స్లీపింగ్ పాడ్స్, రాబోయే గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లతో రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను వేగంగా ఆధునీకరిస్తున్నట్లు వివరించింది.

జూరాల 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

ప్రసవాలు

వైద్యమా! వ్యాపారమా?

కాసులకోసం కత్తెర..

తల్లుల ప్రాణాలతో చెలగాటం!

కుటుంబాలపై లక్షల్లో భారం..

ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ప్రైవేటు ఆసుపత్రులు

యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త: ప్రసవం వైద్య అవసరమా... లేక వ్యాపార అవకాశమా? యాదాద్రి భువనగిరి జిల్లాలో గత పదేళ్ల ప్రసవాల గణాంకాలు ఈ ప్రశ్నను బలంగా ముందుకు తెస్తున్నాయి. ప్రభుత్వం సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలు, ఉచిత చికిత్స, ప్రత్యేక వైద్య బృందాలు అందుబాటులోకి తీసుకొస్తున్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం సిజేరియన్ కాన్పులే ఆదాయ వనరుగా మారాయనే ఆరోపణలు అధికారిక గణాంకాలతోనే బలపడుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఈ బర్త్ పోర్టల్‌లో నమోదైన వివరాల ప్రకారం 2016-17 నుంచి 2025-26 వరకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగిన ప్రతి 100 ప్రసవాల్లో దాదాపు 87 ప్రసవాలు సిజేరియన్‌లే కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వైద్య అవసరం ఉన్నప్పుడే చేయాల్సిన శస్త్రచికిత్సలు ఇప్పుడు సాధారణ ప్రక్రియగా మారిపోయాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.పదేళ్లకాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 33,935 ప్రసవాలు జరిగాయి. అందులో 13,527 సాధారణ ప్రసవాలు, 20,408 సిజేరియన్ ప్రసవాలు నమోదయ్యాయి. మరోవైపు ప్రైవేట్ ఆసుప >>2

పిడుగుల వానలు!

బంగాళాఖాతంలో అల్పపీడనం

విజయవాడ.ఆగస్టు7, ప్రభాతవార్తప్రతినిధి: ఉపరితల ఆవర్తన ప్రభావంతో 24 గంటల్లోపు అంటే శనివారం సాయంత్రానికి వాయువ్య బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో రానున్న రెండురోజులు రాష్ట్రంలో మేఘావృతమైన వాతావరణంతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శనివారం శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.శనివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం, విశాఖ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపిఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

8-8pg2exHMNWJQE.qxd:8-8pg2exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1

త్వరలో బిసి చట్టం

>> సిఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంఅభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని, ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "స్వదేశీ ఉద్యమ స్పూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే 'నేతన్న సేవల్లో' పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కుఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూ రులో చేనేత,హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నం లో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది" అని సిఎం చంద్రబాబు అన్నారు.

"బిసిలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బిసిల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బిసిలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లలో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి- ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా గడచిన 2 ఏళ్లల్లో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం: "చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. చక్కగా పని చేసిన వారిని ప్రజలు అభినందించాలని సూచించారు. సంతృప్తికరంగా పని చేయని అధికారులను పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

శుక్రవారం చేనేత దినోత్సవంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి సవిత

రణస్థలానికి తోటపల్లి నీరు తెస్తా

>> ఎద్దడి, మద్దతు ధరల సమస్యలపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు మాట్లాడారు. మద్దువలస కాలువ నీటిని బుడుమూరు చెరువుకు మళ్లించి పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. 50వేల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉన్న తోటపల్లి ప్రధాన, పిల్ల కాలువలను బాగు చేసి టైల్ ఎండ్ భూములకు నీరందిస్తామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.20వేలు అన్నదాత సుఖీభవ సకాలంలో ఖాతాల్లో జమ కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మొక్కజొన్న రైతులకు దళారుల దోపిడీ నుంచి విముక్తి కల్పించేలా ముందస్తు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పప్పుధాన్యాలు ఎంత పండిస్తే అంత కొంటాం: కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. వరికి ప్రత్యామ్నాయంగా కందులు, మినుములు ఎంత మేర పండిస్తే అంత ఉత్పత్తిని కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రాగులు వంటి చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, రాష్ట్రంలో రైతులు పండించే రాగులను ప్రభుత్వమే సేకరించి పంపిణీ చేస్తుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రతి పొలానికి వెళ్లి రైతులకు ప్రత్యామ్నాయ సాగుపై చైతన్యం తీసుకురావాలని స్పష్టం చేశారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెంచుకుందాం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వాతావరణ మార్పులను తట్టుకుని రైతులకు నిలకడైన రాబడి అందించేందుకు నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. హెక్టారుకు కేవలం రూ.600 విత్తన వ్యయంతో భూసారాన్ని పెంచుకోవచ్చని, సీఆర్‌పీల ద్వారా విత్తన పెల్లెటైజేషన్‌పై క్షేత్రస్థాయిలోనే శిక్షణ ఇప్పిస్తామన్నారు. నవధాన్యాల వల్ల యూరియా వాడకం తగ్గుతుందని, ప్రతికూల వాతావరణంలోనూ రైతులకు కనీస ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' కింద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అంతకుముందు మంత్రి అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని పంట పొలంలో నాట్లు వేసిన వరి పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఇతర అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మెడికో ప్రియాంకను కారుతో ఢీకొట్టిన కేసు

ఇద్దరు నిందితుల అరెస్టు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు7,ప్రభాతవార్త: వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన కేసులో అరెస్టు చేసిన ఇరువురు నిందితులను పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారిద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించారు. ఈమేరకు రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్ సిఐ బాజీ లాల్ తెలిపారు. ఈనెల మూడో తేదీన ప్రసాదిత్య మాల్ వద్ద జరిగిన కారు ప్రమాద ఘటనలో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ విద్యార్థి మలి వెంకట దుర్గా సాయి ఉమేష్ హాస్పిటల్ స్టేట్మెంట్ ప్రకారం అలాగే ప్రసాదిత్య మాల్ మేనేజర్ విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితుడు సురావరపు ద స్వంత మద్యం మత్తులో కారును నిర్లక్ష్యంగా నడిపి స్కూటర్ను వెనకనుంచి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి మెయిన్ రోడ్డు పై బలంగా గుద్దడంతో ప్రియాంక అక్కడికక్కడే రోడ్డుపై పడిపోయి తీవ్రగాయాలు పాలయ్యింది. ఉమేష్ కూడా గాయాలు కావడంతో వారి ఇద్దరిని స్వతంత్ర హాస్పిటల్ లో జాయిన్ చేశారు. ప్రియాంక పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. ఆమెకు హైదరాబాద్ లోనే వైద్యం అందిస్తున్నారు. ఈ కేసులో సురావరపు దస్వంత్, ఆంధ్రు జోసెఫ్ ఆడ్ వర్డ్స్ లపై ప్రకాష్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రియాంక, ఉమేష్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు సోమవారం ప్రసాదిత్య మాలలో మొదట షో సినిమా చూసి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. రాజమహేంద్రవరంలో వాహనం ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఏలూరు రేంజ్ డిఐజితో మాట్లాడి ప్రమాద ఘటనను సీరియస్ గా తీసుకోవాలన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థులు ప్రియాంక ,ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ ప్రమాద ఘటనపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ గా తీసుకున్నారు. ప్రియాంకకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా

ప్రధాని మోడీకి మంగళగిరి చేనేత వస్త్ర బహూకరణ

విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్, సానా సతీష్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేష్ తదితర ప్రముఖులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మన సాంప్రదాయ చేనేత కళాకారుల శ్రమను, నైపుణ్యాన్ని అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్‌కే తలమానికమైన, అలాగే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ప్రసిద్ధ చేనేత వస్త్రాన్ని వారు ప్రధాని మోడీకి అందించారు.ఆయనను మంగళగిరి చేనేత దుశ్శాలువాతో సత్కరించారు.ఇక కూటమికి చెందిన ఎంపీలందరికి ప్రధాని నరేంద్ర మోడీ ఆత్మీయ అతిథ్యం ఇచ్చారు. జనసేన,టీడీపీ,బిజెపి ఎంపీలతో కలిసి ఆయన విందులో పాల్గొన్నారు.

శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని చేనేత వస్త్రాలతో సత్కరిస్తున్న టిడిపి, జనసేన ఎంపీలు

జంతర్‌మంతర్‌ను 'బందీ'ని చేయొద్దు

>> షన్‌పై విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ, శాంతిభద్రతలు తమ పరిధిలోకి వస్తాయి కాబట్టి ఈ విషయంపై ఢిల్లీ పోలీసులే నిర్ణయం తీసుకుంటారని కోర్టు పేర్కొంది. ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (ఎఐడిసిఆర్‌పిసి) దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారిస్తోంది. ఈ కమిటీ తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ ఘోస్ వాదించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన కోసం గుమిగూడనున్న 75 మంది వ్యక్తుల బృందం కోసం అనుమతి కోరుతున్నామని, ఈ అనుమతి దరఖాస్తుపై ఢిల్లీ పోలీసులు నిర్ణయం తీసుకోవాలని మాత్రమే తాను అభ్యర్థిస్తున్నానని ఘోస్ సమర్పించారు. "నగరాన్ని బందీగా పెట్టవద్దు. ఈ విషయంపై పోలీసులను నిర్ణయం తీసుకోనివ్వండి' అని జస్టిస్ మహాజన్ వ్యాఖ్యానించారు.

తాను ప్రజాస్వామ్య నిరసనలకు వ్యతిరేకం కాదని, వాటి వల్ల సాధారణ ప్రజా జీవనం స్తంభించకూడదనే అంశాన్నే ప్రస్తావిస్తున్నానని జస్టిస్ మహాజన్ చెప్పారు. షాహీన్‌బాగ్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తించిందని సంజయ్ ఘోష్ గుర్తు చేయగా.. 'అవును.. కానీ నగరాన్ని బందీగా మార్చకూడదు కదా' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. అనంతరం ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాఖలు చేసిన నిరసన అనుమతి దరఖాస్తుపై ఆగస్టు 8లోగా నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

సాయికృష్ణ కేసులో కొనసాగుతున్న కానిస్టేబుళ్ల విచారణ

విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలక నిందితులను గత మూడు రోజులుగా కస్టడీలో తీసుకుని విచారిస్తుంది. ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితులు బాబూరావు, సాంబయ్యలను కూడా సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా, చెప్పాల్సింది ఏమీ లేదని వారు తెలిపారు. అయినప్పటికి సిట్ వారిని ప్రశ్నించి,నిజాలు రాబట్టే ప్రయత్నం చేస్తుంది.ఇప్పటి వరకు హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నానిలను సిట్ విచారిస్తున్న క్రమంలో వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు సాంకేతిక కారణాలతో తిరస్కరించింది. కస్టడీలో నిందితులను విచారిస్తున్న సిట్ సాయికృష్న మృతదేహాన్ని ఏం చేశారనేది ప్రశ్నిస్తుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నానిలను కస్టడీలోకి తీసుకుని, "శవాన్ని ఏం చేశారు?" అనే ప్రధాన ప్రశ్నతో ఉక్కిరిబిక్కిరి చేసింది. విజయవాడ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఐజీ రవిప్రకాష్ పర్యవేక్షణలో సిట్ బృందం వీరిద్దరినీ వేర్వేరుగా విచారించింది. సాయికృష్ణను కోర్టులో ఎందుకు హాజరుపరచలేదని, స్టేషన్‌లోనే మరణించాడా? అనిప్రశ్నించగా, స్టేషన్‌కు తీసుకురావడం వరకే తమకు తెలుసని వారు బదులిచ్చారు.గంజాయి సరఫరాదారుల కోసం గుణదలకు వెళ్లినప్పటి టవర్ లొకేషన్ ఆధారాలను చూపించగా, ఒక నిందితుడు తనకు గుర్తులేదంటూ సమాధానాన్ని దాటవేశాడు. లాకప్‌లో గాయపడిన సాయికృష్ణకు చికిత్స అందించేందుకు ఆర్ఎంపీ డాక్టర్‌ను ఎవరు పిలిచారని అడగ్గా, ఇద్దరూ మౌనం వహించారు.

డోలీల్లేని ఊళ్లు చూడాలి

>> ల్పంతో ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు.అటవీ అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు శాఖల మధ్య సమన్వయ బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రికార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ అనుమతుల ప్రక్రియ పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకాలు ఏర్పడిన ప్రాంతాలు మినహా, మిగిలిన అన్ని ప్రాంతాల్లో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను చేరువ చేయాలన్న బలమైన సంకల్పంతో ప్రధాన మంత్రి మోదీ సహకారంతో చేపట్టిన అడవితల్లి బాట పనుల్లో నాణ్యతా లోపాలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని తెలిపారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్రోచెట్ లేస్ కళాకారుల కష్టాలను తెలుసుకున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మసకబారిన వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు. వైద్య పరీక్షలు చేయించి వదిలేయకుండా, 141 మందికి కళ్లజోళ్లు సిద్ధం చేయించారు. గత నెల విజయవాడ వేదికగా ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ నిర్వహించిన హస్తకళా మహోత్సవ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన పవన్ కళ్యాణ్ కళాకారులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా పలువురు హస్తకళాకారులు తమ వృత్తిని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను ఉపముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చారు. నరసాపురం నియోజకవర్గం పరిధిలోని పసలదీవికి చెందిన క్రోచెట్ లేస్ కళాకారిణి మహాలక్ష్మి తన ఆరోగ్య సమస్యను వివరించారు. చిన్న చిన్న నమూనాలను గంటల కొద్దీ చూస్తూ ఉండడం వల్ల చూపు మందగిస్తోందని, కంటి పరీక్షలు చేయించాలని కోరారు.అదే వేదికపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్లవారీగా హస్తకళాకారుల కోసం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో నరసాపురంలో క్రోచెట్ లేస్ కళాకారుల కోసం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 141 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు సూచించారు. ఆ 141 మందికి పవన్ కళ్యాణ్ కళ్లజోళ్లు ఏర్పాటు చేశారు.

దేశంలోనే తొలిసారిగా హస్తకళలకు క్యూఆర్ కోడ్ వేసే ప్రక్రియకు లేపాక్షి సంస్థ శ్రీకారం: ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా లేపాక్షి సంస్థ కార్యాచరణ చేపట్టింది. దేశంలోనే తొలిసారిగా హస్తకళలకు క్యూఆర్ కోడ్ వేసే ప్రక్రియకు లేపాక్షి సంస్థ శ్రీకారం చుట్టింది. కళ, ఉత్పత్తి వివరాలు ప్రతిపాదికన ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చారు. కొనుగోలుదారులు వస్తువుపై ఉన్న కోడ్‌ను మొబైల్‌తో స్కాన్ చేస్తే ఆ కళాఖండానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు. ఆ వస్తువు చరిత్ర, సాంస్కృతిక విశిష్టత, తయారు చేసిన కళాకారుడి పేరు, వారి నైపుణ్యం, తయారు చేయడానికి వారు పడిన కష్టం, ఉపయోగించిన ముడిసరుకు, తయారీకి పట్టిన సమయం, వస్తువు కొలతలు వంటి వివరాలతోపాటు, దానికి భౌగోళిక గుర్తింపు లేదా ఒక జిల్లా-ఒక ఉత్పత్తి గుర్తింపు ఉందా అనే వివరాలు వస్తాయి.

ఆడపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన వారికి అదే చివరి రోజు: సిఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం ఘటనలో నిందితులపై చర్యలు

విజయవాడ,ఆగస్టు7,ప్రభాతవార్తప్రతినిధి: ఆడపిల్లలపై దాష్టీకానికి పాల్పడిన వారికి అదే చివరి రోజు అనే విషయం గుర్తుంచుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. రాజమహేంద్రవరంలో మెడికోలను వాహనంతో ఢీ కొట్టిన ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఈ ఘటనపై అధికారుల సమీక్షలో ఆయన ఆరా తీశారు. బాధిత మెడికోలు ప్రియాంక, ఉమేష్ ఆరోగ్య పరిస్థితిని ఉన్నతాధికారులను అడిగి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారు. మెడికోలు తీవ్రంగా గాయపడడం బాధాకరమని అన్నారు. ఈ ఘటన జరిగిన తీరును సీఎంకు అధికారులు వివరించారు. మద్యం మత్తులో ఇద్దరు మెడికోలను కారుతో ఢీ కొట్టి అనంతరం పరారయ్యారని చెప్పారు.నిందితులను వెంటనే అరెస్ట్ చేశామని సీఎంకు అధికారులు తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ వద్దని వారికి సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మెడికో ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బుధవారం రాత్రి రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌కు ఇద్దరు యువకులు బాగా తాగి వెళ్లారు. వీరి పరిస్థితిని చూసిన మాల్ సిబ్బంది బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షి ంచి.. వారిని మాల్‌లోకి అనుమతించలేదు. దాంతో మాల్ సిబ్బందిపై వారు కోపంతో రగిలిపోయారు. కారును వేగంగా పోనిచ్చారు. సరిగ్గా అదే సమయంలో గేటు ముందు నుంచి వెళ్తున్న స్కూటీని కారుతో బలంగా ఢీకొట్టారు. ఓవర్ స్పీడ్‌తో స్కూటీనీ మళ్లీ ఢీకొట్టారు. దాంతో స్కూటీ వెనుక ఉన్న మెడికో కింద పడిపోయింది. దీంతో ఆమెకు తీవ్రంగా గాయపడింది.మూడోసారి అదే స్పీడ్‌తో ఆమె తలపై నుంచి కారు పోనిస్తూ ముందుకెళ్లారు. దాంతో ఆమె బ్రెయిన్ డెడ్ అయింది. ప్రస్తుతం ఐసీయూలో ఆమె చికిత్స పొందుతుంది. ఇక స్కూటీ నడిపిన ఆమె స్నేహితుడు ఉమేష్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు.. రాజమండ్రి సమీపంలోని నామవరానికి చెందిన వారిని పోలీసులు చెప్పారు. బ్రెయిన్ డెడ్ అయిన ప్రియాంక.. రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో పీజీ చదువుతోంది. ప్రియాంకకు మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు.ఘటన కారకులపై అసహనం వ్యక్తం చేసారు.నిందితుల ప్రవర్తనావళిపై పూర్తి ఆరా తీసుకోవాలన్నారు.వారిపై కఠిన శిక్షలతో కేసు నమోదు చేయాలన్నారు.

విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు రాజీనామా

విజయవాడ.ఆగస్టు 7,ప్రభాతవార్తప్రతినిధి: విజయా డైరీ ఛైర్మన్ పదవికి చలసాని ఆంజనేయులు రాజీనామా చేసారు. టీడీపీ అధిష్టానం సూచన మేరకు ఆంజనేయులు రాజీనామా చేశారు. కృష్ణ మిల్క్ యూనియన్‌కు టైటిల్ డీడ్ కల్పించాలన్న ఆంజనేయులు సూచనకు అధిష్టానం సానుకూలంగా స్పందించింది. ఛైర్మన్ ఎన్నిక ఆలోచించి చేద్దామన్న తెలుగుదేశం పార్టీ అధిష్టానం సూచనలు బేఖాతరు చేస్తూ చలసాని నామినేషన్ దాఖలుచేశారు. ఈ నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ ఆయనను పార్టీ ఆదేశించింది. దీనిని ఆయన ధిక్కరించారు. ఈ నేపథ్యంలో పార్టీ కావాలో? పదవి కావాలో? తెల్చుకోవాలనంటూ చలసాని ఆంజనేయులకు అధిష్ఠానం తేల్చి చెప్పింది. తనకు కొంత సమయం ఇస్తే నిర్ణయం చెబుతానని అధిష్ఠానానికి తెలిపారు. సమయం ఇవ్వడం కుదరదంటూ చలసాని ఆంజనేయులకు అధిష్ఠానం స్పష్టం చేసింది. తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు పార్టీకి ఆయన తెలియజేశారు. అనంతరం ఆసుపత్రిలో చేరినట్లు పార్టీ అధిష్ఠానానికి ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయ డెయిరీ డైరెక్టర్లతో మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి సమావేశమయ్యారు.చలసానితో వారు మాట్లాడారు.చలసానికి నచ్చ చెప్పిన మీదట ఆయన రాజీనామా చేసారు.

కొరడా తీస్తా

>> తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇసుక సరఫరా వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నెల రోజుల్లోగా పరిస్థితి మారకపోతే నేను స్వయంగా ఇసుక క్వారీల వద్దకు వచ్చి కూర్చుంటాను, అక్రమాలను సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ఎవరైనా వ్యవహారిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు సభలో విశేష ప్రాధాన్యతను సంతరించుకోగా, అక్రమ ఇసుక తవ్వకాల నియంత్రణపై ప్రభుత్వం కఠిన వైఖరితో ముందుకు సాగుతుందనే సంకేతాలను ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో చేనేత మంత్రి సవిత, జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా అధికార యంత్రాంగం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెయిలు తిరస్కృతి

>> వాదనలు వినిపించగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు నిమిత్తం 6వ తేదికి ఈ కేసును వాయిదా వేయగా 6వ తేదిన పి.పి వాదనలు వినిపించగా 7వ తేదీకి ఆర్డర్ కోసం వాయిదా వేశారు. సొంపేటకోర్టు వారు 7వ తేదిన మాజీ మంత్రి అప్పలరాజు బెయిల్ పిటీషన్ న్యాయవాది వాదనలపై సొంపేట కోర్టు న్యాయమూర్తి సంతృప్తి చెందక పోవడంతో బెయిల్ పిటిషన్ తిరస్కరించినట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదానికి కారకుడు మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు అరవ్ వర్మ, ఆయన స్నేహితుడు సిద్దార్థ త్యాడీలను ఇటీవల కోర్టు బెయిల్ మంజూరు చేయగా, మాజీ మంత్రి అప్పలరాజుకు మాత్రం కోర్టు బెయిల్ తిరస్కరించినట్లు తెలుస్తోంది.

వారం - వర్జ్యం

08-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.దశమి మ.1.57 న.రోహిణి సా.4.49
వ.1. ఉ.9.26-ఉ.10.54
వ.2. రా.9.55-రా.11.23
దు.తె.5.49-ఉ.7.28
రాహు.ఉ.9.00-ఉ.10.30,
శుభ ఉ.7.00-8.00

వార్తాఫలం

మేషం : ఎంతో కాలముగా వాయిదా పడుతున్న విషయములు పరిష్కారమవుతాయి. వస్తు కొనుగోలు.

వృషభం : విద్యా వాణిజ్య రంగములలో, ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకర వాతావరణము సమకూరుతుంది.

మిథునం : విరాళములు, చందాలు, ఋణాలు, పన్నులు వీటి విషయాలలో ఒత్తిడి రావచ్చు. ప్రయాణాలు లాభిస్తాయి.

కర్కాటకం : అతిథి మర్యాదలకు అధిక ఖర్చులు చేస్తారు. సన్నిహితుల నుండి రహస్య సమాచారము అందుకుంటారు.

సింహం : మీ కార్యక్రమములకు, సంతానము యొక్క అభివృద్ధికి ఆటంకములను కల్పించే యత్నములు జరుగును.

కన్య : ముఖ్యముగా మీ ప్రతిష్టను దెబ్బతీసే యత్నములు అధికము కావచ్చును. విందు, వినోదాలలో పాల్గొంటారు.

తుల : ఆత్మీయులు, శ్రేయోభిలాషులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటా బయటా అనుకూలము.

వృశ్చికం : ప్రయోజనములు తాత్కాలికముగా మీ చేతికి అందకపోయినా ఉనికికి మాత్రము ముప్పు లేదు.

ధనుస్సు : ఋణ సంబంధమైన చికాకులు తీరతాయి. కోర్ట్ వ్యవహారములు మీకే అనుకూలము. కాంట్రాక్ట్‌లు లభిస్తాయి.

మకరం : బంధువులకు సంబంధించిన కొన్ని వ్యవహారములను పర్యవేక్షించవలసి వస్తుంది. ఇంటా బయటా అనుకూలం.

కుంభం : గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు అనుకూలించవు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

మీనం : మీతో విభేదించి సోదర వర్గీయుల నుండి, సన్నిహితుల నుండి వినూత్న రీతిలో రాజీ యత్నములు వస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

కారు బోల్తా: కర్ణాటక భక్తుని మృతి

>> కర్ణాటక బెంగళూరు బన్నేరుగట్ట రోడ్ గొట్టిగేరికి చెందిన నలుగురు కుటుంబసభ్యులతో డాక్టర్ సతీశ్‌కుమార్ (70) ఇద్దరు పిల్లలతో శుక్రవారం ఉదయం శ్రీవారిదర్శనానికి తిరుమలకు వచ్చారు. దర్శనం ముగించుకుని సాయంత్రం తిరుగుప్రయాణమయ్యారు. తిరుపతికి దిగే మొదటిఘాట్‌లో 22వ మలుపు వద్ద కారు అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. ఆ వెంటనే పక్కనే ఉన్నసుమారు 20అడుగుల లోతులో పడిపోయింది. ఈ సంఘటనతో కారులో ఉన్న డాక్టర్ సతీశ్‌కుమార్ కుమారుడు సాయి శ్రీనివాస్, కుమార్తె సింధుఉడత్, మనవరాళ్లు తియా, నైరాలకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరగడంతో ఘాట్‌లో రెండుకిలోమీటర్లు మేర వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్‌స్తంభించింది. సమాచారమందుకున్న అలిపిరి విజిలెన్స్ ఏవీఎస్ఒ రమేశ్ కృష్ణ, తిరుమల ట్రాఫిక్ పోలీసులు చేరుకున్నారు. క్షతగాత్రులను తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. కారు 20అడుగుల లోతులో పడటంతో భక్తులు భయంతో వణికిపోయారు. సతీశ్ పరిస్థితి విష మంగా ఉండటంతో స్విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

8-8Pg3exHMNWJQERBPGOL.qxd:8-8Pg3exHMNWJQERBPGOL.qxd 1/1/02 6:04 AM Page 1

నేతన్నలకు సిఎం చేనేత దినోత్సవ శుభాకాంక్షలు

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: నేతన్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్ష లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యుత్ రాయితీలు, 50యేళ్లకే పింఛన్ అందిస్తూ నేతన్నలకు దన్నుగా ఉన్నామని చెప్పారు. 71,536 చేనేత కుటుంబాలకు 'నేతన్న సేవల్లో' ద్వారా సాయం చేస్తున్నామని తెలిపారు. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున రూ.179 కోట్లు అందిస్తున్నామన్నారు. అంతా చేతులు కలుపుదాం, చేనేత కళను కాపాడుదామని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

చేనేతను ఆదరిద్దాం, అండగా నిలుద్దాం

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: చేనేతను ఆదరిద్దాం, అండగా నిలుద్దామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు నిచ్చారు. మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకుందామని అన్నారు. ప్రతి భారతీయుడు చేనేతను దైనందిన జీవితంలో భాగం చేసుకుని నేతన్నలకు అండగా నిలవాలని 'ఎక్స్' వేదికగా కోరారు. ప్రధాని మోడీ వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తితో జాతీయ చేనేత దినోత్సవ సంకల్పమని అన్నారు. చేనేత కేవలం వృత్తి కాదని, మన సంస్కృతి, వారసత్వ సంపదలో అంతర్భాగమని తెలిపారు. చేనేతను కాపాడటమంటే మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమేనని పవన్ అన్నారు. చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. మన చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తెస్తామన్నారు. చేనేత కళాకారులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతికి, చేతిపనితనానికి, స్వావలంబన స్ఫూర్తికి ప్రతిరూపమని పేర్కొన్న ఆయన, చేనేతను ఎంచుకోవడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయవచ్చని చెప్పారు. చేనేత రంగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం తనకు గర్వకారణమని వెల్లడించారు. ఎన్‌డియే ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉచిత విద్యుత్‌తో పాటు రూ.25వేలు ఆర్థిక సాయం అందించే 'నేతన్న సేవల్లో' పథకం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇదే క్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ యువత, కంటెంట్ క్రియేటర్లు చేనేత దుస్తులు ధరించి వీడియోలతో ప్రచారం కల్పించాలన్నారు.

సామాజిక సంస్కర్త లక్ష్మణస్వామి వర్మకు నివాళి

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు నివాళి అర్పించారు. లక్ష్మణస్వామి వర్మ గొప్ప సామాజిక సంస్కర్తగా, ఆయుర్వేద వైద్యునిగా విశేష సేవ లందించారని సిఎం కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సమాజానికి గుర్తింపు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ఎంతో ప్రశంస నీయమన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర ఉత్సవంగా గర్వంగా నిర్వహించు కుంటున్నామని సిఎం తెలిపారు.

ఉపముఖ్యమంత్రి పవన్ నివాళి: పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నివాళి అర్పించారు. ఈ వేడుకను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో ఆత్మగౌరవం కోసం పోరాడిన ఇలాంటి మహనీయులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. గొప్ప సామాజిక సంస్కర్తగా, ఆయుర్వేద వైద్యుడిగా లక్ష్మణస్వామి వర్మ చేసిన విశేష సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని పవన్ గుర్తుచేశారు.

తాడేపల్లిలో మంత్రి సవిత...: అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతి సందర్భంగా మంత్రి సవిత తాడేపల్లిలో నివాళి అర్పించారు. ఆయన పేదల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆయుర్వేద వైద్య రంగంలో 120 రకాల మూలికా ఔషధాలు తయారు చేసి విదేశాలకు సరఫరా చేశారని గుర్తుచేశారు. 1927లో జీవో నెం.271 ద్వారా అగ్నికుల క్షత్రియులకు అధికారిక గుర్తింపు తెచ్చారని తెలిపారు. ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం సమాజానికి దక్కిన గౌరవమని మంత్రి సవిత చెప్పారు.

కృష్ణా జిల్లాలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. జిల్లా పరిధిలోని వేర్వేరు పట్టణాల్లోని విద్యాసంస్థల హాస్టళ్లలో ఇద్దరు యువతులు అనుమానస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి వీరు బలన్మరణాలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. కంకిపాడు శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీలో విద్యార్థిని భాగ్యశ్రీ(18) హాస్టల్ గదిలో ఫ్యాన్ కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నది. భాగ్యశ్రీది నందిగామ మండలం ఐతవరం గ్రామం. ఈమె హాస్టల్ గదిలో ఉరి వేసుకుని మృతి చెందినట్లు విద్యాసంస్థ నిర్వాహకులకు పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కంకిపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుడివాడ హోమియో కళాశాలలో..: గుడివాడ పట్టణంలోని గురురాజు ప్రభుత్వ హోమియో మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గుడివాడ హోమియో కళాశాల విద్యార్థిని లక్ష్మీ తులసి ఆత్మహత్య చేసుకుంది. ప్రైవేట్ హాస్టల్ రూమ్‌లో ఉంటూ చదువుతున్న విద్యార్థిని ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. లక్ష్మీ తులసి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని గుడివాడ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి గుడివాడ వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నరసాపురంకి చెందిన లక్ష్మీ తులసి బంధువులకు సమాచారం విద్యార్థులు అందించారు.

డిఎస్సీపై అసత్య ప్రచారాలను నమ్మొద్దు

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా
- అక్టోబరులో మరో నోటిఫికేషన్ విడుదల చేస్తాం

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: మెగా డిఎస్సీ 2025 నిర్వహణపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలు, ఆరోపణలను అభ్యర్థులు ఎవరూ నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఇప్పటికే డిఎస్సీ ప్రక్రియపై ప్రభుత్వ ఉన్నతాధికారులు మూడుసార్లు స్పష్టమైన వివరణ ఇచ్చినప్పటికీ, ఇంకా దుష్ప్రచారం సాగుతుండటంతో మరోసారి క్లారిటీ ఇస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న సంతోషి పార్వతి, వీవీవీ భాస్కర్ రెడ్డి అనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని వివరించారు. జోన్1 ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 2 ఖాళీలు ఉండగా, హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనల మేరకే అర్హులైన అభ్యర్థికి కేటాయించామని, కడపకు చెందిన భాస్కర్ రెడ్డికి 68వ ర్యాంకురాగా, మొత్తం 8 ఖాళీల్లో చివరి పోస్టు హారిజాంటల్ రిజర్వేషన్ కింద నిజాలీ అభ్యర్థికి దక్కిందని కేస్ స్టడీలతో సహా వెల్లడించారు. డిఎస్సీ 2025ని అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు మొత్తం 12 రకాల భద్రతా విధానాలను అనుసరించామని కమిషనర్ తెలిపారు. ప్రైవసీ, టాంపర్ ప్రూఫ్ భద్రతా వ్యవస్థలోనే ప్రశ్నాపత్రాల రూపకల్పన ప్రక్రియ జరిగిందని స్పష్టం చేశారు.

అత్యంత పారదర్శకంగా స్పోర్ట్స్ కోటా కింద అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ: మెగా డిఎస్సీ 2025 నిర్వహణలో భాగంగా స్పోర్ట్స్ కోటా కింద చేపట్టిన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని శాప్) మేనేజింగ్ డైరెక్టర్ భరణి స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో కూలంకషంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాను రూపొందించామని ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో పిజారి ఇస్మాయిల్ భాషా, అన్వర్ భాషా అనే అభ్యర్థుల జూడో క్రీడా సర్టిఫికెట్లు నకిలీవంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఆ సర్టిఫికెట్లు ఆంధ్రప్రదేశ్ జూడో ఫెడరేషన్ ద్వారా అధికారిక గుర్తింపు పొందినవేనని, దీనిపై సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయడం తప్ప గ్రీవెన్స్ ద్వారా ఎవరూ నేరుగా ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఆ ఆడియో టేప్‌లపై ఇప్పటికే క్రిమినల్ కేసులు: కొన్ని క్రీడా సంఘాలు తమ అంతర్గత విభేదాలతో ఒకరిపై ఒకరు చేసుకుంటున్న ఆరోపణలను కూడా డీఎస్సీ ఎంపిక ప్రక్రియకు ఆపాదిస్తూ అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని ఎండీ ఆవేదన వ్యక్తం చేశారు. అసత్యాలు, పుకార్లతో ప్రచారంలోకి తెచ్చిన కొన్ని ఆడియో టేప్‌లపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు వేగవంతం చేశామని హెచ్చరించారు. డిఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అనర్హులకు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఇప్పటికైనా ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తే, అటువంటి పత్రాలు జారీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎండీ భరణి స్పష్టం చేసారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

- క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే ప్రభుత్వ ఆలోచన అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేసారు. క్రీడలు, మానసిక, శారీరకంగా ఆరోగ్యానికి హేతువులన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పికిల్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఈ లీగ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పికిల్‌బాల్ వంటి నూతన క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ రంగంలో రాణిస్తున్న వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పిస్తుంది. క్రీడాభివృద్ధికి శాప్ ఛైర్మన్ రవినాయుడు

అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవం సందర్భంగా సభా కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన

చేస్తున్న కృషిని అభినందించారు. క్రీడాకారులకు సహకారం అందిస్తున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లకు రాంప్రసాద్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, సినీహీరో సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ

- మహనీయులను గౌరవించడం సంస్కృతిలో భాగం
- మంత్రి నాదెండ్ల మనోహర్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ప్రభాతవార్త: సమాజంలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకోవడం, వారికి గౌరవం అందించడం మన సంస్కృతిలో భాగమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అగ్నికుల క్షత్రియుల జాతిపితగా పిలవబడే పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 157 వ జయంతి వేడుకలను కోరంగిలో బొడ్డు సత్యనారాయణ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 144 ద్వారా శుక్రవారం అధికారికంగా నిర్వహించింది. ఈ మేరకు కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ, విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ కాంస్య విగ్రహాలను మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ నాగబాబు ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ మూల పురుషుల స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని, సమాజ సేవకుల త్యాగాలను స్మరించు కోవడం మన బాధ్యతని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అగ్నికుల క్షత్రియులకు, వేటసాగించే సోదరులకు పూర్తి రక్షణ, ఆర్థిక బాసట కల్పిస్తున్నామని, యువత సోషల్ మీడియా ఉచ్చులో పడ కుండాబాధ్యతాయుతంగా నడుచు కోవాలన్నారు. కోరంగి ప్రాంతంలో సత్యలింగం నాయకర్, లక్ష్మణ స్వామి వర్మ విగ్రహాలను ఆవిష్కరించడం ద్వారా భావి తరాలకు వారి స్ఫూర్తిని అందించే అవకాశం లభించిందనన్నారు. సత్యలింగం నాయకర్ దాతగా, సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచి చేసిన సేవలు చిరస్మరణీయమైన వనన్నారు. యువత సోషల్ మీడియా దుష్ప్రచారాలకు, స్వార్థ రాజకీయ శక్తుల కుట్రలకు లోను కాకుండా, మహనీయుల చరిత్రను అవగాహన చేసుకుని విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సు కు ఉపయోగించాలనన్నారు. జనసేన ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు మాట్లాడుతూ తన జాతి ఆత్మగౌరవాన్ని, భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ గారని కొనియాడారు. ఆనాటి సమాజంలో అవమానాలు ఎదుర్కొంటున్న తన జాతి గుర్తింపు కోసం పూర్వీకుల చారిత్రక ఆధారాలను బ్రిటిష్ పాలకులకు అందించి, వారిని ఒప్పించి అగ్నికుల క్షత్రియులుగా గుర్తింపు సాధించారని తెలిపారు. సమాజానికి, ప్రజలకు ఆస్తులు, చదువులను విద్యాదానంగా అందించిన మహనీయులు కీర్తిశేషులు మల్లాడి సత్యలింగ నాయకర్ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం జిల్లా అధ్యక్షులు వైదాడి నూకరాజు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, బీసీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్, నాగిడి నాగేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, కర్రి పద్మశ్రీ, మల్లాడి రాజేంద్ర, వాడ్రేవు వీరబాబు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ

- అగ్నికుల క్షత్రియుల చరిత్రను చాటిచెప్పిన మహనీయుడు
- ఆయుర్వేదంతో వేలాది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి
- మంత్రి కొల్లు రవీంద్ర

పొన్నమండ లక్ష్మణస్వామివర్మ చిత్రపటానికి మంత్రి రవీంద్ర నివాళి

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజాసేవకు అంకితమైన జీవితంతో సేవా కార్యక్రమాల ద్వారా మన్ననలు పొందిన పొన్నమండ. లక్ష్మణస్వామివర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అగ్నికుల క్షత్రియ జాతిపిత స్వర్గీయ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, అగ్నికుల క్షత్రియ, బిసి సంఘాల నాయకులు తదితరులతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన మహనీయుడు లక్ష్మణ స్వామి వర్మ అని, ఆయన ఆయుర్వేదంతో వేలాది మంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలు, సేవలను స్మరించుకోవడంతో పాటు, వారు చూపిన స్ఫూర్తిదాయకమైన మార్గంలో నడవడం ద్వారా సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం ప్రసాద్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, బిసి సంఘ నాయకులు సంగేపు రంగారావు తదితరులతో పాటు జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు సందర్శించే హక్కు వైసిపికి లేదు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాయలసీమ స్థితిగతులను మార్చే గొప్ప ప్రయత్నాలు గత రెండు సంవత్సరాల కాలంగా నిర్విరామంగా జరుగుతుంటే ఓర్వలేని వైసిపి నాయకులు ప్రాజెక్టుల సందర్శన యాత్రల పేరుతో సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'గొడ్డలి పార్టీ నాయకుల విధానం వాళ్ళు ఏ పనీ చేయరు, చేసేవాళ్లను చూస్తే కడుపుమంట. చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమ ప్రాజెక్టులకు ఒక కొత్త కళ వచ్చింది. 2014 19 మధ్యకాలంలో దాదాపు రూ.68 వేల కోట్లు సాగునీరు, అనుబంధ రంగాల కోసం ఖర్చు చేస్తే, ఒక్క రాయలసీమ ప్రాజెక్టులకే రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టాం. ఐదేళ్లు జగన్‌మోహన్ రెడ్డికి అధికారం ఇస్తే, రాయలసీమ బిడ్డనని నమ్మించి, రాయలసీమ భవిష్యత్తును నాశనం చేశాడు. ఆ ప్రాంత ప్రజల పాలిట నయవంచకుడిగా మిగిలిపోయారు. మేము 2014-19లో రూ.12,500 కోట్లు ఖర్చు పెడితే, 2019-24 మధ్య జగన్ రెడ్డి కేవలం రూ.2,000 కోట్లే. దాంట్లో కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు అత్యంత ప్రధానమైన హంద్రీనీవా కోసం కనీసం రూ.500 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. తాము అధికారంలోకి వచ్చాక ఒకే సంవత్సరంలో రూ.3,870 కోట్లు ఒక్క హంద్రీనీవా ప్రాజెక్టు పైనే ఖర్చు చేశాం. ఈ రెండేళ్ల కాలంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం ఏకంగా రూ.12,484 కోట్లు ఖర్చు చేశాం. రాయలసీమ చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయంగా మిగిలిపోతుంది. అలాంటి చంద్రబాబు నాయుడుపై ఈరోజు అవాకులు, చవాకులు పేలుతూ పనిలేనోళ్లంతా కలిసి ప్రాజెక్టులను సందర్శిస్తున్నారు. ఒక పనికిమాలిన బృందంగా వైసిపి నాయకులను ప్రజలు చూస్తున్నారు. ప్రాజెక్టులు సందర్శించే హక్కు మీకు ఎక్కడ ఉంది? మీరేమైనా ప్రాజెక్టులు కట్టారా? మీ హయాంలో ప్రాజెక్టుల గురించి అసలు మాట్లాడారా? ఆరోజు జగన్ రెడ్డిని ఇదే రాయలసీమ ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైసీపీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదు అని కాలవ శ్రీనివాసులు నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు అడగని వాళ్లు, అభ్యర్థించని వాళ్లు... ఈరోజు తగుదునమ్మా అంటూ రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో పనికిమాలిన బ్యాచ్ అంతా వెళ్లి ప్రజలకు అసత్యాలు చెప్పే ప్రయత్నం చేస్తే మిమ్మల్ని ఎట్లా నమ్ముతారు? అని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల సందర్శన యాత్రలు పెట్టడం అంటే ఆత్మహత్య సదృశ్యమైన చర్య తప్ప మరొకటి కాదన్నారు.

మహిళా బిల్లుతో డీలిమిటేషన్ ముడిపెట్టొద్దు

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళా బిల్లుతో డీలిమిటేషన్ ముడిపెట్టొద్దని, వాటిని విడదీసి మహిళా బిల్లు విడిగా పెడితే ఆమోదించేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఈ రెండిటినీ కలిపి పెట్టడం ద్వారా ప్రతిపక్షాలు మహిళా బిల్లును అడ్డుకుంటున్నాయనే తప్పుడు ప్రచారం చేసేందుకు, బిజెపి దీన్ని ఉపయోగించుకునే ప్రయత్నాలు చేస్తోందనీ అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ముందుకు వస్తున్నారని, వాటిని విడదీసి ప్రవేశపెట్టాలని అన్నారు. మహిళా బిల్లును పెడితే ఆమోదించేందుకు అందరూ సిద్ధమేనని తెలిపారు. డీలిమిటేషన్‌పై ఏకాభిప్రాయం లేదని, ప్రతిపక్ష పార్టీలతోనూ సంప్రదించలేదని తెలిపారు.

అనిశ్చితిలో ఉన్న అంశాన్ని తీసుకొచ్చి మహిళా బిల్లును ఆమోదించకుండా చేసి ప్రతిపక్షాలపై నెపం నెట్టాలనే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. పైగా ఆపరేషన్ లోటస్‌లో భాగంగా ప్రతిపక్ష పార్టీలను చీల్చి తమవైపు తిప్పుకునే ప్రయత్నాలూ చేస్తున్నారని అన్నారు. బిల్లు విషయంలో కేంద్ర ప్రతిపక్షాలతో చర్చించిన అనంతరమే ముందుకు వెళ్లాలని అన్నారు. ఇక కుల నిర్మూలన, మార్క్సిస్టు దృక్పథంపై పుస్తకాన్ని బి.వి. రాఘవులు, వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శులు కె.రామకృష్ణ, రామకృష్ణ పాండా

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: క్యూబాలో 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశంలో పాల్గొనేందుకు వెళుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శులు కె. రామకృష్ణ, రామకృష్ణ పాండాలను ఢిల్లీలో క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ అగ్యిలేరా క్యూబా రాయబార కార్యాలయ ప్రథమ కార్యదర్శి లూపే ఫ్రొమెటా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భారత్- క్యూబా మధ్య చిరకాలంగా కొన సాగుతున్న స్నేహ సంబంధాలు, పరస్పర సహకారం, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి, సంఘీభావ ఉద్యమాలు తదితర అంశాలపై చర్చించారు. క్యూబా ప్రజలతో భారత ప్రజలకు, ముఖ్యంగా భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఉన్న చారిత్రక స్నేహబంధాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శులు గుర్తు చేసుకున్నారు. భారత్- క్యూబా ప్రజల మధ్య మైత్రి, సంఘీభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. క్యూబా విప్లవ చారిత్రక నాయకుడు ఫిడెల్ క్యాస్ట్రో విప్లవ వారసత్వాన్ని పరిరక్షించడం, సోషలిస్టు క్యూబాకు అంతర్జాతీయ సంఘీభావాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రపంచ శాంతి కోసం ఉమ్మడి కార్యాచరణను విస్తరించడం, సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ఐక్యతను పటిష్టం చేయడం ప్రధాన లక్ష్యాలుగా శుక్ర, శనివారాలు రెండు రోజులు హవానాలో 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం జరుగుతుందని రామకృష్ణ తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో దేశాల సార్వభౌమాధికారం, స్వాతంత్రం, ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని పరిరక్షించేందుకు కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల మధ్య ఐక్యత, సంఘీభావం, పరస్పర సహకారం మరింత అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అసమానతలు, దోపిడీ, యుద్ధ ప్రమాదాలు, తీవ్ర మితవాదం, ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేసేందుకు హవానా సమావేశం దోహదపడు తుందని అన్నారు. క్యూబాపై అమెరికా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక, వాణిజ్య, ఆర్థిక వ్యవహారాలు, ఇంధన రంగానికి సంబంధించిన ఆంక్షలపై కూడా ఈ అంతర్జాతీయ సమావేశంలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని కె. రామకృష్ణ తెలిపారు. క్యూబాపై ఆంక్షలను ఎత్తివేయడంతో పాటు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల జాబితా నుంచి క్యూబాను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితి పై కేంద్రం స్పందించాలి

- లోక్‌సభలో నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో కరవు పరిస్థితిపై కేంద్రం స్పందించాలని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి లోక్‌సభలో డిమాండ్ చేసారు. తీవ్రమైన ఎల్ నినో పరిస్థితుల ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర కరువు నెలకొందనీ. జూన్‌లో 25శాతం వర్షపాతం లోటు నమోదవ్వగా, జులైలో ఇప్పటివరకు ఈ లోటు 40శాతం దాటిందని. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ రుతుపవనాల వర్షకాలం సుమారు 27శాతం మొత్తం లోటుతో ముగిసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల అనేక జిల్లాల్లో విస్తృతమైన, తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, భారతదేశానికి వరి ధాన్యాగారంగా కూడా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖరీఫ్ పంటల చక్రంపై ఇది తీవ్ర ప్రభావం చూపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ఇవ్వడానికి చేయగలిగినంత ఉత్తమంగా కృషి చేస్తోందని. తీవ్ర కరవును ఎదుర్కొనే అవకాశం ఉన్న 105కు పైగా మండలాలను, మోస్తరు కరువును ఎదుర్కొనే అవకాశం ఉన్న మరో 208 మండలాలను గుర్తించిందన్నారు. విపత్తులకు ముందు ముందస్తు ప్రణాళిక, సమన్వయ ప్రతిస్పందన, సకాలంలో ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణాలను, జీవనోపాధులను కాపాడాలని ఎల్లప్పుడూ విశ్వసించే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డిఆర్‌ఎఫ్) కింద సుమారు రూ.479.01 కోట్లు విడుదల చేయగా, దీర్ఘకాలిక విపత్తు నివారణ ప్రాజెక్టుల కోసం రూ.521.17 కోట్లు కేటాయించిందన్నారు. ఇతర రాష్ట్రాలు కరువుతో పోరాడుతున్నప్పుడు, మా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత కరవును తగ్గించడంలో సహాయపడిందని. ఆయన తన దీర్ఘకాలిక దార్శనికతతో రాయలసీమ ప్రాంతాన్ని రత్నాలసీమగా మార్చిన



నాయకుడనీ, వైఎస్సార్‌సిపి పాలనలో 2019 నుండి 2024 మధ్య రాష్ట్రంలోని అన్ని కీలక నీటిపారుదల ప్రాజెక్టులు, డ్యామ్‌లు నిర్లక్ష్యానికి గురయ్యాయనీ. దీనివల్ల మా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, 2029 నాటికి రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చి, స్వర్ణాంధ్రను నిర్మించాలన్న మన దార్శనికతను సాకారం చేసేందుకు, 36 ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 35,000 కోట్లు ఖర్చు చేయనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేయగలిగినంత ఉత్తమంగా చేస్తోందని వివరించారు. 'కరవు పరిస్థితిని ఎదుర్కోవడానికి పూర్తి మద్దతు ఇవ్వాలని తాము కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాము. భూగర్భ జలాల పునరుజ్జీవనం, కరవును తట్టుకునే పంటలకు సాంకేతిక మద్దతు, 'ప్రతి బొట్టుకు ఎక్కువ పంట' కార్యక్రమాన్ని విస్తరించడం, వర్షపు నీటి సేకరణ కేంద్రాల నిర్మాణం కోసం మనం కలిసి దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకోవాలనీ, వ్యవసాయ రంగంలోని ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాలలో రైతులకు శిక్షణ ఇవ్వాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాం అని ఎంపి శబరి అన్నారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రతికూల ప్రభావాన్ని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి, రైతులకు మరోసారి మద్దతు ఇవ్వాలని తాము కోరుతున్నామనీ నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు.

తిరుపతిలో ప్రారంభమైన క్రెడాయ్ ఎక్స్‌పో

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో క్రెడాయ్ తిరుపతి ప్రాపర్టీ ఎక్స్‌పో -2026 మొదలైంది. శుక్రవారం ఉదయం ఈ ఎక్స్‌పోను ఎమ్మెల్యే శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే డాక్టర్ భాను ప్రకాష్, టిటిడి బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి, క్రెడాయ్ ఎపి చైర్మన్ బి. శ్రీనివాస్, క్రెడాయ్ తిరుపతి చైర్మన్ కె. గోపీనాథ్, క్రెడాయ్ తిరుపతి అధ్యక్షుడు ఎం. రామ్‌ప్రసాద్ రావు,కార్యదర్శి రాజేశ్‌బాబు క్రియాశీలక నేతృత్వం వహించారు. వేదికపై ఎఎస్వీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన సరితా రెడ్డి, వసుంధర కన్‌స్ట్రక్షన్‌కు చెందిన బిమల్ కుమార్ కేడియా, ఎండి సతీష్ బాబు, ఎస్‌బిఐ డిజిఎం సతీష్ బాబు, ఇండియన్ బ్యాంక్ డిజిఎం హేమ మాలతి, కెనరా బ్యాంక్ జిఎం పి. చక్రవర్తి, క్రెడాయ్ సభ్యులు, స్పాన్సర్లు, బ్యాంకర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహించిన క్రెడాయ్ తిరుపతి నిర్వాహకులను ప్రముఖులు అభినందించారు. నాణ్యమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, గృహ రుణ అవకాశాలను ప్రదర్శిస్తున్న ఈ మూడు రోజుల ప్రదర్శనను ప్రజలు సందర్శించాలని ప్రోత్సహించారు.



వార్త

అవమానించేవాడు ఇసుకపై రాతలాగా వెంటనే దాన్ని విస్మరిస్తాడు. అవమానానికి గురైన వాడు ఇత్తడిపై చెక్కిన రాతలాగా ఎన్నటికీ మరిచిపోలేడు.

- ఆస్కార్‌వైల్డ్

బోఫోర్స్‌'కు చరమగీతం!

బోఫోర్స్ దేశ రాజకీయాలను ఒక్క ఊపు ఊపిన వ్యవహారం. ఆ కథ కంచికెళ్లి చాలా రోజులైంది. కథలు ఎక్కడ పుట్టి ఎక్కడ తిరిగి సంచలనం చేసినా అవి కంచికే చేరుతాయని ప్రతీతి. కానీ 'బోఫోర్స్' కథ మాత్రం చిట్టచివరికి సుప్రీంకోర్టుకు చేరితే తప్ప అంతిమ సంస్కారం జరుగలేదు. అప్పట్లో బోఫోర్స్ కుంభకోణ మంటూ ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీని ఇరుకున పెట్టే తీవ్ర ప్రయత్నమే జరిగింది. 1986 మార్చిలో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఆయుధాల తయారీ సంస్థ ఎబి బోఫోర్స్ సంస్థతో రూ.1437కోట్ల విలువైన 410-155 హోలిట్జర్ గన్ కొనుగోలు ఒప్పందం చేసుకోగా, దానికోసం 1987లో ఈ ఒప్పంద ప్రక్రియలో అక్రమ కమిషన్‌లు స్వీకరించారని ప్రతిపక్షాలు ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీపై తీవ్రఆరోపణలు చేశాయి. ఆ సమయం లో కేంద్ర రక్షణశాఖ మంత్రిగా ఉండడమే ఆయన చేసిన పాపం. భారతదేశ రాజకీయ చరిత్రలో బోఫోర్స్ కుంభ కోణం చాలా కాలం జనం నోళ్లల్లో నానింది. ఇప్పటికీ ఆ పేరెత్తగానే చర్చ మొదలైపోతుంది. అదే విపక్షాలకు అధి కారపక్షంపై విమర్శలు చేసేందుకు ఆటవస్తువుగా మారిం ది. మధ్యవర్తుల ప్రమేయం లేని ఆయుధ వ్యాపార ఒప్పందాలకు బదులు స్వీడన్‌సంస్థ తన వ్యాపారాభివృద్ధి కోసం భారతీయ రాజకీయ నేతలు, రక్షణశాఖ అధికా రులు, మధ్యవర్తులకు మొత్తం రూ. 64 కోట్ల మేరకు ముడుపులు ముట్ట చెప్పిందని ఆరోపణను ఏప్రిల్ 1987 లో స్వీడిష్ రేడియో ఒక నివేదికను ప్రముఖంగా ప్రసా రం చేయడమే ఈ ఆరోపణలకు ఆయువుపట్టు. అందుకే బోఫోర్స్ ఒప్పందంలో లంచాలసంస్కృతి మొదలైందనో అపోహలు, అనుమానాలతో చాలాకాలం బోఫోర్స్ అంశం పత్రికల విభిన్న కథనాలు, విపక్షాల ఆరోపణలతో సాగ తీతకు గురైంది. ఈ అంశంపై దాఖలైన అవినీతి కేసు లన్నీ 2005లోనే ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. రాజీవ్ గాంధీని ఈ కేసు నుండి విముక్తుడిని చేసింది. ఆ తర్వా త సిబిఐ అప్పీల్ కూడా 2018 తిరస్కరించారు. అయినా బోఫోర్స్ అంశంలో ఎంతో దూకుడుగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై చెలరేగిన ఆరోపణలు నిన్నమొన్నటి వరకు హల్‌చల్ చేస్తూనే ఉన్నాయి. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఇదొక చర్చనీయాంశంగా ఊగిసలాడింది. సరిగా బుధవారం సుప్రీంకోర్టులో విచారణకొచ్చిన చిట్ట చివరి కేసుకు తెరపడింది. ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాల్ చేసే తుది పిటిషన్‌గా పేర్కొం టూ ఇకపై ఆరోపణల్లేక, కేసుల్లేక వాయిదాల్లేక అంటూ జస్టిస్ జెబి పార్థీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన అన్ని ప్రక్రియలూ పూర్తిగా ముగిసినట్లుగా సుప్రీం ధర్మాసనం పేకప్ చెప్పే సింది. ఇకపై ఎలాంటి వాదనలు వినేందుకు ధర్మాసనం నిరాకరించింది. రక్షణ ఆయుధాల కొనుగోళ్లపై విషయం లో బోఫోర్స్‌పై ఉన్నసందేహాలు, కమిషన్లు స్వీకరించార ని ఆరోపణలకు గురైన వారి అందరికీ సంబంధిత విష యాలపై కూలంకషంగా సిబిఐ దర్యాప్తుచేసింది. హిందు జా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజా లతోపాటు స్వీడన్‌కు చెందిన ఆయుధాల తయారీ సంస్థ ఎబి బోఫోర్స్ కంపెనీపై ఉన్న అన్నికేసులనూ ఢిల్లీ హై కోర్టుకొట్టేసింది. సిబిఐ దర్యాప్తు తీరుసరిగాలేదని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది కూడా. దాంతో ఇక బోఫోర్స్ ఆరో పణలకు అంతిమ యాత్రేనని భావించారు. కానీ భారతీ య చట్టాల్లో ఉన్నఅన్ని అవకాశాలన్నీ వాడుకుని వివా దాన్ని ఎన్నటికీ మూసివేయకుండా సజీవంగా ఉంచాలనే ప్రయత్నం జరిగింది. ఢిల్లీ హైకోర్టుతీర్పుపై 4522రోజులు ఆలస్యంగా సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలైంది. దానికిప్పు డు సుప్రీంకోర్టు చరమగీతంపాడింది. ఇక బోఫోర్స్, ఆరో పణలు వినిపించవు. కనిపించవు. 2018లోనూ హైకోర్టు లో అప్పీల్ తిరస్కరణకు గురైంది. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఈఅంశానికి పిటీషన్లు, పైపిటిషన్లుండవని వాదన లు ముగించడం ఆహ్వానించదగిన విషయం. అప్పట్లో ఎన్నోసార్లు బోఫోర్స్ కుంభకోణమంటూ విపక్షాల చర్చ పార్లమెంటు ఉభయసభలను స్తంభింపచేసిన పరిస్థితు లుండేవి. ఈఅంశం పేరిట రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ప్రతిష్ట ను దెబ్బతీయడమే ప్రధానలక్ష్యంగా పార్టీలు ఎక్కువగా శ్రమించాయనే చెప్పాలి. ఈ వివాద ప్రస్తావన, విస్తృతి కారణంగానే 1989 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పరా జయం పాలైందన్న విశ్లేషణలు జరిగాయి. రాజకీయాల్లో ఆరోపణలు వేరు. వాస్తవ సాక్ష్యాలతో కోర్టుల్లో నిరూపిత మవడం వేరు. అందుకే అవి కుంభకోణాలుగా మిగిలిపో తుంటాయి. రాజకీయాలున్నంత వరకు ఇలాంటి ఆరోప ణలకు జనం నోళ్లనుంచి విశ్లేషణలు వస్తూనే ఉంటాయి. విదేశీ ఆధారాల సేకరణలో జాప్యం తగిన నిబద్ధత కలి గిన సాక్ష్యాలు లేకపోవడం, నిందితుల మరణం కారణా లతో కేసుబలహీనపడింది. బోఫోర్స్ అవినీతి కుంభకోణం లో వాస్తవమెంత? సందేహాల లోతెంతవంటి అంశాలు ఇప్పటికే తేలనట్లే!. బోఫోర్స్ కేసులను సుప్రీంకోర్టున్యాయ పరంగా తెరదించిందేతప్ప నిజానిజాలపై ఎలాంటి తీర్మా నం చేసినట్లు కాదనుకోవాలి. ఎన్నికల రాజకీయాల్లో అవి నీతి ప్రస్తావనల్లో, దర్యాప్తు సంస్థ వైఫల్యాలపై చర్చించు కున్నప్పుడల్లా ఈఅంశం సజీవంగానే ఉంటుంది. సుప్రీం ఈ కేసును మూసివేసిందంటే దానికర్థం కేసును ఇకపై కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని తెలియచెప్పడ మే. సాధారణంగా అంతర్జాతీయ ఆర్థిక లావాదేవాలు, విదేశీ సాక్ష్యాల సేకరణ, విచారణ ప్రక్రియలో సుదీర్ఘకాలం తీసుకోవడంతో తీర్పువేగం పరిమితమైపోతుంది. నాలుగు దశాబ్దాల సాగతీతలో ఎలాంటి పరిణామాలుంటాయో తెలుసుకోవడానికి ఈ కేసు ఓ ప్రబల నిదర్శనం.



ఇచ్చింది మరిచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకముంచుకోవడమే స్నేహం.

మహాత్మా గాంధీ



ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా ఎప్పటికీ ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.

గౌతమబుద్ధుడు

ప్రజావాక్కు

ప్రకృతి అభివృద్ధి సమన్వయమే శాశ్వత పునాది

భారత్‌వేగంగా అభివృద్ధి చెందుతోంది. జాతీయ రహదా రులు, రైల్వే కారిడార్లు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కులు, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ దేశ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అయితే ఈ ప్రగతి ప్రకృతి వనరుల సంరక్షణతో సమన్వయంగా సాగితేనే దీర్ఘకాలికఫలితాలు లభిస్తాయి. అభివృద్ధి, పర్యావరణ పరి రక్షణ రెండూ పరస్పర విరుద్ధాలు కావు. సరైన విధానా లతో ఒకదానికొకటి బలాన్ని చేకూర్చగలవు. 1987లో బ్రంట్‌లాండ్ కమిషన్ నివేదిక ఆధారంగా ఐక్యరాజ్యసమి తి ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి భావన ప్రపంచ విధా నాలకు దిశానిర్దేశం చేసింది. భావితరాల అవసరాలను దెబ్బతీయకుండా నేటి అవసరాలను తీర్చేఅభివృద్ధినే నిజ మైన ప్రగతిగా నిర్వచించింది. భారత అటవీ సర్వేప్రకారం దేశంలోఅటవీ, వృక్ష సంపదకలిపి8.27 లక్షల చ.కి.మీ., అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో 25.17 శాతం ఉంది. ప్రకృతి-అభివృద్ధిసమన్వయమే ఆర్థికవృద్ధికి, పర్యావరణ భద్రత కు, సుస్థిర భారత నిర్మాణానికి శాశ్వత పునాది.

- సి,సాయిరుత్విక్, శ్రీకాకుళం

ప్రజలకు చేరువుగా..

భారత్ ఇప్పుడు సరికొత్త ఆలోచన దిశగా ప్రయాణం చేస్తున్నది. ప్రపంచానికి ఒక కొత్త దారిని చూపుతోంది. ఆ యువ ఉద్యమనాయకుడు సరికొత్త నినాదంతో బయ లుదేరాబోతున్నాడు. ప్రజల దగ్గరికివెళ్లే ఉద్దేశంతో ప్రజల మనసులో ఏముందో తెలుసుకోవడానికి ప్రజల సమస్య లు దగ్గరగా వినడానికి ప్రజలదగ్గరికి వెళ్ళబోతున్నారు. ఇదిమంచినిర్ణయమే కాకస్ఫూర్తి వంతమైనాఅడుగుకూడా. ప్రతి నాయకుడు ఎప్పుడు గొప్ప నాయకుడు అవుతాడు అంటే ప్రజలకు చెరువుగా వెళ్ళినప్పుడు. ప్రజలకు మంచి చేయాలి అంటే రాజకీయ నాయకులే కానవసరం లేదు ప్రభుత్వాలపైన ఒత్తిడి తెచ్చి ప్రజలకు మంచి చేయొచ్చు.

- భారత అవినాష్, జనగాం

సోషల్ మీడియా తగ్గించాలి

ఇటీవలి కాలంలో చిన్న పిల్లలు సోషల్ మీడియా వాడ కం విపరీతంగాపెరగడంతో పిల్లలఆరోగ్యం దెబ్బతినడం తో పాటు భవిష్యత్ జీవితంలో ఇబ్బందులు పడే అవకా శంఉంది. కావున తల్లిదండ్రులు పిల్లలతో వీలైనంత ఎక్కు వ సమయం గడపాలి. వీలైనంత వరకు దూరంగా ఉంచడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

అసెంబ్లీ సమావేశాలలో భూ ఆక్రమణపై చర్చ!

చంద్ర బాబుగారు ప్రభుత్వ భూములు అక్రమిస్తే జైలే గతి అన్నాడు. పవన్ కళ్యాణ్ గారు అటవీ భూములు ఆక్రమిస్తే తాట తీస్తానన్నాడు. ఇద్దరి ప్రకటనలు నిలబెట్టుకునే విధంగా, నిరూపించుకునే విధంగా రాష్ట్రంలో దొంగబాబాలు ఆక్రమిం చిన ప్రభుత్వభూములను స్వాధీనంచేసుకొని , జైలుకు పంప డం, తాట తీయడం జరగాలంటే అసెంబ్లీలో దొంగబాబాల భూఆక్రమణల మీద చర్చ జరగాలి. ఏజిల్లాలో ఎ బాబా ఎన్ని ఎకరాలు ఆక్రమించాడు, స్వాధీనం చేసుకోలేక పోవటానికి కారణాలు ఏమిటి? ప్రభుత్వం ఎక్కడ వైఫల్యం చెందింది? ఎవరైనా అడ్డుపడుతున్నారా? అలా అడ్డుపడే వారి మీద చర్యలు స్పష్టంగా జరగాలి. సుప్రీం కోర్టు ప్రభుత్వభూముల్లో మతపరమైన చిహ్నాలు ,బొమ్మలు , మందిరాలు ఉండకూడ దని చాలాసార్లు రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. సుప్రీం తీర్పును అమలు పరచే విధంగా చర్యలు చేపట్టాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నవరంగల్ జిల్లా ఖానాపురం మండ లం అశోక్ నగర్ ఎస్టీ సైనిక్ స్కూల్, కరీనగర్ జిల్లా రుక్మా పూర్ ఎస్సి సైనిక్‌స్కూల్ ఈ2 సైనిక్ స్కూల్‌లలో డిప్యూటే షన్‌లను రద్దు చేయాలి. ఇక్కడ 700 మంది కి పైగా విద్యా ర్థులున్నారు. అడ్మినిస్ట్రేషన్ పరంగా ఇద్దరు టీచింగ్ సిబ్బంది అవసరం. జనరల్ నాలెడ్జి, పోటీ పరీక్షలు, ఉద్యోగం నోటిఫి కేషన్‌ల గురించి తెలియజేయడం కోసం అదనంగా ఇద్దరు టీచింగ్ సిబ్బంది అవసరం. ఇక్కడ పనిచేసేవారిని ఇతర చోట్ల కు డిప్యూటేషన్లు రద్దుచేసి సైనిక్ స్కూల్‌లలో సేవలందించే విధంగా కృషి చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోరోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమా దాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదా రులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు ప్రమాదకరం గా దెబ్బతిన్నరోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారు లు ప్రమాదాలకు గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోనేకాకుండా నగరాల్లో కూడారోడ్లను బాగు చేయాలి.

-టి. యోగేందర్, నల్గొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ఇకనైనా ఈ చావులను ఆపలేమా?

మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా ఆదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే పోలీసుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అన్నట్లు తమ మామూళ్లు తమకు వస్తే చాలన్నట్లు కొన్ని ప్రాంతాల్లో వ్యవహరిస్తున్నారు. ఇక లోపభూయిష్టమైన రోడ్ల నిర్మాణాలకు కారకులైన కాంట్రాక్టర్లను, ఇంజినీర్లను ప్రమాదాలకు బాధ్యులుగా చేసి కటకటలావెనక్కి నెట్టాలి. మొత్తం మీద నీచేతన్, నాచేతన్ వరమడిగిన కుంతి చేతన్...అన్నట్టు అందరూ ఈ చావులకు బాధ్యులే. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ఈ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాలు తీసిన వాహనచోదకులకు కఠిన జైలు శిక్షతోపాటు మళ్లీ జీవిత కాలంలో వాహనం నడపడానికి వీలు లేకుండా చట్టాన్ని సవరించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ సమీక్షలు, సమావేశాలు, పత్రికా ప్రకటనలతో కాలం గడిపితే ఈ మారణహోమం ఆగదు.

దామెర్ల సాయిబాబ

యుద్ధానికి వెళుతున్న వీరుడు విజయమో, వీరస్వర్గమో అన్నట్టుగా కదనరంగంలో దూకుతాడు. అయితే యుద్ధంలో విజయం సాధించి తిరిగి రావడమో, లేక పోరులోఅమరుడు కావడమో జరుగుతుంది. అలా యుద్ధంలో అసువులు బాసి నా దానికి ఒక లక్ష్యం, అర్థం, పరమార్థం ఉంటుంది. వీట న్నింటికి మించి దేశం కోసం ప్రాణత్యాగం చేశామనేమాటల కందని తృప్తి ఉంటుంది. మనదేశం కోసం యుద్ధంలో అసువులు బాసిన మన వీర జవానులను ఇప్పటికీ మననం చేసుకుంటూనే ఉంటాం. జోహార్లు అర్పిస్తూనే ఉంటాం. కానీ ఏలక్ష్యం లేదు. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు రోడ్డుప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవి తాంతం నరకం అనుభవిస్తున్నారు. కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ తాజా లెక్కల ప్రకారం గత యేడాది దేశవ్యాప్తంగా లక్షాఎనభై మూడువేల మందిని ఈ రోడ్డు ప్రమాదాలు కబళించాయి. అంతకుముందు యేడాది కంటే దాదాపు మూడున్నర శాతం ఎక్కువైనట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి వెలువడిన నివేదికను పరిశీలించి నా ఈ విషయం స్పష్టమవుతున్నది. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో రోజుకు సగటున నాలుగువందల ఎనభైఐదు మందికిపైగా ప్రాణాలు కోల్పో తుండగా, 1292 మంది గాయపడినట్లు ఆ నివేదిక వెల్ల డిస్తున్నది. ఇవన్నీ అధికారిక లెక్కలే. పోలీసు రికార్డుల్లోకి రాని, అందని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. ప్రమా దాల్లో చనిపోయేవారిలో అధికశాతం ఇరవై ఏళ్ల నుంచి ముప్పైఐదుయేళ్ల లోపువారే. ఈ ప్రమాదాల గూర్చి పాలకు లకు తెలియంది కాదు. ప్రమాదాల్లో ప్రముఖులు ఎవరైనా చనిపోయినప్పుడు, పెద్ద ఎత్తున మరణాలు సంభవించిన ప్పుడు వీటిని నివారిస్తామని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పెద్ద పెద్ద ప్రకటనలు ఇవ్వడం, హడావుడి చేయడం, ఆ తర్వాత మరచిపోవడం సంప్రదాయంగా మారిపోయింది. ఇప్పుడేకాదు దశాబ్దాల తరబడి ఇదే తంతు జరుగుతున్నది. విజయవాడలో రోడ్డు ప్రమాదంలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ముఖ్య కార్యదర్శి రాఘవేంద్ర రావు మరణించినప్పుడు దాదాపు అధికార యంత్రాంగం అంతా విజయవాడకు వెళ్లింది. సుదీర్ఘచర్చ జరిపారు. అప్ప టికప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకునేందుకు అంకురార్పణ జరిగింది. రోడ్డు భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొన్ని మార్పులతో మరింత పటిష్టంగా పర్యవేక్షణ చేసేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారిని ఆ విభాగానికి అధిపతిగా నియమించారు. ఆతర్వాత ఎన్నో మార్పులు, చేర్పులు జరిగాయి. అప్పటి నుంచి ఆ అధికారికి కార్యాలయానికి యేటాలక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండ్కు విభాగాలు ఏర్పడ్డా యి. కానీ ఆ రెండు విభాగాల అధిపతులను పని చేయ నీయకుండా కేవలం సంతకం పెట్టివెళ్లే పరిస్థితి కల్పించి మూలన కూర్చోబెట్టి జీతభత్యాలు చెల్లిస్తున్నారు. తమకు నచ్చని, తమ మాట వినని అధికారులను పనిష్మెంట్‌లాగా ఈ పోస్టులో నియమిస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత సమ ర్థులుగా పేరు తెచ్చుకున్న కొందరు అధికారులను సైతం రాష్ట్రాల్లో ప్రభు త్వాలు మారినప్పుడు ఈ విభాగంలో అధిపతిగా పని లేకుండా కూర్చోబెట్టిన సందర్భాలు ఎన్నో

ఒక్క మాట

ఉన్నాయి. ఇక కేంద్రస్థాయిలో కూడా ప్రయత్నాలు జరుగు తున్నాయి. రోడ్డు ప్రమాదాల తీవ్రతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం2005లోనే కేబినెట్ సబ్ కమిటీ సూచన మేరకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిర్వహణ అంశంపై ఎస్.సుందర్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను సమగ్ర అధ్యయనం చేసిన కమిటీ 2007 ఫిబ్రవరిలో ఒక నివేదిక సమర్పించిం ది. ఎనభైశాతం ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించడం తదితర కారణాల వల్లనే జరుగుతున్నాయనేది ఆ కమిటీ నివేదికలో పేర్కొన్నది. అభివృద్ధికి సోపానాలుగా వర్ధిల్లాల్సి న రహదారులు వికలాంగమో, వీరస్వర్గమో అన్న ట్లుగా దాపురిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితేరాబోయే దశాబ్దకాలంలో మరెన్ని లక్షల మంది అసువులు బాస్తారో? మరెన్ని కోట్ల మంది క్షతగాత్రులవుతారో?. తాజాగా మొన్న సోమవారం రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో ఇద్దరు యువకులు కారుతో ఢీకొట్టడంతో పోస్టుగ్రాడ్యుయేట్ చేస్తు న్న మెడికో చావు బతుకుల మధ్య మృత్యువుతో పోరాడు తున్నది. మద్యం మైకంలో ఇద్దరు యువకులు సోమవారం రాత్రి మొదటిసినిమా అయిపోయిన తర్వాత రెండో సినిమా చూసేందుకు కారుతో స్పీడ్‌గా ఆవరణలోకి ప్రవేశించారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిపరిస్థితి చూసివెంటనే బయటకు వెళ్లమని హెచ్చరించడంతో కోపోద్రేకులైన ఆ యువకులువచ్చిన దానికంటే వేగంగా కారులో బయటకు వస్తున్న సమయంలో మొదటి సినిమా చూసి బయటకు వస్తున్న మెడికోలను ఢీకొట్టడంతో కిందపడిపోయారు. ఎం దుకు ఇలాచేశారని అడుగుతున్న దశలోనే అవేమీ పట్టించు కోకుండా అంతకంటే రెట్టింపు స్పీడ్‌తో వారిపైనుండికారును పోనివ్వడంతో మెడికో తలపై నుండి కారు టైర్ వెళ్లింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు ఆస్పత్రికి తర లించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్సకోసం తల్లి దండ్రులు ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్లు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆమెకు బ్రెయిన్ డెడ్‌అయినట్లు సమాచారం. ఇలాం టి సంఘటనలు మద్యంమత్తులో వాహన చోదకుల వల్ల ఎన్నో జరుగుతున్నాయి. భర్తలను కోల్పోయిన భార్యలను, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ఇలా ఒక్కరేమిటి గతపదేళ్లలో దేశంలో లక్ష లాది కుటుంబాలు పడుతున్న మానసిక వేదనవర్ణనాతీతం. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన అభాగ్యులకు ఏమిచ్చినా, మాటలతో ఎంత ఊరట కలిగించినా ఆలోటును తీర్చలేం, పూడ్చలేం. తమ ఆప్తులను కడసారి చూడడానికి కూడా నోచుకోనివారెందరో ఉన్నారు. లక్షలాది మందిని పొట్ట న పెట్టుకుంటున్న ఈ ప్రమాదాల నివారణకు త్రికరణశుద్ధి గా ప్రయత్నం జరగడం లేదేమోననిపిస్తున్నది. సమీక్షలు, సమావేశాలకు, అధ్యయనాలకు కొరత లేదు. ఎన్నో ప్రతిపా దనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రమాదా లకు మూలకారణాల గూర్చి ఇప్పటివరకు ఎన్నో అధ్యయన కమి టీలు నివేదికలు ఇచ్చాయి. ముఖ్యంగా మద్యం వాడకం పెరగడం కూడా ఈ ప్రమాదాలను పెంచుతున్నది. లైసెన్సు విధానంలో ఇంకా పటిష్టమైన మార్పులు అవసరం ఉంది. మద్యం ఆదాయాన్ని పెంచుకోవడంకోసం బెల్టుషాపుల పేరు తో ఎక్కడికక్కడ అనుమతులు ఇచ్చారు. రహదారుల వెంట ఉండే అధికార, అనధికార మద్యంషాపులు డ్రైవర్లనుమత్తులో ముంచుతున్నాయి. మితిమీరిన ఆల్కహాల్ తీసుకోవడం వల్ల ఏకాగ్రత లోపించి డ్రైవింగ్ అదుపు తప్పిపోతుందని డాక్టర్లు కూడా అభిప్రాయ పడుతున్నారు. మద్యం ద్వారా జరుగు తున్న ఈ అనర్థాన్ని పాలకులు గుర్తించడంలేదు. గుర్తించినా ఆదాయం ముందు ఈ ప్రాణాలను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇకపోతే పోలీసుల పాత్ర కూడా తక్కువేమీ కాదు. నా చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష అన్నట్లు తమ మామూళ్లు తమకు వస్తేచాలన్నట్లు కొన్నిప్రాంతాల్లో వ్యవహరిస్తున్నారు. ఇక లోపభూయిష్టమైన రోడ్ల నిర్మాణాలకు కారకులైన కాం ట్రాక్టర్లను, ఇంజినీర్లను ప్రమాదాలకు బాధ్యులుగా చేసి కటకటలావెనక్కి నెట్టాలి. మొత్తంమీద నీచేతన్, నాచేతన్ వరమడిగిన కుంతి చేతన్...అన్నట్టు అందరూ ఈ చావుల కు బాధ్యులే. ఇప్పటికైనా పాలకులు కళ్లుతెరవాలి. ఈ ప్రమా దాలకు అడ్డుకట్ట వేయాలి. మద్యంమత్తులో వాహనంనడిపి ప్రాణాలు తీసిన వాహనచోదకులకు కఠిన జైలుశిక్షతోపాటు మళ్లీ జీవితకాలంలో వాహనం నడపడానికి వీలు లేకుండా చట్టాన్ని సవరించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ సమీక్షలు, సమావేశాలు, పత్రికా ప్రక టనలతో కాలం గడిపితే ఈ మారణహోమం ఆగదు. ●

హరిత శక్తే వికసిత భారతానికి పునాది

సి.హెచ్.ప్రతాప్

భారతదేశ ఇంధన రంగంలో గత రెండు దశాబ్దాలుగా ఒక నిశ్శబ్ద విప్లవం చోటుచేసుకుంటోంది. ఒకప్పుడు బొగ్గు, చమురు, సహజ వాయువుపై ఆధారపడిన దేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుతున్న దేశాల్లో ఒకటిగా ఎది గింది. భారతదేశంలో పునరుత్పాదక ఇంధన ప్రయాణం 1980ల లో ప్రారంభమైనప్పటికీ, 2010 తరువాత దీనికి నిజమైన వేగం లభించింది. 2015లో దేశంలో మొత్తం పునరుత్పా దక ఇంధన సామర్థ్యం సుమారు 38గిగావాట్లు మాత్రమే ఉండగా, 2020 నాటికి అది 87 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం (జూన్ 2026 నాటికి) దేశంలో మొత్తం పునరు త్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం 288.58 గిగావాట్లకు చేరింది. ఇందులో సౌరశక్తి ఒక్కటే 162.15 గిగావాట్లతో అగ్రస్థానంలో ఉండగా, పవన విద్యుత్, జలవిద్యుత్, బయో మాస్, చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులు మిగిలిన భాగాన్ని అందిస్తున్నాయి. ఈప్రగతికి ప్రధాన కారణం ప్రభుత్వ విధా నాలే. జాతీయ సౌర మిషన్, పీఎంకుసుమ్, గ్రీన్ ఎనర్జీ కారిడార్, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు, సౌర ప్యానెళ్ల దేశీయ తయారీ, విద్యుత్ పంపిణీ సంస్కరణలు ఈ రంగానికి ఊతమిచ్చా యి. 2024లో ప్రారంభించినప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన హరిత ఇంధన రంగంలో మరోమైలు రాయిగా నిలిచింది. రూ.75,021 కోట్ల వ్యయంతో అమల వుతున్న ఈ పథకం ద్వారా ఒక కోటిగృహాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసి నెలకు 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా ఈపథకం కింద 50లక్షల గృహాలు రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. సుమారు 14.8 గిగా వాట్ల సామర్థ్యం ఇప్పటికే గ్రిడ్‌కుచేరగా, దాదాపు 19లక్షల కుటుంబాలు నెలవారీ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకున్నాయి. లేదా పూర్తిగా శూన్యబిల్లును పొందుతు న్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకం రెండో దశపై దృష్టి సారించింది. రూఫ్‌టాప్ సోలార్‌తో పాటుబ్యా టరీ నిల్వవ్యవస్థలు, గ్రామీణ ప్రాంతాల విస్తరణ, వికేంద్రీ కృత విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని పరిశీలిస్తోం ది. సౌరశక్తి పగటి వేళల్లో మాత్రమే లభించడంతో, బ్యాటరీ నిల్వవ్యవస్థలు భవిష్యత్ విద్యుత్‌భద్రతకు కీలకంగా మార నున్నాయి. అందుకే విద్యుత్ ప్రసార వ్యవస్థల విస్తరణ, శక్తి నిల్వ సామర్థ్యాల పెంపుతదుపరి దశలో అత్యంతప్రాధాన్య అంశాలుగా కేంద్రం గుర్తించింది. భారతదేశం 2030నాటికి 500గిగావాట్ల నాన్‌ఫాసిల్ విద్యుత్ సామర్థ్యం, మొత్తం విద్యుత్ అవసరాల్లో సగానికి పైగా స్వచ్ఛ ఇంధన వన రుల నుంచి సమకూర్చడం, అలాగే 2070 నాటికి నికర సున్నా కార్బన్ ఉద్గారాలు సాధించడం వంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి సంవత్సరం భారీ స్థాయిలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ నిల్వవ్యవస్థలు, గ్రీన్ హైడ్రోజన్‌ఉత్పత్తి, ప్రసార మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు అవసరం. హరిత ఇంధనం కేవలం పర్యావరణ పరిరక్షణకు మాత్రమే కాదు. అది ఇంధన స్వావలంబనకు, రైతుల ఆదాయపెంపు నకు, కొత్తఉపాధి అవకాశాలకు, దిగుమతి చమురుపైఆధార పడటాన్ని తగ్గించడానికి కూడా బలమైన సాధనం. ●

ఎల్‌నినో..ఈ శతాబ్దపు అసలు సవాల్!

డి జె మోహన రావు

ప్రపంచం ఒకే జీవవ్యవస్థగా మారిపోయిన ఈ యుగం లో, మన అభివృద్ధి నమూనా ప్రకృతితో కలిసి నడవ డానికి సిద్ధంగా ఉందా?' ఈ ప్రశ్నకు సమాధానం వెతక కుండా ఇరవై ఒకటవ శతాబ్దపు అభివృద్ధిని అర్థం చేసుకో వడం అసాధ్యం. మానవ నాగరికత ఎంతగానో ముందుకు దూసుకుపోతున్న ఈ తరుణంలో, ప్రకృతితో మన సంబం ధం ఎలాంటిదనే మీమాంస ప్రతి ఒక్కరినీ కలవరపెడు తోంది. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహా సముద్ర జలాలు కొద్దిగా వేడెక్కుతాయి. దాని పేరు ఎల్‌నినో. కొన్ని వారాల తర్వాత భారతదేశంలో వర్షాలపై ఆందోళన మొదలవుతుంది. రైతు ఆకాశం వైపు చూస్తాడు. ప్రభుత్వం రుతుపవనాల అంచనాలను పరిశీలిస్తుంది. మార్కెట్ ఆహార ధరలను లెక్కిస్తుంది. రిజర్వు బ్యాంకు ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. ఒక సముద్రంలో ప్రారం భమైన ఉష్ణ మార్పు మరో ఖండంలోని కుటుంబ బడ్జెట్‌ను ఎలా ప్రభావితం చేస్తుంది? ఈ ప్రశ్నకు సమాధానం వెతికి నప్పుడు మనం కేవలం ఎల్‌నినో గురించి మాత్రమేకాకుండా మనం నిర్మించుకున్న అభివృద్ధి నమూనా గురించి కూడా కొత్తగా ఆలోచించాల్సి వస్తుంది. ఇప్పటివరకు మనం ప్రపం చీకరణను పూర్తిగా మనుషులు సృష్టించిన వ్యవస్థగానే చూశాం. వస్తువులు దేశాలు దాటాయి, పెట్టుబడులుఖండాలు దాటాయి, సమాచారం క్షణాల్లో ప్రపంచాన్ని చుట్టివచ్చింది. ప్రపంచం ఒక గ్రామమైందని గర్వంగా చెప్పుకున్నాం. కానీ ప్రకృతి మనకంటే ముందే ప్రపంచాన్ని ఒకే జీవవ్యవస్థగా మలిచింది. గాలి సరిహద్దులను గుర్తించదు, సముద్ర ప్రవా హాలు వీసాలను అడగవు, మేఘాలు రాజకీయ పటాలను అనుసరించవు. ఒక మహాసముద్రంలో పుట్టిన ఉష్ణం మరో దేశంలో పంటను దెబ్బతీస్తే, ఒక అడవిలో జరిగిన విధ్వం సం మరో ఖండంలోని వర్షపాతాన్ని మార్చగలిగితే, ఒక దేశం విడుదల చేసిన కార్బన్ ప్రపంచ ఉష్ణోగ్రతనుపెంచితే, మనం ఇంకా 'స్థానిక సమస్యలు' అనే పదాన్ని ఉపయోగిం చడం ఎంతవరకు సమంజసం? అభివృద్ధి గురించి మన ఆలోచనల్లో ఒక మౌలిక లోపం ఉంది. ప్రకృతిని మనం ఎప్పుడూ ఒక నేపథ్యంగా మాత్రమే చూశాం. రహదారులు నిర్మించాం, ఆనకట్టలు కట్టాం, పరిశ్రమలు స్థాపించాం, నగరాలు విస్తరించాం. అభివృద్ధి అనేది ప్రకృతిపై మనిషి సాధించిన విజయమని గర్వంగా భావించాం. కానీ ప్రతి వాతావరణ సంక్షోభం ఆ భావనను ఒక్కొక్కటిగా కూల్చే స్తోంది. అభివృద్ధి ప్రకృతిని జయించడం కాదని, ప్రకృతిని విస్మరించి నిర్మించిన నిర్మాణం చివరికి తనకే భారమవు తుందని ఈ శతాబ్దం మనకు కఠినంగా నేర్పుతోంది. ఎల్‌ని నో ఇక్కడ కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ప్రశ్న దాని కంటే చాలా పెద్దది. ప్రకృతివ్యవస్థల్లో ఏర్పడే చిన్న మార్పు లను కూడా తట్టుకునేలా మన ఆర్థిక వ్యవస్థను మనం నిర్మించామా? ప్రపంచ వాతావరణ సంస్థ, వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ నిపుణుల మండలి (ఐపిసిసి) దశాబ్దకాలంగా ఒకే విషయాన్ని హెచ్చరిస్తున్నాయి. వాతా



వరణ మార్పు అనేది భవిష్యత్తులో రాబోయే ప్రమాదం కాదు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మిస్తున్న ఒక వాస్తవిక శక్తి అయినప్పటికీ ప్రపంచ దేశాల అభివృద్ధి ప్రణాళికల్లో వాతావరణాన్ని ఇప్పటికీ ఒకప్రత్యేక అధ్యాయం గా మాత్రమే చూస్తున్నాం. వాస్తవానికి అది ప్రతి ఆర్థిక, సామాజిక అధ్యాయంలో అంతర్భాగంగా ఉండాల్సినఅంశం. వ్యవసాయాన్ని, ఆహార వ్యవస్థను పరిశీలిస్తే ఈ నిజం మరింత స్పష్టమవుతుంది. వర్షాలు తగ్గితే పంటలు దెబ్బ తింటాయని మనకు తెలుసు. కానీ అసలు సమస్య కేవలం పంటల ఉత్పత్తి గురించి కాదు. సమగ్ర ఆహార వ్యవస్థ గురించినది. పొలంలో ప్రారంభమైన సంక్షోభం అక్కడితో ఆగదు. అది రైతు ఆదాయాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. రైతు కొనుగోలు శక్తి తగ్గడంతో గ్రామీణ మార్కె ట్లు మందగిస్తాయి, ఆహార ధరలు విపరీతంగా పెరుగుతా యి. దానివల్ల ద్రవ్యోల్బణం ఎగబాకుతుంది. చివరకు రిజర్వ్ బ్యాంకు విధానం మారి, పెట్టుబడులపై తీవ్రప్రభావం పడు తుంది. అంటే ప్రకృతి ఒక రంగాన్ని మాత్రమే ప్రభావితం చేయదు. రంగాల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాల న్నింటినీ కుదిపేస్తుంది. నీటి కథ కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. మనం నీటిని కేవలం ఒక వనరుగా మాత్రమే చూస్తాం. కానీ ప్రకృతి దానిని ఒక నిరంతర చక్రంగా చూ స్తుంది. వర్షం, నది, భూగర్భ జలం, అడవి, నేల, సముద్రం ఇవి ఏవీ విడివిడిగా పనిచేయవు. కానీ మన అధికారిక ప్రణాళికల్లో మాత్రం ఇవి వేర్వేరు ప్రభుత్వశాఖల బాధ్యతలుగా ఉండిపోతున్నాయి. ఫలితంగా ఒకచోట వినా శకరమైన వరదలు, మరోచోట తీవ్రమైన కరవు, ఇంకొకచోట తాగునీటి సంక్షోభం ఒకేసారి కనిపిస్తాయి. సమస్య నీటి కొరతలో మాత్రమే లేదు. ప్రకృతి ఒక సమగ్ర వ్యవస్థగా పనిచేస్తుంటే, మన పరిపాలన విభాగాలుగా విడిపోయి ఆలోచించడంలోనే అసలు లోపం ఉంది. ఆర్థిక వ్యవస్థ విషయంలోనూ ఇదే సత్యం. స్థూల దేశీయోత్పత్తి వృద్ధిని మనం విజయానికి ఏకైక కొలమానంగా భావిస్తాం. కానీ ఆ వృద్ధి ఏ పునాదిపై నిలబడి ఉంది? తీవ్రమైన ఉష్ణతరంగా లు కార్మికుల ఉత్పాదకతను పూర్తిగా తగ్గిస్తే, తీవ్రమైన నీటి కొరత పరిశ్రమలను మూసివేసేలా చేస్తే, సముద్ర ఉష్ణోగ్ర తలు మత్స్య సంపదను సర్వనాశనం చేస్తే ఆర్థిక వృద్ధి ప్రకృతికి స్వతంత్రంగా ఎలా కొనసాగగలదు? ఇరవై ఒకటవ శతాబ్దంలో అత్యంత ప్రమాదకరమైన భ్రమ ఏమిటంటే ఆధునిక సాంకేతికత ప్రకృతిని పూర్తిగా అధిగమించిందనే అహేతుక నమ్మకం. కృత్రిమ మేధస్సు అద్భుతాలు సృష్టి స్తోంది, ఉపగ్రహాలు అంతరిక్షాన్ని నింపేశాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచాన్ని మార్చేసింది. అయినప్పటికీ కొన్ని డిగ్రీల సముద్ర ఉష్ణోగ్రత మార్పు ప్రపంచ ఆహార ధరలను తల్ల డిల్లజేస్తోంది. అంటే సాంకేతికత ప్రకృతిని ఎప్పటికీ భర్తీ చేయలేదు. ప్రకృతిపై మన ఆధారపడటాన్ని అది మరింత స్పష్టంగా, తీవ్రంగా కనిపించేలా చేసింది. ఈ నేపథ్యంలో అభివృద్ధికి సరికొత్త నిర్వచనం అవసరం. గత శతాబ్దంలో అభివృద్ధి అంటే ప్రకృతి నుంచి వీలైనంత ఎక్కువ వనరులు సేకరించడం. కానీ ఈ శతాబ్దంలో అభివృద్ధి అంటే ప్రకృతి వ్యవస్థలను దెబ్బతీయకుండా సమాజాన్ని స్థిరంగా ముం దుకు నడిపించడం. గతంలో ఆర్థిక వృద్ధి మాత్రమే ప్రధాన లక్ష్యంగా ఉండేది. కానీ ఇప్పుడు సుస్థిరత లేకుండా ఏవృద్ధి కూడా నిలవదని అందరికీ అర్థమవుతోంది. గతంలో ప్రకృతి కేవలం ఒక వనరు మాత్రమే. కానీ ఇప్పుడు ప్రకృతి ఒక భాగస్వామి అని గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది. అందువల్ల భవిష్యత్తులో మనం వేయవలసిన ప్రశ్న 'మనం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాం?'అనేది కాదు. 'మన అభివృద్ధి ఎంతకాలం నిలబడగలదు?' అనేదే. ●

13 మందిపై సిబిఐ ఛార్జిషీటు



నీట్ పేపర్ లీక్ కుట్ర కేసు
ప్రశ్నపత్రాల తయారీ సమయంలోనే లీక్ అయినట్లు సిబిఐ దర్యాప్తులో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 7: పలు రాష్ట్రాల పేపర్ లీక్ కుట్ర కేసులో 13 మందిపై సిబిఐ ఢిల్లీలోని రౌస్ అవెన్యూలో ఉన్న ప్రత్యేక సిబిఐ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. 94 పేజీలతో సిబిఐ ఓ నివేదికను తయారుచేసింది. ఈ ఫైలింగ్‌లో ఎన్‌టిఎకి చెందిన వృక్షశాస్త్ర నిపుణురాలు మనీషా గురునాథ్ మంధారే, రసాయన శాస్త్ర నిపుణుడు ప్రహ్లాద్ కులకర్ణి, భౌతిక శాస్త్ర నిపుణురాలు మనీషా సంజయ్ హవల్దార్ ఎక్స్‌పర్ట్స్ పేర్లను పేర్కొంది. ఎన్‌టిఎ సెంటర్‌లో ప్రశ్నాపత్రాలను తయారు చేస్తున్న సమయంలో ఈ ముగ్గురు నిందితులు ప్రశ్నలను కంఠస్థం చేసి, చిట్టాల మీద రాసుకుని, బుక్స్‌లో సంబంధిత పేరాగ్రాఫ్‌లను మార్క్ చేసి మరీ పేపర్ లీకేజీకి పాల్పడినట్లు సిబిఐ తన రిపోర్టులో పేర్కొన్నది. కొన్ని ప్రశ్నలను ఎన్‌సిఇఆర్‌టి బుక్స్‌లో ఉన్న పేరాగ్రాఫ్‌ల్లో మార్క్ చేసినట్లు సిబిఐ చార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఆ ముగ్గురు నిందితులకు ఎన్టీఏలో క్వశ్చన్ సెట్టింగ్, ట్రాన్స్‌లేషన్ సెక్షన్లకు యాక్సెస్ ఉందని చార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఎన్టీఏ సెంటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని నమ్మకమైన వ్యక్తులు, కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు చేరేలా చేశారు. అయితే ఈప్రక్రియ డిజిటల్ విధానాలను వాడకుండా నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఆర్థికంగా లాభపడేందుకు, ట్యూషన్ విద్యార్థుల్లో సక్సెస్‌రేట్‌ను పెంచేందుకు నిందితులు ఇలా చేశారని సిబిఐ తన చార్జ్‌షీట్‌లో పేర్కొన్నది. ప్రైవేటు కోచింగ్ సెషన్స్ సందర్భాల్లో లీక్ చేసిన ప్రశ్నలను విద్యార్థులతో రాయించారని, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినట్లు కూడా సిబిఐ తన చార్జ్‌షీట్‌లో తెలిపింది. తేలికైన ప్రశ్నలను కంఠస్తం చేసి, ఆ తర్వాత తమ హోటల్ రూమ్‌లో వాటిని పేపర్‌పై రాసుకునేవారని చార్జ్‌షీట్‌లో తెలిపారు. ఎన్‌టిఎ విధి నిర్వహణ లో నూలోపాలు ఉన్నట్లుగుర్తించారు. ఎన్‌టిఎ కేంద్రం వద్దచెకింగ్ కానీ ఫ్రిస్కింగ్ కానీ సమర్థవంతంగా లేదు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటి వరకు మొత్తం 13 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు ఎన్‌టిఎ సబ్జెక్ట్ నిపుణులు కాగా, కోచింగ్ వ్యక్తులు, మధ్యవర్తులు, లాభపడిన విద్యార్థులు ఉన్నారు. ఎన్టీఏలో పనిచేస్తున్న కొందరు తమ అధికారాన్ని వాడుకుని రహస్య సమాచారాన్ని సేకరించినట్లు గుర్తించారు. ఈ కేసుతో లింకున్న సుమారు 20 వేల పేజీల ఆధారాలను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూకోర్టులో సిబిఐ సమర్పించింది. సిబిఐ తన విచారణలో భాగంగా 360 మంది సాక్షులను పేర్కొన్నది. ప్రస్తుతం 13 మంది నిందితులు జుడిషియల్ కస్టడీలోనే ఉన్నారు. మే 12వ తేదీన పేపర్ లీకేజీ కేసులో సీబీఐ ఎఫ్ ఐఆర్ నమోదు చేసింది. 72 మంది ఆఫీసర్లతో బృందాలను ఏర్పాటు చేసింది. 8 మంది సైబర్ ఫోరెన్సిక్ నిపుణులు కూడా సిబిఐ విచారణకుసహకరించారు. మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీతోపాటు ఇతర రాష్ట్రాల్లోని 92 లొకేషన్లలో సోదాలు చేపట్టారు. ఆ తనిఖీల్లో డిజిటల్, కమ్యూనికేషన్ డివైస్‌లు, డాక్యుమెంట్లను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆధారాలకు చెందిన ఫోరెన్సిక్ ఇమేజింగ్ జరిగినట్లు సిబిఐ వెల్లడించింది. డబ్బు లావాదేవీల కోణంలోనూ కూడా దర్యాప్తు చేపట్టారు. అనేక బ్యాంక్ అకౌంట్లు, బ్యాంక్ లాకర్లు, డీమాట్ అకౌంట్లను సీజ్ చేసినట్లు సిబిఐ తన రిపోర్టులో పేర్కొన్నది.

జన్మతః పౌరసత్వం నిబంధనల్లో మార్పులు

రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ సంతకాలు
భారతీయులకు మళ్లీ కష్టాలు

వాషింగ్టన్, ఆగస్టు 7: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకంచేశారు. విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతఃలభించే పౌరసత్వాన్ని పరిమితం చేయడం, బర్త్ టూరిజాన్ని నిషేధించడం ఈ ఉత్తర్వుల ఉద్దేశం. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే వారిని అమెరికన్లుగానే పరిగణించాలని నెల రోజుల క్రితం ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలనే ట్రంప్ ప్రయత్నం అప్పటికి వీగిపోయింది. కానీ,మళ్లీ కొత్త ఉత్తర్వులు ఇచ్చారు. ఇది భారతీయులకు కొత్త కష్టమనే చెప్పాలి.

'జన్మతఃపౌరసత్వ హక్కుకు సంబంధించి సుప్రీంకోర్టులో మాకు వ్యతిరేక తీర్పు వచ్చింది. చాలా స్వల్పతేడాతో వచ్చిన ఆ తీర్పు చాలా దురదృష్టకరం. ఈ క్రమంలోనే మేం కొన్ని సర్దుబాట్లు చేస్తున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే బర్త్ టూరిజాన్ని కూడా నిషేధించాలని అమెరికా ప్రభుత్వం కోరుకుంటోంది. 'బర్త్ టూరిజాన్ని భారీ సంఖ్యలో విదేశీయులు ఉయోగించుకుంటున్నారు. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని పొందుతున్నారు. దానిని అపహాస్యంచేస్తున్నారు. అదంతా అవమానకరం. అలా జరగనివ్వం' అని వ్యాఖ్యానించారు. పుట్టబోయే బిడ్డకు విదేశీ పౌరసత్వం పొందాలనే లక్ష్యంతో నెలలు నిండే సమయంలో గర్భిణీలు వేరే దేశానికి ప్రయాణించి అక్కడ ప్రసవిస్తారు. ఆ దేశపు చట్టాల ప్రకారం అక్కడ పుట్టిన పిల్లలకు దానంతట అదే పౌరసత్వం లభిస్తుంది.

చట్టాలు ఏం చెప్తున్నాయి..

1868 ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అమెరికాలో పుట్టే వారందరికీ (వారి తల్లి దండ్రులు ఆ దేశంలో అక్రమంగా లేదా తాత్కాలికంగా ఉంటున్నా సరే) ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది. విదేశీ దౌత్యవేత్తలు, విదేశాలకు చెందిన దురాక్రమణదారులకు జన్మించే పిల్లలకు మాత్రమే ఇందులో మినహాయింపు ఉంటుంది. జన్మతః పౌరసత్వం లభించడంపై పరిమితులు అమలులోకి వస్తే యేటా దాదాపు 2.5 లక్షల మంది పిల్లలపై వాటి ప్రభావం ఉంటుంది.

ఎన్డీయే కొత్త ఎంపీలతో ప్రధాని మోడీ భేటీ

బిల్లుల ఆమోదం నేపథ్యంలో అల్పాహార విందు

న్యూఢిల్లీ,ఆగస్టు 7: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) రెబల్ ఎంపీలకు ప్రధాని మోడీ భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, తాను వారితో ఉన్నానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాల నుంచి ఎన్డీఏలోకి కొత్తగా చేరిన లోక్‌సభ ఎంపీలతో ప్రధాని మోడీ తన నివాసంలో శుక్రవారం ఉదయం అల్పాహార సమావేశం నిర్వహించారు. గత నెలలో ఉద్ధవ్ ఠాక్రే శివసేన నుంచి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరిన ఏడుగురు ఎంపీలు, నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరిన 20 మంది టీఎంసీ రెబల్ ఎంపీలు, అజిత్ పవార్ ఎన్సీపీకి చెందిన ఇద్దరు ఎంపీలతో సహా సుమారు 45 మంది ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి సర్వోన్నత దేవాలయమని, చర్చలలో చురుకుగా పాల్గొనాలని ప్రధాని మోడీ వారిని కోరారు. సమావేశాల్లో అంతరాయాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం లభించడం లేదని అన్నారు. షిండే సేనలో చేరిన ఏడుగురు మాజీ ఉద్ధవ్ సేన ఎంపీలతో ప్రధాని మోదీ మరాఠీలో మాట్లాడారు. వారికి అన్ని విధాలా మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నా అని భరోసా ఇచ్చారు. ఎన్డీఏ ఒక కుటుంబం. మేము భాగస్వామ్య పార్టీలతో ఉన్నాం. ప్రతి వ్యక్తికి గౌరవం, అవకాశం లభిస్తుంది. నేను ఎన్డీఏలోని కేవలం ఒక భాగస్వామ్య పార్టీతోనే కాదు, ప్రతి ఎంపీతో ఉన్నాను. నేను ఎన్డీఏలోని ప్రతి ఎంపీకి అండగా నిలుస్తాను. మీరు ఎవరి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని వారితో అన్నారు. మరోవైపు నియోజకవర్గాల్లో అభివృద్ధి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడానికి తమ అధికారాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. మీ ప్రాంతంలో ఏ అభివృద్ధి పని కోసమైనా నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పీఎంవో) సంప్రదించండి. పేద కార్మికులు, రైతులతో సహా అందరినీ కలవండి, ప్రతి ఒక్కరి సమస్యలను అర్థం చేసుకోండి అని వారితో అన్నారు. ఆ తర్వాత ప్రధాని మోడీ ప్రతి ఎంపీతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అయితే పార్లమెంట్‌లో కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు తగినంత సంఖ్యా బలం కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్డీఏ కూటమిలోకి కొత్తగా చేరిన ప్రతిపక్షాల రెబల్స్ ఎంపీలతో ప్రధాని మోడీఅల్పాహార సమావేశం పేరుతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తున్నది.

40 యేళ్ల బోఫోర్స్ కేసుకు ముగింపు
చివరి పిటిషన్‌నూ కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సిబిఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 1986లో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఎబి బోఫోర్స్ సంస్థతో రూ.1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ గన్‌ల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. 1987లో ఈ ఒప్పందంలో అక్రమ కమీషన్లు చెల్లించారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. అనంతరం సిబిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా సుప్రీంకోర్టు చివరి పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో బోఫోర్స్ కేసు చట్టపరంగా ముగిసినట్లైంది.

ఎఐతో కొత్త వైరస్‌ల సృష్టి!

మనుషులకు ఎలాంటి హాని జరగదంటున్న శాస్త్రవేత్తలు

వాషింగ్టన్, ఆగస్టు 7: కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి వేగంగా విస్తరిస్తోంది. చివరకు ఈ ప్రకృతిలో లేని వైరస్‌లను సృష్టించేందుకు కూడా శాస్త్రవేత్తలు ఎఐని వాడుతున్నారు. ఇందుకోసం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు జనరేటివ్ ఎఐ మోడల్ ఇఒను ఉపయోగించారు. వైరస్ జన్యుక్రమాన్ని కొత్తగా రాసుకున్నారు. తర్వాత ఆ డిఎన్‌ఎను ల్యాబ్‌లో సింథసైజ్ చేశారు. ఎఐ డిజైన్ చేసిన వైరస్‌లలో 16 పునరుత్పత్తి చెందుతున్నాయని గుర్తించామని చెప్పారు. అవి ఈ-కోలి బ్యాక్టీరియాను చంపుతున్నాయని పేర్కొన్నారు. ఇది సింథటిక్ బయోలజీలో కీలక ముందడుగుగా అభివర్ణించారు. శాస్త్రవేత్తలు గుర్తించిన అంశాలు 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ వైరస్ బ్యాక్టీరియాకు మాత్రమే సోకుతుందని, మనుషులకు ఎలాంటి హాని కలిగించదని చెప్తున్నారు. ఇఒ ఒక లార్జ్ లాంగ్వేజ్ మోడల్. ఇది డిఎన్‌ఎలోని ప్యాటర్న్లను నేర్చుకొని, వాటిని విశ్లేషిస్తుంది. దీనికి లక్షల సంఖ్యలో జీవుల జన్యుక్రమాలపై శిక్షణ ఇచ్చారని అంతర్జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి. సింథటిక్ జయోలజీ రంగంలో ఇది కీలక విషయమే అయినప్పటికీ ఈ సాంకేతికతను మనుషులకు సోకే వైరస్ కోసం ఉపయోగిస్తే ఎలా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. సింథటిక్ బయాలజీ అంటే జీవశాస్త్రానికి ఇంజినీరింగ్‌ను మిక్స్ చేస్తారు. మానవాళికి ఉపయోగపడేలా కణాలను రీప్రోగ్రామ్ చేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

అమిత్ షాతో స్పీకర్ ఓం బిర్లా భేటీ

కొనసాగుతున్న పార్లమెంట్ ప్రతిష్టంభన

న్యూఢిల్లీ, ఆగస్టు 7: ప్రభుత్వం, విపక్షాల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమయ్యారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్య, రామ మందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై చర్చకు విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

జూలై 20న పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ కార్యకలాపాలను అడ్డుకుంటున్నాయి. ఈ క్రమంలో బిర్లా కార్యాలయంలో అమిత్ షా దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పార్లమెంట్ హౌస్‌లోని అమిత్ షా కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. మరోవైపు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్‌రిజిజు శుక్రవారం లోక్‌సభలో మాట్లాడుతూ సభకు ఏ మంత్రి వచ్చి సమాధానం ఇవ్వాలనేది విపక్షాలు నిర్ణయించలేవని స్పష్టంచేశారు. అమిత్ షా ప్రతి రోజూ పార్లమెంట్‌కువస్తున్నారని, రాత్రి ఆలస్యంగాకూడా అక్కడే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు.

అమిత్‌షా సభకు రావాలన్న విజ్ఞప్తిని పరిశీలించాలి: రాజ్యసభ ఛైర్మన్ సిపిరాధాకృష్ణన్

వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు గైర్హాజరవుతున్న క్రమంలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణ గురువారం కేంద్రానికి ఒక విజ్ఞప్తి చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ షా సభకు రావాలన్న విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు. హోం మంత్రి సభకు హాజరు కావాలన్న నా విజ్ఞప్తిని పరిశీలించాలని కోరుతున్నా. పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రిగా విపక్షాల డిమాండ్‌ను మీరే హోం మంత్రి దృష్టికి తీసుకు పోవాలి అని పేర్కొన్నారు.

వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 7: వందేమాతరం గేయానికి మరిన్ని రక్షణలు కల్పించే నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) యాక్ట్2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడాన్ని నేరంగా గుర్తించేలా 1971 నాటి చట్టానికి కేంద్రం తాజాగా మార్పులు చేసిన విషయం తెలిసిందే. జాతీయ గీతం స్థాయిలో వందేమాతరం గేయానికి రక్షణ కల్పించేలా ఈ మార్పులు చేసింది. ఇటీవలే పార్ల మెంటు ఆమోదించిన బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది.

విజయ్ 'విడాకుల'కు శుభంకార్డు!

పిటిషన్ ఉపసంహరించుకున్న భార్య సంగీత
విచారణ ముగించిన చెంగల్పట్టు కోర్టు

చెన్నై, ఆగస్టు 7: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ భార్య సంగీత, చెన్నై సమీపంలోని చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టులో దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. సదరు నటుడు రాజకీయ పదవిని చేపట్టడం వల్ల ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షించిన ఈ కేసు వ్యవహారానికి ప్రస్తుతానికి తెరపడింది. చెంగల్‌పట్టు ఫ్యామిలీ కోర్టు సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, సంగీత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, ఈ ఏడాది ప్రారంభంలో మొదలైన విడాకుల ప్రక్రియను కొనసాగించడానికి తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. "పిటిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై, ఈ కేసును ఇకపై కొనసాగించడానికి ఇష్టపడటం లేదని ధ్రువీకరించారు. ఆమె ఉపసంహరణ పిటిషన్‌ను దాఖలు చేశారు" అని కోర్టు నమోదు చేసింది. ప్రతివాది తరఫు న్యాయవాదికి నోటీసు జారీ చేయబడిందని, వారు ఈ అభ్యర్థనపై ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని కూడా కోర్టు పేర్కొంది. ఆ తర్వాత, అవసరమైతే కొత్తగా ప్రక్రియను ప్రారంభించే వెసులుబాటుతో పాటు, కేసును ఉపసంహరించుకోవడానికి కోర్టు పిటిషనర్‌కు అనుమతినిచ్చింది. "భవిష్యత్తులో అవసరమైతే కొత్త పిటిషన్‌ను దాఖలు చేసే వెసులుబాటుతో, ఈ కేసును ఉపసంహరించుకో వడానికి పిటిషనర్‌కు అనుమతి ఇవ్వబడింది. కాబట్టి, ఈ పిటిషన్ ఆమోదించబడింది" అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కోర్టురికార్డుల ప్రకారం, కేసు స్థితి "అభ్యంతరం లేనిది -ఉపసంహరించబడింది" అని అప్‌డేట్ చేయబడింది. ఈ ఉపసంహరణతో వివాదంలోని వాస్తవాంశాలపై ఎటువంటి తీర్పు లేకుండానే ప్రస్తుత ప్రక్రియ ముగిసింది. పిటిషన్ పరిష్కరించబడకుండా ఉపసంహరించబడింది కాబట్టి, కేసులో మొదట చేసిన ఆరోపణలు లేదా వాదనలను కోర్టు పరిశీలించలేదు లేదా వాటిపై తీర్పు ఇవ్వలేదు. కోర్టు కల్పించిన వెసులుబాటు అర్థంఏమిటంటే, భవిష్యత్తులో పరిస్థితులు అవసరమైతే కొత్త పిటిషన్‌తో మళ్లీ కోర్టును ఆశ్రయించే చట్టపరమైన హక్కు పిటిషనర్‌కు ఉంటుంది.

జస్టిస్ యశ్వంత్ వర్మపై పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 7: అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో తాజాగా ఊరట లభించింది. జస్టిస్ యశ్వంత్ వర్మపై కేసు నమోదు చేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. న్యాయవాది ఘన్‌శ్యామ్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. చౌకబారు పబ్లిసిటీ కోసమే ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారని పిటిషనర్‌పై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయ వ్యవస్థను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికింది. ఇదే అంశంపై గతంలోనూ వచ్చిన పిటిషన్‌నూ కొట్టివేశామని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేసినా నేరపూరిత బాధ్యత తొలగిపోదని ఉపాధ్యాయ్ వాదించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. లాయర్ అయి ఉండి చౌకబారు ప్రచారం కోసం పిటిషన్లు వేస్తున్నారని ఆక్షేపించింది. ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది.

ఇక యుఎస్ నుంచే భారత్‌కు 67% ఎల్పీజి

కేంద్రం సంచలన ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 7: ఇరాన్ యుద్ధం తర్వాత అంతర్జాతీయంగా లెక్కలు మారిపోతున్నాయి. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మీదుగా మనకు ఎల్పీజి నౌకలు ఆలస్యం అవుతుండటం, అటు అమెరికాతో పెరుగుతున్న వాణిజ్య బంధం వంటి కారణాలతో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో అమెరికా నుంచి ఏకంగా 67 శాతం ఎల్పీజి దిగుమతి చేసుకోబోతున్నట్లు కేంద్రం శుక్రవారం సంచలన ప్రకటన చేసింది. గత కొన్ని నెలలుగా చోటుచేసుకుంటున్న పరిణామాల ఫలితంగా అమెరికా మన దేశానికి అతి పెద్ద ఎల్పీజి సరఫరాదారుగా అవతరించిందని కేంద్రం పేర్కొంది. మన ఎల్పీజి అవసరాల్లో కొంత మాత్రమే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలని భారత్ మొదట్లో అనుకుందని, అయితే ఇప్పుడు దాన్ని భారీగా పెంచినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ వెల్లడించారు. దేశ ఎల్పీజి అవసరాల్లో సుమారు 10 శాతం అమెరికా నుంచి దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం ఈ యేడాది ప్రారంభంలో నిర్ణయించిందని, అయితే ఇరాన్ వార్, హర్మూజ్ జలసంధి వ్యవహారాలతో దీనికి సంబంధం లేదన్నారు.

కానీ ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల ఫలితంగా ఇవాళ మన ఎల్పీజి దిగుమతులలో అమెరికా వాటా సుమారు 67 శాతానికి పెరిగినట్లు చెప్పడానికి సంతోషిస్తున్నట్లు హర్దీప్ పూరీ తెలిపారు. చమురు, ఎల్పీజిని వివిధ దేశాల నుంచి కొనుగోలు చేస్తున్నప్పటికీ, తాజా పరిస్థితుల్లో అమెరికా ఎల్పీజి వాటా మాత్రం 67 శాతానికి చేరిందన్నారు. మన గ్యాస్ సరఫరాదారులను వైవిధ్యపరచడం అనేది ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, ఒకే ప్రాంతంపై అధికంగా ఆధారపడటం వల్ల కలిగే ప్రమాదాలను తగ్గించడానికి ఓ మార్గంగా కేంద్రం భావిస్తోంది. అందుకే రిస్కులేని అమెరికా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

సంక్షిప్త వార్తలు

ఓ స్కూల్‌లో విద్యార్థి కాల్పులు..ఏడుగురు మృతి

బ్యాంకాక్, ఆగస్టు 7: థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. నొంతగురి ప్రావిన్స్ బాంగ్ క్రువాయ్ జిల్లాలోని డెబ్సిరిన్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, 15మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు టీచర్లు, ముగ్గురు విద్యార్థులున్నారు. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా తనను తాను కాల్చుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై థాయ్ ఉప ప్రధాని అనుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జంతర్‌మంతర్ వద్ద పింఛన్‌దారుల నిరసన

న్యూఢిల్లీ,ఆగస్టు 7: ప్రధానమంత్రి కాకముందు నరేంద్ర మోడీ, బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ఈపీ ఎస్95 పథకం కింద మెరుగైన ప్రయోజనాల కోసం దశాబ్ద కాలంగా సాగుతున్న తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ వృద్ధ పింఛనుదారులు జంతర్ మంతర్ వద్ద వర్షాన్ని, ఎండను సైతం లెక్కచేయకుండా నిరసన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో దాదాపు 81లక్షల మంది ఈపీఎస్95 పింఛనుదారులు ఉన్నారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఈపీఎస్95 నేషనల్ ఆజిటేషన్ కమిటీ ప్రభుత్వం కనీస నెలవారీ పింఛన్‌ను రూ.1,000 నుండి రూ. 7,500కు పెంచి, కరవు భత్యం, వైద్య ప్రయోజనాలను కల్పించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని హెచ్చరించింది.

బాలివుడ్ నటుడు, బిజెపినేత మిథున్‌చక్రవర్తికి శస్త్రచికిత్స

కోల్‌కత్తా, ఆగస్టు 7: బాలీవుడ్ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఆయనకు గురువారంరాత్రి చిన్నపాటి శస్త్రచికిత్స నిర్వహించినట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి తెలిపారు. ప్రస్తుతం మిథున్ చక్రవర్తి ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. శుక్రవారం సువేందుఅధికారి ఆసుపత్రికి వెళ్లి మిథున్ చక్రవర్తిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితితోపాటు, చికిత్స అందిస్తున్న వైద్య బృందంతోనూ మాట్లాడారు.

జపాన్‌కు ముంచుకొస్తున్న డాల్ఫిన్ తుపాను



టోక్యో, ఆగస్టు 7: ప్రకృతి కోపానికి జపాన్ దేశం మరోసారి గజగజ వణికిపోతోంది. డాల్ఫిన్ అని పిలిచే భయంకరమైన కేటగిరీ1 తుఫాను ఆ దేశ నైరుతి ప్రాంతంపై విరుచుకుపడేందుకు వేగంగా దూసుకొస్తోంది. గంటకు ఏకంగా 198 కిలోమీటర్ల ఈదురుగాలులతో విరుచుకుపడుతున్న ఈ రాక్షస తుఫాను ధాటికి సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. తుఫాను ముప్పు పొంచి ఉండటంతో అప్రమత్తమైన జపాన్ ప్రభుత్వం, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అత్యవసర చర్యలు చేపట్టింది. తుఫాను ధాటికి కాగోషిమా, ఒకినావా జిల్లాల్లోని తీర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది.

ముంబయి మేయర్‌కు బెదరింపు ఇ మెయిల్

ముంబయి, ఆగస్టు 7: బాంబులు పేలుస్తామనే ఈమెయిల్ ముంబై మేయర్ రితూ తావ్డే అధికారిక మెయిల్‌కు వచ్చింది. ఈ ఈమెయిల్ రావడం ఇది మూడోసారి. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముంబై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15కు ముందు పాఠశాలలు, మెట్రో, స్టాక్ ఎక్స్ఛేంజ్, ప్రముఖ వ్యక్తులపై బాంబు దాడులు చేస్తామని హెచ్చరిక ఆ ఈమెయిల్‌లో ఉంది. అంతేకాకుండా ఖలిస్తాన్ అనుకూల నినాదాలతో పాటు కొంతమంది ప్రముఖుల పేర్లు కూడా ఉన్నట్లు సమాచారం.

8-8Pg6exHMNWJQE.qxd:8-8Pg6exHMNWJQE.qxd 1/1/02 6:05 AM Page 1

సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి లబ్ధిదారుడికి అందాలి

• జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇతరత్రా సౌకర్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుపతి లోని పద్మావతి అతిథి గృహంలో భారత జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, రీసర్చ్ అధికారి వరప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుతో కలసి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షి ంచాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే షెడ్యూల్డ్ కులాల కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షి ంచారు. ఎస్సీలపై జరుగుతున్న దాడులు, వివక్ష, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు పరిహారం, న్యాయ సహాయం తదితర అంశాలపై సమీక్షిస్తూ బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, ప్రభుత్వం ద్వారా అందాల్సిన పరిహారం, ఇతర సహాయాలను సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, విద్య, సంక్షేమం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతలపై దాడి..
వైసిపి నేతలపై కేసు

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ ఇంటిపై దాడికి పాల్పడిన వైసిపి అనుచరులపై తిరుపతి రూరల్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వైసిపి అనుచరులు వాసు యాదవ్, సంజీవ్ సునీల్ కుమార్, సుకుమార్, ప్రేమ కుమార్, కృష్ణమూర్తితో మరికొందరు కత్తులు, రాడ్లు, పెట్రోల్‌తో గురువారం వెళ్ళి దాడిచేసే ప్రయత్నం చేశారని, ఈ ఘటనలో అక్కడే ఉన్న శేఖర్, ప్రభు, లోకేష్ గాయపడ్డారని ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు మేరకు జెబి శ్రీనివాస్‌పై, అనుచరులపై హత్యా యత్నానికి పాల్పడ్డారని రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రైతుల సేవలో ఎస్‌పిడిసిఎల్

మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ సర్వీసు దరఖాస్తు సీనియారిటీ

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం తెలిపారు. గతంలో రైతులు వ్యవసాయ విద్యుత్ సర్వీసుకు దరఖాస్తు చేసి, మెటీరియల్, పనుల నిర్వహణ కోసం నగదును చెల్లించినప్పటి నుండి విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు ప్రక్రియలో జాప్యాన్ని అరికట్టడంతోపాటు నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా చర్యలు చేపడుతున్నా మన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో పారదర్శకతను పెంపొందించడంతోపాటు రైతులకు సకాలంలో సర్వీసులను మంజూరు చేయాలనే ఉద్దేశంతో ఈ అంశంలో సంస్కరణలను చేపడుతున్నా మన్నారు. ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ ద్వారా రైతులు వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తు సీనియారిటీని తెలుసుకునే సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. తద్వారా రైతులు విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా దరఖాస్తు నంబరును మొబైల్ యాప్లో నమోదు చేయడం ద్వారా స్థితిని తెలుసు కోవచ్చని సిఎండి శివశంకర్ వివరించారు.

వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తు ఇలా:
మొదటగా ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ లాగిన్ కావాలి. న్యూ కనెక్షన్స్‌పై క్లిక్ చేయాలి. ఆ తరువాత ఎల్‌టి అప్లికేషన్ స్టేటస్‌ను క్లిక్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్ నంబర్‌ను నమోదు చేయాలి. తద్వారా అప్లికేషన్ ప్రస్తుత స్థితిని తెలుసుకోవచ్చని, స్మార్ట్ ఫోన్ అందుబాటులో లేని రైతులు విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచిన సీనియారిటీ జాబితాను పరిశీలించి తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని సిఎండి వివరించారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు పారదర్శక పాలన

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో పారదర్శకతతో ముందుకు సాగుతుందని తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ అన్నారు. తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల వారీగా విభజించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలో అధికారులు చుట్టూ తిరిగిన ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవి కాదని, వాలంటీర్ల పేరుతో ప్రజలకు పరిపాలన అధికారులకు, నాయకులకు అడ్డుగోడ కట్టారన్నారు. వారి ఇష్టానుసారం లంచాలు పొంది పనులు చేయకుండా ఇబ్బంది పెట్టేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 'ప్రజలే నా కుటుంబ్ణం అనే చంద్రబాబు సిద్ధాంతంతో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని జెబి తెలిపారు.

తిరుపతి నగరంలో ప్రజలు రోడ్డు సమస్య లు, విద్యుత్ స్తంభాలు మార్చుట, తిరుమలకు సంబంధించి, టిడ్కో ఇళ్లకు కట్టి ఇల్లు లేకుండా ఉన్న లబ్ధిదారుల డబ్బు తిరిగి ఇప్పించాలని పలు సమస్యలు వచ్చాయి. వాటన్నింటినీ అధికారులకు అప్పగించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాతయ్యగుంట ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, రాష్ట్ర కార్యదర్శి అన్నా అనిత, కుమారమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, నాయకులు యశ్వంత్ రెడ్డి, మన్నెం శ్రీనివాసులు, బివి సంజయ్, ఆముదాల తులసీ, కంకణాల రజనీకాంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీలో జరిగిన అక్రమాలపై సిబిఐతో నిష్పాక్షిక విచారణ చేయాలని, యువతకిచ్చిన హామీలు అమలుచేయాలని మాజీ మంత్రి, వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రతి నిరుద్యోగికి నెలకు 3వేలు రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఒక్కొక్కరికి సుమారు రూ.90 వేలు బకాయి పడిందని అన్నారు. ఈ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. డిఎస్సీ అక్రమాలపై నిగ్గుతేల్చాలని వైసిపి అధిష్టానం పిలుపుతో తిరుపతిలో చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో శుక్రవారం రెండవరోజు మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎన్నికల సమయంలో యువతను మభ్యపెట్టి ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్సీ 2025 పై తక్షణమే సిబిఐతో విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఉమ్మడి చిత్తూరుజిల్లా వైసిపి అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా యువత తీవ్రంగా మోసపోయారని అన్నారు. వెంటనే సిబిఐతో విచారణ చేయాలన్నారు. వైసిపి తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డికి మాజీ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు రెడ్డి సంఘీభావం తెలియజేశారు. ఈ దీక్షలో మాజీ మేయర్ డాక్టర్ శిరీష, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, పార్టీ నాయకులు ఉదయ్‌వంశీ, ఆరే అజయ్, కేతం జయచంద్రారెడ్డి, పసుపులేటి సురేశ్, ప్రవీణ్, ఇమామ్, రాకేశ్. కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఐటియాక్ట్ కేసు

తిరుపతి(క్రైమ్), ఆగస్టు 7 ప్రభాతవార్త: కోట్లలో డబ్బులు ఇవ్వకుంటే కుటుంబాన్ని హతమారుస్తామని బెదిరించిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఐటి యాక్టు కింద కేసు నమోదు చేశారు. తిరుపతి నగరంలోని పోస్టల్ కాలనీలో వంశీ నివాసముంటున్నాడు. ఇతనికి తమిళనాడు విజయ్ హాస్పిటల్‌లో సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ వంశీ, హైదరాబాద్ వనస్థలిపురంకు చెందిన నమ్రత న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు బంబుల్ డేటింగ్ యాప్ ద్వారా పరిచయమయ్యారు. ఇరువురి పరిచయం ప్రేమగా మారి పెద్దల అంగీకారంతో హైదరాబాద్ వనస్థలిపురంలో నిశ్చితార్థం జరుపుకున్నారు. నమ్రత వంశీల మధ్య నగదు, ఆస్తి విషయాలలో గొడవలు రావడంతో ఆపై నిశ్చితార్థం రద్దు చేసుకున్నారు. ఆమె ఈ విషయంపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో గత ఏడాది వంశీపై కేసు నమోదైంది. పోలీసుల నుండి నోటీసులు అందుకున్న వంశీ తిరుపతి పోస్టల్ కాలనీలో ఉంటున్న ఫ్రెండ్స్‌తో కలిసి నివాసముంటున్నాడు. ఈ పరిచయంతో రూ.3 కోట్లు ఇవ్వాలంటూ వంశీని నమ్రత బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బు ఇవ్వకపోతే నిన్ను నీ కుటుంబాన్ని చంపేస్తానంటూ బెదిరింపు మెయిల్స్ చేయడంతో భయంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

తిరుమల సమాచారం

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10.10 లక్షలు

తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో భక్తులకు ఆకలి తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలు ఇస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎస్‌విఎన్ విజయేంద్ర అన్నదానం ట్రస్ట్‌కు రూ.10.10 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని డిడి రూపంలో తిరుపతిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ భానుకు అందజేశారు. విజయేంద్ర మైసూర్‌లో సిఎస్‌ఐఆర్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తన పదవీవిరమణ తర్వాత తిరుమలలో ల్యాబ్‌లో గానీ శ్రీవారి సేవలో ఉచితంగా సేవలు అందిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

కపిలేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం

తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని ప్రసిద్ధ శైవాలయం తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక పర్వదినం సందర్భంగా శుక్రవారం వేడుకలు జరిపించారు. ఆలయం లోపల అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా విశేష అభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం మూలమూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. ఈ తిరువీధి ఉత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి కర్పూర హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందారు.

పట్టీ వ్యవస్థ ద్వారా భక్తులకు అన్నప్రసాదాలు!

• తిరుమలలో ప్రయోగాత్మకంగా పరిశీలన

తిరుమల, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న భక్తుల సంఖ్య సాధారణ రోజుల్లోనూ అనూహ్యంగా రెట్టింప వడంతో ఆలయం వెలుపల వ్యాపించిన క్యూలైన్లలో భక్తులకు సులభంగా అన్నప్రసాదాలు అందించేందుకు పట్టీవ్యవస్థ (ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ వ్యవస్థ)ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనివల్ల భక్తులకు మరింత సులభంగా అన్నప్రసాదాలు అందుకునేందుకు మార్గం సుగమమవుతుందని టిటిడి అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో వేలాది మంది శ్రీవారి సేవకులు రోజువారీగా భక్తుల సేవకు అంకితభావంతో సేవలందిస్తున్న విషయం విదితమే. ప్రతిరోజూ లక్షమందికిపైగా భక్తులు దేశం నలుమూలల నుండి ఇష్టదైవమ్ దర్శనం కోసం తరలివస్తున్నారు. వీరిలో తమిళనాడు, కర్నాటక, తెలుగు రాష్ట్రాలతో బాటు మహారాష్ట్ర భక్తులు కూడా ఉండటం విశేషం. ఇలా వస్తున్న భక్తులు 20వేల మంది దాటితే వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లు 32 నిండిపోయి ఆలయం వెలుపల ఎంబిసి, ఎటిసి, నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు నుండి శిలాతోరణం వరకు క్యూలైన్లు వ్యాపిస్తున్నాయి. సుమారు మరో 40వేల మంది వరకు భక్తులు వెలుపల క్యూలైన్లలోనే గంటల తరబడి నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు కనిపిస్తుంటాయి. ఈ సమయంలో భక్తులకీ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, అల్పాహారం, తాగునీరు, పాలు, మజ్జిగ, కాఫీ వంటి ఆహార పదార్థాలు శ్రీవారి సేవకులతో అందించడం కొంత కష్టంగా మారింది. ఒక ప్రాంతంలో క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తే మరోచోట గంటల తరబడి ఆలస్యమవుతోందనే ఫిర్యాదులు భక్తుల నుండి వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం టిటిడి ఇప్పుడు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. తిరుమలలో రోజువారీగా 1.60లక్షల మంది వరకు భక్తులు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనం, పిఎసి 4, పిఎసి 5, ఫుడ్‌కేంద్రాలలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు టిటిడి గణాంకాలు. మరీ ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన రోజుల్లో వారాంతం రోజుల్లో రద్దీపెరిగితే 2లక్షల మంది నుండి 2.30లక్షల మంది వరకు భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వీటిని అందించడం కూడా ఆలస్యమై భక్తుల్లో అసహనం అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పట్టీ వ్యవస్థ ద్వారా సులభంగా పంపిణీ: తిరుమలలో ప్రస్తుతం ఆలయం వెలుపల క్యూలైన్లు విస్తరించిన సమయంలో 40వేల మంది వరకు భక్తులకు శ్రీవారి సేవకులతోనే సేవలందిసున్నారు. దీనివల్ల శ్రీవారి సేవకులు కూడా కిలోమీటర్ల మేర నడిచి సేవలు అందించాల్సిన పరిస్థితి ఉంది. దీనివల్ల క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉన్నపుడు వారికి శ్రీవారి సేవకులు ఎప్పటికప్పుడు అన్నప్రసాదాలను చేర వేస్తున్నా, రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో క్యూ లైన్లలో ఉన్న భక్తులకు వేగంగా ప్రసాదాలు అందించటం కష్టమవుతోంది. దీంతో టిటిడి సరికొత్త సాంకేతికతకు శ్రీకారం చుట్టింది. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తులకు అన్నపానీయాలు అందిం చేందుకు ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ వ్యవస్థను (పట్టీ వ్యవస్థ) ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకు వచ్చింది. రద్దీ రోజుల్లో దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర భక్తుల క్యూ లైన్లు విస్తరించినపుడు వారికి సేవకులు పాలు, మజ్జిగ, తాగునీరుతో బాటు ఉప్మా, పులిహోర, సాంబారన్నం, టమోటా రైస్ వంటి ఆహార పదార్థాలను యాభై అరవై వేల వరకు భక్తులకు అందజేస్తున్నారు. నూతనంగా ఏర్పాటైన ఫుడ్ సర్విసింగ్ కన్వేయర్ వ్యవస్థ ద్వారా అన్నప్రసాద వితరణ మరింత సలభంగా మారనుంది. దాతల సహకారంతో ఈ మూవింగ్ డైనింగ్ (కదిలే) వ్యవస్థను శిలాతోరణం సమీపంలోని 45వ గేటు వద్ద క్యూలైన్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఫుడ్ సర్వింగ్ కన్వేయర్ పనితీరును టిటిడి అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. శ్రీవారి సేవకులు ఈ కన్వేయర్ యంత్ర సహాయంతో భక్తులకు మరింత సులువుగా ప్రసాదాలను పంపిణీ చేస్తుండటంతో ఈ పట్టీవ్యవస్థ విధానం మరిన్ని ప్రాంతాల్లోనూ అమలు చేయాలని నిర్ణయించారు. ఇది నిరంతరాయంగా గుండ్రంగా కదులుతూనే ఉంటుంది.

ఈ విధానం వల్ల అటు భక్తులకు, ఇటు అన్నప్రసాదాలు పంపిణీ చేసే సేవకులకు ఎంతో సమయం కూడా ఆదా అవుతుంది. పంపిణీ సమయంలో ఎలాంటి తోపులాటలకు అవకాశం లేదు. వెలుపల క్యూలైన్లలోని మిగిలిన కీలక ప్రాంతాల్లో కూడా రానున్న రోజుల్లో మరిన్ని ఫుడ్ సర్వింగ్ కన్వేయర్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టిటిడి అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

అంగరంగ వైభవంగా కార్తీకేయుని రథోత్సవం

శ్రీకాళహస్తి, ఆగస్టు 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన కుమారస్వామితిప్ప ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో జరుగుతున్న మహోత్సవాలు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం 'రథోత్సవం'ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలంకార మండపంలో అలంకార గురుకుల్ రాజేష్, సూరిలు చక్కగా ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ శివయ్య గోపురం, రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ రథంలో ప్రతిష్టించారు.

శ్రీకాళహస్తిలో రథోత్సవం

ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి, కుమారస్వామి ఆలయ మండలి చైర్మన్ నెమళ్ళూరు బుజ్జి, సభ్యులు సుమతి, సతీష్, శ్రీలక్ష్మిలు హారతులిచ్చి గ్రామోత్స వానికి శ్రీకారం చుట్టారు. తేరువీధి, నెహ్రూవీధి, సినిమా వీధి, బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల్లో ఊరేగింపు జరిపారు. ఉత్సవంతో పాటు అర్చకులు షణ్ముగం పాల్గొన్నారు.

తలుపులమ్మ సేవలో మంత్రి అనిత

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 7 ప్రభాతవార్త: కాకినాడ జిల్లా తుని మండలం లోవలో వేంచేసి ఉన్న శ్రీ తలుపులమ్మ అమ్మవారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన హోం మంత్రి అనితకు దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమ పూజలలో మంత్రి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం చైర్మన్ భాస్కర్ సత్యనారాయణ, ఇఒ విశ్వనాథరాజు హోం మంత్రి అనితను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించగా, దేవస్థానం వేదపండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఆషాడమాస ఉత్సవాలలో శ్రీ తలుపులమ్మ అమ్మని దర్శించుకోవడం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వుండాలని అమ్మవారిని కోరుకున్నారు.

కళలను ఆదరిస్తూ భావితరాలకు అందించాలి

తిరుపతి, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: అంతరించిపోతున్న కళారూపాలను ఆదరించి వాటిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త సౌజన్యంతో ప్రతి ఏడాది జాతీయస్థాయి నాటకోత్సవాలను నిర్వహించడం అభినందనీయ మని రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 72వ వార్షిక జాతీయ నాటకోత్సవాలులో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమా లు జరిగాయి. తెనాలి స్వరాజ్యలక్షి ్మ సేవా సమితి బృందం ప్రదర్శించిన 'లీలాకుశుడ్ణు పద్య నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కళాకారుల అద్భుత నటన, పద్య పఠనం, సంగీతం, రంగస్థల ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాటకాన్ని వీక్షి ంచిన అనంతరం నాటక బృందంలోని కళాకారులను అభినందిస్తూ ప్రశంసా పత్రం, షీల్డ్ అంద జేశారు. అనంతరం వెంకటేశ్వర నాట్య కళాపరిషత్ నిర్వాహకులు గుండాల గోపీనాథ్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. నాట్య కళాపరిషత్ కార్యదర్శి కొత్తపల్లి మునిరత్నం, సంయుక్త కార్యదర్శి కొలత్తూర్ భాస్కర్ రెడ్డి, మర్థం గజేంద్ర, కళాకారులు పామూరు సుబ్రహ్మణ్యం, ఇరుముని శేఖర్, చంద్రబాబు నాయుడు, విద్వాన్ కస్పా పద్మనాభం, పొన్నాల జేజిరెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, పోలే జనార్దన్‌రెడ్డి

సబ్సిడీ బియ్యం కౌంటర్‌ను ప్రారంభించిన గంటా

పి.ఎం.పాలెం ఆగస్టు 7, ప్రభాతవార్త :

స్థానిక రైతుబజార్‌లో సబ్సిడీ ధరకు బియ్యం అందజేసే ప్రత్యేక కౌంటర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.62 గా ఉన్న కేజీ స్టీమ్డ్ బియ్యాన్ని రూ.52కు.. రూ.58 కు విక్రయిస్తున్న బియ్యం రూ.50కు అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 115 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల ఔట్ లెట్ స్టోర్‌లలో తగ్గింపు ధరలకు (తరువాయి 8వ పేజీలో)

జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా

ప్రధానమంత్రి మోడీకి మంగళగిరి చేనేత వస్త్ర బహూకరణ

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్, సానా సతీష్, భాష్యం రామకృష్ణ, మరియు లింగమనేని రమేష్ తదితర ప్రముఖులు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మన సాంప్రదాయ చేనేత కళాకారుల శ్రమను, నైపుణ్యాన్ని అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్‌కే తలమానికమైన, అలాగే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ప్రసిద్ధ చేనేత వస్త్రాన్ని ప్రధాని మోడీకి వారు స్వయంగా బహూకరించారు. ప్రధానికి ఈ వస్త్రాన్ని అందించడం ద్వారా మంగళగిరి చేనేత వస్త్రాల ప్రాముఖ్యత మరియు మన కళాకారుల ప్రతిభను జాతీయ స్థాయిలో మరోసారి ఘనంగా చాటిచెప్పినట్లయింది. చేనేత రంగానికి, కళాకారులకు అందుతున్న సంపూర్ణ మద్దతును ఈ చర్య స్పష్టం చేస్తోంది.

విశాఖ పోర్టు కాలుష్యానికి

చెక్ పెట్టాలి

కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌కు విశాఖ ఎంపీ శ్రీభరత్ వినతి

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

విశాఖపట్నం పోర్టు పరిసరాల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని సమర్థవంతంగా నియంత్రించేందుకు మరింత కఠిన చర్యలు చేపట్టాలని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ను విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసిన శ్రీభరత్.. పోర్టు కార్యకలాపాల వల్ల నగరంలో ధూళి కాలుష్యం పెరుగుతున్న అంశాన్ని వివరించారు. విశాఖ నగర భౌగోళిక పరిస్థితులు, వేగంగా పెరుగుతున్న పారిశ్రామిక కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత నెల 10న విశాఖ కలెక్టరేట్‌లో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా యంత్రాంగం, విశాఖపట్నం పోర్టు అథారిటీ, అదానీ గంగవరం పోర్టు, పోర్టు ఆపరేటర్లు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో గుర్తించిన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విశాఖ గిన్నె ఆకార భౌగోళిక నిర్మాణం కారణంగా గాలిలోని కాలుష్య కణాలు సులభంగా బయటకు (తరువాయి 8వ పేజీలో)

వీఎంఆర్‌డీఏకు కొత్త సారథి

మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ప్రఖర్ జైన్

తేజ్ భరత్ జీఏడీకి

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ప్రఖర్ జైన్‌ను నియామకం చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు చేసింది. ప్రస్తుతం ఆర్టీజీఎస్ సీఈవోగా పనిచేస్తున్న ఆయనను వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్. తేజ్ భరత్‌ను రిలీవ్ చేసి జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

2021 బ్యాచ్‌కు చెందిన ఏపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి ప్రఖర్ జైన్ ప్రస్తుతం ఆర్టీజీఎస్ సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీనితో పాటు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా, ఏపీ ఫిలిం, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. గతంలో బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సేవలందించారు. ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌లో 1994 అక్టోబర్ 22న జన్మించిన ప్రఖర్ జైన్ ఐఐటీ కాన్పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. 2025 ఏప్రిల్ 24 నుంచి ఆర్టీజీఎస్ సీఈవోగా పనిచేస్తున్నారు.

తాజా బదిలీతో వీఎంఆర్‌డీఏ పరిపాలనా బాధ్యతలు ప్రఖర్ జైన్‌కు అప్పగించనున్నారు. విశాఖ మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి, ప్రణాళికా కార్యక్రమాల్లో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు.

లింక్డ్‌ఇన్ 'సిటీస్ ఆన్ ది రైజ్ 2026' జాబితాలో

విశాఖపట్నం నంబర్-1

- నారా లోకేష్ చొరవతో గ్లోబల్, ఐటీ, ఏఐ హబ్‌గా ఆంధ్రప్రదేశ్
- విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్

విశాఖపట్నం, ఆగస్టు 7 ప్రభాత వార్త :

ప్రముఖ అంతర్జాతీయ ఉద్యోగ, వ్యాపార వేదిక లింక్డ్‌ఇన్ విడుదల చేసిన 'సిటీస్ ఆన్ ది రైస్ 2026' తన సర్వే నివేదికలో విశాఖపట్నం నగరం దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. గతంలో కేవలం పోర్ట్, స్టీల్, పరిశ్రమల నగరంగా గుర్తింపు పొందిన విశాఖ, నేడు ఐటీ, ఏఐ , డేటా సెంటర్లు, డిజిటల్ ఎకానమీ దిశగా వేగంగా విస్తరిస్తూ గ్లోబల్ టెక్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది.

ఈ సందర్భంగా విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ. "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న

చురుకైన చర్యలు, దూరదృష్టి వల్లే విశాఖకు ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించిందన్నారు.ఐటి మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రపంచ స్థాయి దిగ్గజ కంపెనీలను ఆకర్షించి, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం వల్ల విశాఖ సరికొత్త శకంలోకి అడుగుపెట్టింది" అని తెలిపారు.

ప్రధానంగా గ్లోబల్ ఏఐ హబ్ దిశగా విశాఖ అవతారిస్తోందని, గూగుల్ ప్రతిపాదించిన 15 బిలియన్ల ఏఐ హబ్, డేటా సెంటర్లు, డిజిటల్ మౌలిక వసతుల ప్రాజెక్ట్ ద్వారా విశాఖ అంతర్జాతీయ టెక్నాలజీ మ్యాప్‌లో కీలక స్థానాన్ని దక్కించుకుందని పేర్కొన్నారు దీనివల్ల సుమారు 1.80 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అన్నారు. ప్రముఖ దిగ్గజ సంస్థలు గూగుల్, రిలయన్స్ (తరువాయి 8వ పేజీలో)

గత ప్రభుత్వ హయాంలో నర్సీపట్నం పదేళ్లు వెనక్కి..

కూటమి ప్రభుత్వంలోనే మున్సిపాలిటీకి మహర్దశ

చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

నర్సీపట్నం పట్టణంలోని 27వ వార్డు శివపురంలో రూ.69 లక్షల 85 వేలతో పూర్తయిన 12 అభివృద్ధి పనుల సీసీ రోడ్లు, కాలువలు ప్రారంభోత్సవాలు, అలాగే రూ.49 లక్షల 10 వేలతో నూతనంగా నిర్మించనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల (తరువాయి 8వ పేజీలో)

మందకొడిగా ఇంటింటి ప్రచారం

మాజీ మంత్రి, భీమిలి ఎంఎల్ఏ గంటా అసంతృప్తి

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త:

నియోజకవర్గంలో "ఇంటింటికి తెలుగుదేశం" మందకొడిగా జరగడం పట్ల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం 12 క్లస్టర్ల నేతలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల నిర్వహణలో భీమిలికి ప్రత్యేక స్థానముందని, అలాంటిది ఇంటింటి ప్రచారంలో (తరువాయి 8వ పేజీలో)

ప్రెసిడెన్షియల్ ఆర్డర్ నుంచి

మినహాయించండి

జీవీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగుల్ని ఒకే యూనిట్‌గా కొనసాగించాలని ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

జీవీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగులను ఒకే యూనిట్‌గా కొనసాగించాలని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అమలుపై పునరాలోచించాలని కోరుతూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేలను ఆశ్రయించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు ఉన్నతాధికారులకు ఇప్పటికే లేఖలు రాసినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.

జీవీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగులకు సంబంధించి జీవో 135పై పునఃపరిశీలన చేయాలని వారు కోరారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1979 ప్రకారం జీవీఎంసీ ప్రత్యేక వ్యవస్థగా కొనసాగుతోందని, మినిస్టీరియల్ విభాగం కూడా ఇప్పటివరకు ఒకే యూనిట్‌గా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక సర్వీసు నిబంధనలు అమల్లో ఉన్నాయని తెలిపారు. జీవీఎంసీ ఉద్యోగులను ఇప్పటివరకు రాష్ట్ర స్థాయి సర్వీసులో విలీనం చేసే ప్రక్రియ చేపట్టలేదని ఉద్యోగులు గుర్తు చేశారు. తమ సర్వీసు పరిస్థితులు జీవీఎంసీ చట్టం, ప్రత్యేక సర్వీసు నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నా యని, అలాంటప్పుడు మినిస్టీరియల్ ఉద్యోగులను విభజించే విధానం వల్ల ఉద్యోగులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని కేటగిరీల మినిస్టీరియల్ ఉద్యోగులకు జీవీఎంసీని ఒకే యూనిట్‌గా కొనసాగించాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. చట్ట నిబంధనల ప్రకారం జీవీఎంసీ (తరువాయి 8వ పేజీలో)

నాలుగవ వార్డులో తాగునీటి కోసం

ప్రణాళిక

గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

జీవీఎంసీ 4వ వార్డు పరిధిలో తాగునీటి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. సముద్ర తీర గ్రామాలైన తిమ్మాపురం, చేపలుప్పాడ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఉప్పునీటిమయం కావడంతో తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో జీవీఎంసీ ఎస్.ఈ. పల్లంరాజుతో ఫోన్‌లో మాట్లాడారు. తీర గ్రామాల్లో తాగునీటి కొరత తీర్చడానికి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వార్డులోని 27 గ్రామాల్లో రూ.10 కోట్లతో అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదించామన్నారు. బోని (తరువాయి 8వ పేజీలో)

మాతృశాఖకు వీఎంఆర్‌డీఏ ముఖ్య గణాంక అధికారి

వై. హరి ప్రసాద్‌ను సరెండర్ చేసిన ప్రభుత్వం

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

వీఎంఆర్‌డీఏలో ముఖ్య గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్న వై. హరి ప్రసాద్‌ను ఆయన మాతృశాఖకు సరెండర్ చేశారు. గత రెండేళ్లుగా వీఎంఆర్‌డీఏలో ముఖ్య గణాంక అధికారిగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆయన డిప్యుటేషన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి కొనసాగింపు ఉత్తర్వులు వెలువడకపోవడంతోపాటు, ఇటీవల కాలంలో దైనందిన కార్యాలయ విధుల పర్యవేక్షణలో కొన్ని లోపాలు తలెత్తిన నేపథ్యంలో హరి ప్రసాద్‌ను మాతృశాఖకు తిరిగి పంపించినట్లు వీఎంఆర్‌డీఏ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు సంబంధిత ప్రక్రియను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ఇక రైల్వే ఈక్యూలు అన్నీ సిరిపురం ది డెక్ భవనంలోనే..

విశాఖపట్నం, ఆగస్టు 7ప్రభాత వార్త :

ఎమర్జెన్సీ క్వోటా (ఈక్యూ) దరఖాస్తు పెట్టె విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంనుండిసిరిపురం జంక్షన్ విఎంఆర్డిఏ ఆఫీస్ ప్రక్కన ఉన్న 'ది దక్షిణ కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయం లోని' ది డెక్' భవనం,కు ఆగస్ట్ 7 వ తేది శుక్రవారం నుండి మారినట్లు విశాఖ డివిజినల్ రైల్వే మేనేజర్ ఒక ప్రకటన లో తెలిపారు.

ప్రైవేటు వైద్యం.. రోగులు వణుకు..

- గాజువాకలో పడగ విప్పుతున్న ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ..
- కాసుల కోసమే ప్రైవేటు ఆసుపత్రుల 'చికిత్స'
- చిన్నపాటి రుగ్మతలకు విచ్చలవిడిగా నివేదికలు.. గుప్పెడు మందులు
- అర్హత లేని సిబ్బందితో ప్రాణాలతో చెలగాటం
- చిన్నారుల దవాఖానాల్లో వికృత క్రీడ.. నిశ్చేష్టంగా యంత్రాంగం

గాజువాక, ఆగస్టు 7, ప్రభాతవార్త :

ప్రాణాలు కాపాడాల్సిన వైద్యరంగాన్ని కొందరు వ్యాపారంగా మార్చేశారు. విశాఖపట్నం జిల్లాలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రమైన గాజువాక ప్రాంతం ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీకి అడ్డాగా మారింది. అత్యవసర సమయంలో నగరంలోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లలేక, సమ యం లేక స్థానిక ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న కార్మికులు, పేద, మధ్యతరగతి ప్రజల బలహీనతలను ప్రైవేటు యాజమా న్యాలు పక్కాగా క్యాష్ చేసుకుంటున్నాయి. వైద్యం ముసుగులో పేదల నెత్తిన లక్షల రూపాయల శఠగోపం పెడుతున్నాయి.

అనవసర పరీక్షలు.. కమీషన్ల పర్వం!..

గాజువాక పరిధిలో సాధా రణ జ్వరం, చిన్నపాటి కడుపు నొప్పి, లేదా రొటీన్ తలనొప్పితో ఆసుపత్రి మెట్లెక్కినా సరే.. వైద్యులు వెంటనే భారీ స్థాయి స్కాన్లు, విశ్లేషణల (బ్లడ్, స్కానింగ్, ఎక్స్-రే) పేరిట పొడవైన జాబితా చేతిలో పెడుతున్నారు. రోగాన్ని నయం చేయ డం కంటే, డయాగ్నోస్టిక్ సెంటర్ల నుంచి వచ్చే కమీష న్లపైనే శ్రద్ధ చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. నిబంధనల ప్రకారం ప్రైవేటు ఆసుపత్రుల రిసెప్షన్ లేదా వెయిటింగ్ హాల్‌లో సేవల ధరల పట్టిక (డిస్‌ప్లే బోర్డు) ప్రదర్శించాల్సి ఉన్నా.. ఇక్కడ ఏ ఒక్క ఆసుపత్రిలోనూ అది కనిపించదు. గది రకాన్ని బట్టి, రోగి ఆర్థిక స్థితిని బట్టి ఇష్టారాజ్యంగా రేట్లు వసూలు చేస్తున్నారు.

చిన్నారుల ఆసుపత్రుల్లో తీవ్ర అన్యాయం!...

చిన్న పిల్లల ఆసుపత్రుల తీరు మరీ దారుణంగా తయారైంది. పసిపిల్లలకు చిన్నపాటి (తరువాయి 8వ పేజీలో)

సబ్సిడీ బియ్యం కౌంటర్ ప్రారంభించిన గంటా

(7వ పేజీ తరువాయి)

ఈ రెండు రకాల బియ్యం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, నాగోతి సత్యనారాయణ, పిల్లా వెంకట్రావు, మామిడి దుర్గారావు, కానూరు అచ్యుతరావు, గడ్డి శ్రీను, నాగోతి సూర్య ప్రకాష్, బోయి రమాదేవి, కాళ్ల నగేష్ కుమార్, కురుమిన లీలావతి, జేడీ పి.సుధాకర్, డీడీ శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

లింక్డ్ఇన్ 'సిటీస్ ఆన్ ది రైజ్ 2026' జాబితాలో విశాఖపట్నం నంబర్-1

(7వ పేజీ తరువాయి)

(రూ. 1.6 లక్షల కోట్ల డేటా సెంటర్ ప్రాజెక్ట్), ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు భారీ పెట్టుబడులుతో విశాఖను తమ కార్యకలాపాలకు వేదికగా ఎంచుకున్నాయన్నారు. గతంలో వెళ్ళిపోయిన విఎన్ఎస్,ఐబిఎం వంటి ప్రముఖ సంస్థలు సైతం తిరిగి తమ కార్యకలాపాలనుఇటవల పునఃప్రారంభించాయని అన్నారు . ఉద్యోగావకాశాలు, నియామకాల వృద్ధిచెంది లింక్డ్ఇన్ డేటా ప్రకారం విశాఖపట్నంలో ఐటీ, కెమికల్ మ్యానుఫ్యాక్చరింగ్, టెక్,డేటా సేవల రంగాల్లో నియామకాలు వేగంగా పెరిగాయని తెలిపారు.నగరంలో 17.1శాతం రిమోట్ ఉద్యోగాలు, 5.2శాతం హైబ్రిడ్ ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయని,

నవీన ఆర్థిక పునాది పోర్ట్ సిటీ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి గ్లోబల్ టెక్నాలజీ, నూతన తరం డిజిటల్ ఉద్యోగాల వైపు విశాఖ వేగంగా ప్రగతి సాధిస్తోందన్నారు. ఈ విజయం కేవలం ఒక ర్యాంకింగ్ లేదా అవార్డు మాత్రమే కాదని, కూటమి ప్రభుత్వం చేపట్టిన స్పష్టమైన వ్యూహాలు, పెట్టుబడుల ఆకర్షణ, యువత భవిష్యత్తు కోసం నారా లోకేష్ అమల్లోకి తెచ్చిన కార్యచరణకు లభించిన నిదర్శనమని ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు.

4 వార్డులో తాగునీటి కోసం ప్రణాళిక

(7వ పేజీ తరువాయి)

గ్రామంలో మాన్సాస్ ట్రస్టుతో 614 ఎకరాల్లోని ఇనాం భూ సమస్య శాశ్వత పరిష్కారానికి సీఎంతో చర్చిస్తానని తెలియజేశారు. వికలాంగుల కాలనీలో తమకు కేటాయించిన స్థలాల్లోకి వెళ్లనివ్వకుండా మాజీ పోలీస్ ఉద్యోగితో కలిసి స్థానిక నాయకుడు ఒకరు దౌర్జన్యం చేస్తున్నారని దివ్యాంగులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన గంటా ఆ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. సాయిరాం కాలనీ ఫేజ్ 3లో ప్రభుత్వ భూమి ఆక్రమించడం సహా ఇళ్లు నిర్మించుకున్న తమను బెదిరిస్తున్నారని చెప్పారు. టీడీఆర్ లు ఇవ్వకుండా శివశక్తినగర్ లో షాపులను తొలగించారని నాగోతి సూర్య ప్రకాష్ తెలుపగా, జీవీఎంసీ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానన్నారు. భీమిలి మెయిన్ రోడ్డు విస్తరణలో పూర్తిగా నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయం చూపిస్తామని వ్యాపారులకు భరోసా ఇచ్చారు. నేతన్నలకు ప్రభుత్వ భరోసా నేతన్న భరోసా పథకం కింద వారి అకౌంట్లలోకి రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే గంటా తెలిపారు. నియోజకవర్గంలోని పొట్నూరుకు చెందిన నేతన్నలకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండదండలు అందిస్తామన్నారు.

ప్రెసిడెన్షియల్ ఆర్డర్ నుంచి మినహాయించండి

(7వ పేజీ తరువాయి)

కమిషనర్‌నే నియామక అధికారిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశాయి. ఈ అంశాలపై భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేయగా, ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లేందుకు జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.వి. వామన్‌రావు, గుమ్మడి నర్సింగ్, జీవీఎంసీ ఏఐటీయూసీ అధ్యక్షుడు పడాల రమణ, కార్యదర్శి ప్రియదర్శిని, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి రవి, జీవీఎంసీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. అప్పలనాయుడు, సన్నీ, క్లాస్--4 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గణపతి, జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా ఇంటింటి ప్రచారం

(7వ పేజీ తరువాయి)

నిరాజనకంగా పని చేస్తున్నారని ఆవేదన చెందారు. గతంలో లక్షకు పైగా సభ్యత్వాలతో రాష్ట్రంలో టాప్ టెన్ లో నిలిచిన నియోజకవర్గం ఈ కార్యక్రమంలో బాగా వెనకబడిందన్నారు. భవిష్యత్ లో నామినేటెడ్ పదవులు, స్థానిక ఎన్నికల్లో ఎంపికకు పార్టీ కార్యక్రమాలే కొలమానంగా పేర్కొన్నారు. గతంలో మాదిరిగా ఇంటింటి ప్రచారంలో కూడా భీమిలి ఎ గ్రేడ్ లో ఉండాలని, ఆ దిశగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 15 నాటికి కనీసం 50 శాతం ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పుడు, సరగడ అప్పారావు, కసిరెడ్డి దామోదరరావు, మీసాల సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ, మాన్యాల సోంబాబు, గరే గుర్నాథ్, పిల్లా వెంకట్రావు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, జానకిరాం, పంచదార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వైద్యం... రోగులు వణుకు..

(7వ పేజీ తరువాయి)

జ్వరం వచ్చినా, తల్లిదండ్రుల ఆందోళనను ఆసరాగా చేసుకుంటున్నారు. "మరింత మెరుగైన సంరక్షణ అందిస్తున్నాం" అనే పేరుతో రోజులు తరబడి ఐసీయూ లేదా ఎన్ఐసీయూ లలో ఉంచుతూ బెడ్ చార్జీల రూపంలో లక్షల రూపాయలు పీక్కు తింటున్నారు. కొందరు పిల్లలకు అవసరం లేకున్నా అధిక మోతాదులో స్టెరాయిడ్లు, విపరీతమైన యాంటీబయోటిక్స్ రాస్తూ వారి భవిష్యత్తు ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు.

అర్హతల్లేని సిబ్బంది.. వికటిస్తున్న వైద్యం!...

గాజువాకలోని పలు ఆసుపత్రులకు అసలు సరైన అనుమతులే లేవు. సదుపాయాలు కూడా అంతంత మాత్రమే. అక్కడ పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్‌కు కనీస అర్హతలు, అనుభవం ఉండటం లేదు. ఏ నర్సింగ్ విద్య పూర్తి చేయని వారిని తక్కువ జీతాలకు నియమించుకుని, వారితోనే ఇంజెక్షన్లు, సెలైన్లు వేయిస్తున్నారు. కొన్ని చోట్ల అర్హత లేని వైద్యులే ఆపరేషన్ థియేటర్ల లోకి వెళ్తుండటం, శస్త్రచికిత్సల సమయంలో వికటించి 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్' అనే రీతిలో ప్రాణాలు పోతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. బాధితులు లబోదిబో మంటూ నిలదీస్తే యాజమాన్యాలు ఏమాత్రం పట్టించుకోకుండా, బాధితుల పైనే ఎదురు దాడికి దిగుతున్నాయి.

సొంత మందుల షాపుల హుకుం!....

వైద్యుల ప్రిస్క్రిప్షన్ పట్టుకుని బయట మెడికల్ షాపుల్లో తక్కువ ధరకు మందులు కొనుగోలు చేద్దామంటే ఆసుపత్రుల యాజమాన్యాలు అస్సలు ఒప్పుకోవడం లేదు. తమ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న మెడికల్ స్టోర్‌లోనే మందులు కొనాలని, లేదంటే చికిత్స అందించబోమని స్పష్టమైన హుకుం జారీ చేస్తున్నారు. అక్కడ గరిష్ఠ వివరాల ధరలకే మందులు విక్రయిస్తూ బాధితుల జేబులకు చిల్లులు పొడుస్తున్నారు.

అధికారులు స్పందించేదెప్పుడు?....

పారిశ్రామిక వాడలోని అమాయక ప్రజలు, కార్మికులు వైద్యం కోసం నగరంలోని దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇక్కడే బలిపశువులవుతున్నారు.

అధికారులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, గాజువాక వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, చిన్న పిల్లల ఆసుపత్రుల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేని దవాఖానాలపై కఠిన చర్యలు తీసుకుని, ధరల పట్టికలను అందుబాటులోకి తెచ్చేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే స్పందించాలని గాజువాక నివాసితులు కోరుతున్నారు.

శాకాంబరి అలంకారంలో దుర్గామాత

అగనంపూడి, ఆగస్టు 7, ప్రభాత వార్త.

పెదమడక దుర్గాలమ్మ శాఖంబరి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చింది. ఆషాడ మాసం సందర్భంగా కూరగాయలతో అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బల్లపైడి రాజు, రాజేశ్వరి, వేముల లక్ష్మి, దేవి,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు కాలుష్యానికి చెక్ పెట్టాలి

(7వ పేజీ తరువాయి)

వెళ్లకుండా నగరంలోనే నిలిచిపోయే పరిస్థితి ఉందని శ్రీభరత్ పేర్కొన్నారు. ముఖ్యంగా పీఎం10, పీఎం2.5 కాలుష్య స్థాయిల పెరుగుదలకు పోర్టు కార్యకలాపాలు కూడా ఒక కారణమని వివరించారు. పోర్టుల్లో ఇప్పటికే యాంత్రీకరణ, ఫాగ్ క్యానన్లు, ఆటోమేటెడ్ స్ప్రింక్లర్లు, హెచ్‌డీపీఈ కవరింగ్, ట్రక్ టైర్ల శుభ్రపరిచే వ్యవస్థ, గ్రీన్ బఫర్ జోన్ల వంటి చర్యలు చేపట్టినప్పటికీ ప్రజల్లో కాలుష్యంపై ఆందోళనలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ధూళి ఉద్గారాలు అధికంగా ఉండే బల్క్ కార్గో నిర్వహణను పూర్తిగా యాంత్రీకరించాలని, మూసివేసిన కన్వేయర్ వ్యవస్థలు, శాస్త్రీయ నిల్వ సదుపాయాలు, ఆటోమేటెడ్ డస్ట్ సప్రెషన్ వ్యవస్థలు, విండ్ బ్యారియర్లను అన్ని పోర్టు టెర్మినల్లలో తప్పనిసరి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. 'హరిత్ సాగర్--గ్రీన్ పోర్ట్ మార్గదర్శకాలు--2023' అమలును వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోర్టు సంస్థలు, కార్గో నిర్వహణ సంస్థల పర్యావరణ బాధ్యతను స్పష్టంగా నిర్ధారించే విధంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని శ్రీభరత్ సూచించారు. పర్యావరణ పనితీరు సూచికలు, త్రైమాసిక అనుసరణ నివేదికలు, రియల్‌టైమ్ గాలి నాణ్యత వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు వార్షిక థర్డ్‌పార్టీ ఆడిట్లు నిర్వహించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలకు బాధ్యులను గుర్తించి, పునరావృత ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

అదనంగా మరిన్ని నిరంతర గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం, డ్రోన్‌ల ద్వారా కాలుష్య పర్యవేక్షణ చేపట్టడం, ప్రజలకు అందుబాటులో ఉండే డిజిటల్ డ్యాష్‌బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర పోర్టుల మంత్రిత్వ శాఖ, విశాఖ పోర్టు అథారిటీ, అదానీ గంగవరం పోర్టు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి పర్యావరణ సమీక్ష నిర్వహించే విధానాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

దేశ సముద్ర వాణిజ్యంలో విశాఖపట్నం కీలకమైన పోర్టు నగరమని శ్రీభరత్ అన్నారు. ఆర్థికాభివృద్ధి ఎంత ముఖ్యమో పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పారిశ్రామిక, పోర్టు అభివృద్ధి ప్రజల ఆరోగ్యం, జీవన నాణ్యతకు భంగం కలిగించకుండా సుస్థిర అభివృద్ధి దిశగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే మున్సిపాలిటీకి మహర్దశ

(7వ పేజీ తరువాయి)

అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వార్డు మహిళలు వారికి హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అతిథులు రిబ్బన్ కట్ చేసి పనులను ప్రారంభించడంతో పాటు, కొబ్బరికాయ కొట్టి నూతన పనులకు లాంఛనంగా శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా చింతకాయల పద్మావతి మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో కనీసం చెత్త ఎత్తే పరిస్థితి కూడా లేదని, ట్రాక్టర్లకు ఆయిల్ కూడా లేని దుస్థితి ఉండేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.32 కోట్లు, ఇంటింటికీ కుళాయి పథకానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో రూ.185 కోట్లు తీసుకువచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం పైపులైన్ల కోసం రోడ్లు తవ్వేసి వదిలేయగా, ఇప్పుడు ఆ పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల నర్సీపట్నం అభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును శుభ్రం చేయడానికి రూ.2 కోట్లు కేటాయించామని, చెత్త ప్రాసెసింగ్ యూనిట్ కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. మున్సిపాలిటీకి మొత్తం రూ.242 కోట్ల నిధులు మంజూరయ్యాయని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలని కోరారు.

వార్డు ఇంచార్జ్ పైల గోవిందు మాట్లాడుతూ.. 27వ వార్డుకు రూ.కోటి 18 లక్షల నిధులు మంజూరు కాగా, ఇప్పటికే రూ.69 లక్షల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 48 లక్షల రూపాయల పనులకు నేడు శంకుస్థాపన చేశామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లపై కనీసం మట్టి కూడా వేయలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వక పనులు ఆగిపోయేవని విమర్శించారు. ఇప్పుడు మొదలుపెట్టిన పనులను నెల రోజుల్లో సగం వరకు పూర్తి చేస్తామని చెప్పారు. శివపురం ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

స్థానిక నాయకుడు తాతీలు మాస్టారు మాట్లాడుతూ... శివపురం వాసులు ఎప్పుడూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబానికి అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు కనీసం పిడికెడు మట్టి కూడా వేయలేదని, ఇప్పుడు మన ప్రభుత్వం వచ్చాకే సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, టిడిపి పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, కాశీరత్నం, నాయకులు బొచ్చా తాతాజీ, రుత్తల సత్యనారాయణ, సబ్బవరపు పెదబాబు, సీరారెడ్డి శ్రీను, మణికంత, రామకృష్ణ 28 వార్డుల ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

తాడి గ్రామ ప్రజల దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కీలక సమావేశం

అగనంపూడి (ప రవాడ) ఆగష్టు, 7, ప్రభాతవార్త :

నేడు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, పెందుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు , పరవాడ మండలం తాడి గ్రామ పెద్దలతో కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఫార్మాస్యూటికల్ పరిశ్రమల కాలుష్య ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తాడి గ్రామాన్ని పునరావాసం (ఆర్ అండ్ ఆర్) కింద పెద ముషిడివాడ గ్రామానికి తరలించడం మరియు అక్కడ అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన ఆర్ అండ్ ఆర్ కాలనీ అభివృద్ధి చేయడం గురించి విస్తృతంగా చర్చించారు. తాడి గ్రామ ప్రజల ఈ దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు.

ప్రతిపాదిత ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం పెద ముషిడివాడ గ్రామంలో 56 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు అధికారులు వివరించారు. సంబంధిత నిబంధనల ప్రకారం ఒక వారంలోపు ఆర్ అండ్ ఆర్ కాలనీ లేఅవుట్‌ను సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ తహసీల్దార్, పారవాడను ఆదేశించారు. అదేవిధంగా, 2016 సంవత్సరంలో గుర్తించిన ప్రాజెక్ట్ డిస్‌ప్లేస్డ్ ఫ్యామిలీస్ సంఖ్య మరియు ప్రస్తుతం ఉన్న అర్హుల వివరాలపై కూడా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తాడి గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్, శౌరిమాన్ పటేల్ , ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్, గనులు మరియు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు, తహసీల్దార్, ప రవాడ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నక్కపల్లి విద్యార్థికి ఆసుపత్రిలో
హోం మంత్రి అనిత పరామర్శ

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాత వార్త :

విశాఖపట్నం మెడికవర్ హాస్పటల్లో చికిత్స పొందుతున్ననక్కపల్లి డిగ్రీ విద్యార్థి వరహాల బాబును హోం మంత్రి అనిత శుక్రవారం పరామర్శించారు. నక్కపల్లి డిగ్రీ కళాశాలలోచదువుతున్న వరాహలబాబు జూలై 29 న రోడ్డు ప్రమాదం కు గురై తీవ్రంగా గాయపడగా అతడిని విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రి లో చేర్చి చికిత్స ను అందిసుతున్నారు. విద్యార్థి వరహాల బాబు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి మంత్రి అనిత తెలుసుకున్నారు. ఈసందర్భంగా వరహాల బాబుకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి వైద్యులు ను ఆదేశించారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు మంత్రి ధైర్యం చెప్పి,విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.

తాగునీటి ఎద్దడిపై జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ
24 గంటల్లో ట్యాంకర్ నీరు

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకు జీవీఎంసీ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రతి ఇంటికి సకాలంలో తాగునీరు అందించడమే లక్ష్యంగా 'డయల్-ఏ-ట్యాంకర్' సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ట్యాంకర్ బుక్ చేసుకున్న వారికి అదే రోజు లేదా గరిష్టంగా 24 గంటల్లోపు నీటిని సరఫరా చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

తొలిరోజే సిటీ ఆపరేషన్ సెంటర్‌లో 245 ట్యాంకర్ బుకింగ్‌లు నమోదయ్యాయని తెలిపారు. ప్రజలు సౌకర్య కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జీవీఎంసీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే ట్యాంకర్ బుక్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. నగరంలోని 98 వార్డులకు 12 ఫిల్లింగ్ పాయింట్లను అనుసంధానించి, 26 జీవీఎంసీ ట్యాంకర్లతో పాటు సుమారు 100 ప్రైవేట్ ట్యాంకర్లను సేవలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ట్యాంకర్లకు నగరవ్యాప్తంగా ఏకరీతి, కనిష్ట రేట్లను అమలు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. తాగునీటి సరఫరాను తాను స్వయంగా పర్యవేక్షిస్తుండగా, అదనపు కమిషనర్ కంట్రోల్ రూమ్ నుంచి సమన్వయం చేస్తున్నారని చెప్పారు. 98 వార్డులకు 98 మంది ఏఈలను క్షేత్రస్థాయిలో నియమించి నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగిస్తూ 'డయల్-ఏ-ట్యాంకర్' సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవీఎంసీలో ఘనంగా పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలు

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, పి. నల్లనయ్య, వ్యయ పరిశీలకులు వాసుదేవరెడ్డితో పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్లు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గం అభివృద్ధి, విద్యా ప్రగతి, సామాజిక చైతన్యం కోసం పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ విశేష సేవలు అందించారని కొనియాడారు. అగ్నికుల క్షత్రియుల సంక్షేమంతో పాటు పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సంఘ సంస్కర్తగా సమాజంలో సమానత్వ భావనను పెంపొందించేందుకు ఆయన కృషి చేశారని, ఆయుర్వేద వైద్య రంగంలోనూ విశేష సేవలు అందించి ప్రజలకు మేలు చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దిశా చట్టం రద్దు మహిళల భద్రతపై ప్రభుత్వం చేసిన దాడి

- మహిళలకు అండగా నిలిచిన చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గమైన నిర్ణయం
- చంద్రబాబు ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- వైఎస్ఆర్ సి పి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాత వార్త :

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి గారి ఆధ్వర్యంలో విశాఖపట్నం జీవీఎంసీ జంక్షన్ లో గల మహాత్మా గాంధీ గారి విగ్రహం వద్ద దిశ చట్టం రద్దు... మహిళలకు ముప్పు అను నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ,శాసన మండలి సభ్యురాలు శ్రీమతి వరుదు కళ్యాణి మాట్లాడుతూ...

రాష్ట్ర ప్రభుత్వం నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో దిశా చట్టాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి తీవ్రంగా ఖండించారు. మహిళల భద్రత, రక్షణ కోసం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో రూపొందించిన దిశా చట్టాన్ని రద్దు చేయడం మహిళల భద్రతను గాలికి వదిలేయడమేనని ఆమె మండిపడ్డారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, హత్యలు వంటి ఘటనలను దృష్టిలో పెట్టుకుని బాధిత మహిళలకు వేగంగా న్యాయం అందించాలనే లక్ష్యంతో వై.ఎస్. జగన్ ప్రభుత్వం దిశా చట్టాన్ని రూపొందించి రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని ఆమె గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి, అవసరమైతే ఉన్న అభ్యంతరాలను నివృత్తి చేసి, చట్టానికి ఆమోదం తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయకుండా చట్టాన్నే పూర్తిగా రద్దు చేయడం మహిళల ప్రయోజనాలను విస్మరించిన చర్య అని విమర్శించారు. దిశా చట్టం అమల్లోకి వస్తే మహిళలపై జరిగే అత్యాచారాలు, లైంగిక నేరాల కేసుల్లో వేగవంతమైన విచారణ జరిగి, తక్కువ సమయంలోనే నిందితులకు శిక్ష పడే విధంగా వ్యవస్థ రూపొందించబడిందని తెలిపారు. బాధిత మహిళలకు త్వరితగతిన న్యాయం అందించాలనే సంకల్పంతోనే ఈ చట్టాన్ని రూపొందించారని, అలాంటి చట్టాన్ని రద్దు చేయడం ద్వారా ప్రభుత్వం నేరస్థులకు పరోక్షంగా ప్రోత్సాహం ఇచ్చినట్లేనని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం చట్టంతో పాటు అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని ఆమె తెలిపారు. దిశా యాప్‌ను రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది మహిళలకు అందుబాటులోకి తీసుకువచ్చారని, అత్యవసర పరిస్థితుల్లో ఒక కాల్ లేదా అలర్ట్‌తో పోలీసుల సహాయం అందే విధంగా అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సుమారు 1.50 కోట్లకు పైగా మహిళలు దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని, వేలాది మంది మహిళలు ఆ యాప్ ద్వారా పోలీసుల సహాయం పొందిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక దిశా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి, డీఎస్పీ స్థాయి అధికారులను నియమించడం, మహిళల భద్రత కోసం ప్రత్యేక పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేయడం, గ్రామ సచివాలయాల పరిధిలో మహిళా పోలీసులను నియమించడం వంటి ఎన్నో విప్లవాత్మక చర్యలను జగన్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రతి మహిళకు భద్రత కల్పించడమే ఆ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి, దిశా యాప్ పేరును మార్చడం, దిశా పోలీస్ స్టేషన్ల పేరును మార్చడం ద్వారా గుర్తింపును చెరిపివేయాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నించిందని ఆమె ఆరోపించారు. పేర్లు మార్చడం ద్వారా చరిత్ర మారదని, మహిళలకు ఉపయోగపడే వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. దిశా అంటే మహిళలకు ఒక భరోసా, ఒక ధైర్యం, ఒక నమ్మకం అని ఆమె పేర్కొన్నారు. మహిళలపై ఎటువంటి అఘాయిత్యం జరిగినా వెంటనే స్పందించి వారికి రక్షణ కల్పించేందుకు రూపొందించిన సమగ్ర వ్యవస్థే దిశా అని వివరించారు. అలాంటి చట్టాన్ని రద్దు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతపై తన నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసుకుందని అన్నారు. రాష్ట్రానికి ఒక మహిళ హోంమంత్రిగా ఉన్నప్పటికీ ఇటువంటి నిర్ణయానికి ఆమె మద్దతు ఇవ్వడం అత్యంత దురదృష్టకరమని వరుదు కళ్యాణి విమర్శించారు. మహిళల భద్రతకు భంగం కలిగించే నిర్ణయాన్ని అంగీకరించిన హోంమంత్రి అనిత తన పదవికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి బీఎన్ఎస్ (దీఛీా) చట్టాలను ప్రస్తావించడం సరైన వాదన కాదని ఆమె పేర్కొన్నారు. బీఎన్ఎస్ దేశవ్యాప్తంగా అమలయ్యే సాధారణ నేర చట్టమైతే, దిశా చట్టం మాత్రం ఆంధ్రప్రదేశ్ మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన చట్టమని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాల్లో వేగంగా విచారణ పూర్తి చేసి, నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా ప్రత్యేక న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయడమే దిశా చట్టం ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్రంలో మహిళలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, విద్యాసంస్థలు, ఉద్యోగ ప్రాంతాలు, ప్రజా ప్రదేశాల్లో మహిళలకు పూర్తి భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. ఇలాంటి సమయంలో మహిళలకు మరింత రక్షణ కల్పించే చట్టాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, దానిని రద్దు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. దిశా చట్టం రద్దు నిర్ణయానికి నిరసనగా క్యాబినెట్ నిర్ణయాల ప్రతులను దగ్ధం చేశామని తెలిపారు. మహిళల భద్రతను కాపాడాలంటే ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చివరగా, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, దిశా చట్టం రద్దు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, కేంద్రంతో చర్చించి దిశా చట్టానికి ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీకి తావు లేదని, మహిళల హక్కులు మరియు భద్రత కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు.నగర మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి మాట్లాడుతూ..

మహిళల గౌరవం గురించి మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలను గౌరవించడం అంటే కేవలం రాజకీయ వేదికలపై మాటలు చెప్పడం మాత్రమే కాదని, ఆ గౌరవాన్ని ఆచరణలో కూడా చూపించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్, మహిళ నాయకులు శ్రీదేవి వర్మ, బయ్యవరపు రాధా, బి పద్మావతి, షబీర బేగం, సత్యాల సాగరిక ,ఎం విశాలక్షి, రోజా రాణి, రీసు అనురాధ, రజిని, మజ్జి జ్యోతి , పార్వతి, జోషిల , దమయంతి, భాను, శిరాష , కృష్ణ వేణి , సత్య , మహిళ సీనియర్ నాయకులు, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

vsp9:vsp9.qxd 07-08-2026 21:43 Page 1

సంక్షేమం, అభివృద్ధిపై విస్తృతస్థాయి ప్రచారం

టిడిపి సీనియర్ నాయకుడు బొర్రా నాగరాజు

పాడేరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :

రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేస్తూ రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలు అవగాహన చేసుకొని పథకాలను వినియోగించుకోవాలని టీడీపీ సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు పేర్కొన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా పాడేరు మండలం వంతాడపల్లి గ్రామంలో బొర్రా నాగరాజు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ. కరపత్రాలను అందిస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికలు ఇచ్చిన హామీలు అమలు, సూపర్ సిక్స్ పథకాలు విజయవంతశీపై ప్రజల్లో అవగాహన కల్పించారు. గత ప్రభుత్వ పాలనపై కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అవగాహన బొర్రా నాగరాజు కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికే అమలు చేస్తున్న పథకాలు వివరిస్తూ కూటమి ప్రభుత్వానికి ఏళ్ల వేళలా ప్రజలు మద్దతు ఇచ్చి మంచి ప్రభుత్వానికి సహకరించాలని నాగరాజు కోరారు. జిఓ నెంబర్ 3 మాదిరిగానే ప్రభుత్వం వేరే చట్టం తీసుకురావడానికి కూటమి ప్రయత్నిస్తుందన్నారని, ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని టీడీపీ సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ సెప్టెంబర్ ఒకటో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పొటిక సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అడ్డు అదుపు లేదని, సర్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తేవాలి, దేశంలో ఎన్నికల బ్యాలెట్ పేపర్ పద్ధతులు ఎన్నికలను పునరుద్ధరించాలి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి అని ప్రతి యువకుడికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి, కార్మికుల హక్కులను పరిరక్షించి దళిత, ఆదివాసులపై అకృత్యాలను దాడులను నిలిపివేయాలి ఆదివాసి చట్టాల పరిరక్షణ కోరుతూ అలాగే బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 1వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వారు తెలిపారు కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా నాయకులు కూడా రాధాకృష్ణ, సింహాచలం, జల్లి రాజుబాబు, రాజు, కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కొంగు బంగారం పాడేరు మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఈరోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన శుక్రవారం నిర్వహించారు. గ్రామపెద్దలు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం పిజిఆర్ఎస్ అర్జీదారులకు ఉచిత భోజనం

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

జిల్లా కేంద్రానికి దూర ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులకు కనీస సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో ప్రతి శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు హాజరయ్యే అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి తెలిపారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), పాడేరు, అన్న క్యాంటీన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం పాడేరులో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి హాజరైన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఐటీడీఏ పరిపాలనా విభాగం అధికారులతో కలిసి ఉచిత భోజనాన్ని పంపిణీ చేశారు. డీపీఆర్వో కె. అన్నమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్నక్యాంటీన్ ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

10న అరకు వ్యాలీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆగస్టు 10వ తేదీన ఉదయం 10 గంటలకు అరకు వ్యాలీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా యంత్రాంగం, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో ఆదివాసీ కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గిరిజన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను విజయవం తంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ,ఐటీడీఏ అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు.

'సర్'లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డీపీవోకు ప్రశంసాపత్రం

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

అల్లూరి సీతారామ రాజు జిల్లా పరిపాలనలో విశేష సేవలు అందిస్తూ ప్రజల ఫిర్యాదులు, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై త్వరితగతిన స్పందించడంతో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్ను "స్టార్ ఆఫీసర్ ఆఫ్ ది వీక్"గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ టి. నిశాంతి చేతుల మీదుగా డీఎల్పీఓ పి.ఎస్. కుమార్‌కు ప్రశంసాపత్రం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పాడేరు డివిజన్ పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలనలు సమీక్షలు, ఫాలప్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిం చడం, ప్రజల సమస్యలపై సత్వర చర్యలు చేపట్టడం, అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమానికి సంబంధించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినందుకు ఈ గుర్తింపు లభించింది. సేవా నిబద్ధత, సమర్థవంతమైన కార్యనిర్వహణ, పారదర్శక పాలనకు ఆయన చేసిన కృషిని జిల్లా యంత్రాంగం అభినం దించింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్యవర్మ, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఆర్డీవో భుజంగరావు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలి

పీజీఆర్ఎస్‌కు 66, రెవెన్యూ క్లినిక్‌కు 38 మొత్తం 104 అర్జీలు

పాడేరు, ఆగస్టు 7, ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించరాదని, ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి పరిష్కా రం చూపాలని స్పష్టం చేశారు. పాడేరు ఐటీడీఏ కార్యాల యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 66 అర్జీలు, రెవెన్యూ క్లినిక్‌కు 38 అర్జీలు, మొత్తం 104 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్యవర్మ, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, పాడేరు ఆర్డీఓ ఎం. భుజంగరావుతో కలిసి వివిధ మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. అత్యవసర ఫిర్యా దులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీబీకే పరిమళ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి. బాబు, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాల మురళీకృష్ణ, స్వర్ణ గ్రామ-వార్డు కార్యాలయాల నోడల్ అధికారి పి.ఎస్. కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మోహన్, జిల్లా సర్వే-భూ రికార్డుల అధికారి ఈశ్వరదొర, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా స్త్రీ--శిశు సంక్షేమ శాఖ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి. రమణారావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, జిల్లా మలేరియా అధికారి తులసి, మండల రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

విభిన్న ప్రతిభావంతులైన (దివ్యాంగ) విద్యార్థులను విద్యా పరంగా ప్రోత్సహించి, వారు ఆత్మవిశ్వాసంతో స్వతంత్రంగా ముందుకు సాగేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ కార్యక్రమాల్లో భాగంగా అర్హులైన డిగ్రీ విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ టి. నిశాంతి పంపిణీ చేశారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ చేతుల మీదుగా లబ్ధిదారులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా పెదబయలు మండలం కోరావంగి గ్రామానికి చెందిన గొల్లూరి బాలకృష్ణ విశాఖపట్నం ఎండాడలోని అంబేద్కర్ యూనివర్సిటీలో సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదేవిధంగా కొయ్యూరు మండలం చింతలపూడి గ్రామానికి చెందిన మాన్య లోకేష్ కుమార్ హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి నేత్ర కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ల్యాప్‌టాప్‌లను అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ఏసీ) ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కవిత, అధికారులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త

ఈ నెల 8వ తేదీన జరగనున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ ను విజయవంతం చేయాలని హ్యూమన్ రైట్స్ స్టేట్ అధ్యక్షులు కాంగు చిన్ని శుభ, మహిళా సంఘం జిల్లా నాయకురాలు కిలో విమల ఆదివాసి గిరిజన సంఘం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య నాయకులు అన్ని వర్గాల ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: జీవో నెంబర్ 3 పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీను తక్షణమే అమలు చేయాలనీ 1/70 చట్టం జోలికి ఎవరు వచ్చినా క్షమించేది లేదని, శనివారం జరగనున్న రాష్ట్ర వ్యాప్త మన్యం బందును శాంతియుతంగా ప్రతి గ్రామము నుండి రోడ్లు మీద వచ్చి బందు నిర్వహించాలని ఆయా సంఘాల నాయకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూడా బాలకృష్ణ, ఆదివాసి సేన జిల్లా నాయకులు రాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చిన్నారావు, నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు భాను సిహెచ్ రావు, రమేష్, పంగి రామారావు ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, కార్మిక సంఘ జిల్లా నాయకులు లింగేరి సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ 12వ వర్ధంతి

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

పాడేరు ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో సిటు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్. సుందరావు ఆధ్వర్యంలో సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి ఎం.సూర్యనారాయణ 12వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గంగా నివాళులు అర్పించారు. ఈ వర్ధంతి సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పల నరస మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజన హక్కులు చట్టాలు పరిరక్షించాలని కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం గ్రామాల్లో మౌలిక సౌకర్యం కల్పించాలని అనేక పోరాటంలో సూర్యనారాయణ ఉన్నారు. సంతలో మోసాలు గిరిజనులు పండించిన పంటల గిట్టుబాటు ధరలు కల్పించాలని తన జీవితాన్ని త్యాగం చేసి కుటుంబమంతా ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం పనిచేశారని అన్నారు ఆదివాసుల కోసం పనిచేయడాన్ని వసంత గర్వంగా ఉన్నారు. సూర్యనారాయణ ఆశయాల సాధన కోసం భవిష్యత్తులో గిరిజన హక్కులు చట్టాలు కోసం నిరంతరం పోరాట స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్. సుందరరావు, దాస్, ఆదివాసీ సేన రాజ్, వైకుమార్ పాల్గొన్నారు.

కొత్త జిల్లాల ఉద్యోగులకు సమాన న్యాయం చేయాలి

పాడేరు, ఆగస్టు 7, ప్రభాతవార్త:

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన పోలవరం మార్కాపురం జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు 16 శాతం ఇంటి అద్దె అలవెన్స్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ అల్లూరి సీతారామ రాజు పోలవరం జిల్లాల ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లకే రవీంద్రబాబు పాత్రుడు కోరారు. సీతారామరాజు జిల్లా పాడేరు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు లకే రవీంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన పోలవరం మార్కాపురం జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు 16 శాతం ఇంటి అద్దె అలవెన్స్ మంజూరు చేస్తూ రాష్ట్రప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లకే రవీంద్రబాబు పాత్రుడు, కార్యదర్శి ఎస్ సంజీవ రాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుల్లేలి సింహాద్రి, ఉపాధ్యక్షులు మఠం సూర్యనారాయణ నాయుడు, ఎం.ఈశ్వరరావు, ఏపీ ఎన్‌జీఓ-ఎన్‌జీజీఓ రంపచోడవరం తాలూకా యూనిట్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు తాలూకా కార్యదర్శి దిలీప్ కుమార్, ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ కార్యవర్గ సభ్యులు కంగల శ్రీనివాస్, మట్ల కృష్ణారెడ్డి కార్యవర్గ సభ్యులు పోడియం పండు దొర, పండ పవన్ కుమార్ దొరతో పాటు కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వచ్చే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపండి

డా. సియ్యారి దొన్ను దొర

అరకు రూరల్, ఆగస్టు 7, ప్రభాతవార్త:

గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా. సియ్యారి దొన్ను దొర సూచించారు. ఒకే సమస్యపై ప్రజలు మళ్లీ మళ్లీ గ్రీవెన్స్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం అరకు లోయలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యల్లో నిర్లక్ష్యం ఉండకూడదని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది మరింత బాధ్యతతో సేవలందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు కల్పించాలని కోరారు. అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, వర్షాకాలంలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్యలపై అధిక సంఖ్యలో వినతులు వస్తున్నందున వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. గ్రీవెన్స్‌లో వ్యక్తిగత సమస్యలతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ భవనాలు, తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్ర సమర్పించారు. వాటిని సంబంధిత శాఖల సమన్వాయంతో త్వరితగతిన పరిష్కరించాలని డా. సియ్యారి దొన్నుదొర అధికారులకు సూచించారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి లక్ష్యం

అరకు పరిశీలకుడు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్



దుంబ్రిగుడ, ఆగస్టు 7, ప్రభాతవార్త:

సంక్షేమ, అభివృదే కూటమి ప్రభుత్వ లక్ష్యామని అరకు పరిశీలకులు మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక భవనంలో టిడిపి అత్యవసర సమావేశంతో పాటు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేపట్టిన రెండు పాలన సంక్షేమం- అభివృద్ధి - ఇంటింటికి చేరువ అవుతుందన్నారు. రాష్ట్ర కనీస వేతనాలు సలహా మండలి డైరెక్టర్ టి. సుబ్బారావు, అరకు పార్లమెంట్ టిఎన్ టియు ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, మాజీ ఎంపీపీ కొర్ర ధన్నేరావు పిఎసిఎస్ బ్యాంక్ చైర్మన్ సుబ్బారావు, క్లస్టర్ ఇంచార్జ్ కే.నాగరాజు అరకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బురిడీ కొమ్ములు నాయుడు, ఎం పీటీసీ సభ్యురాలు ఎం.గీత, టిడిపి సీనియర్ నాయకులు మాండ్యగురు సింహాద్రి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అరణ్య గర్జనకు వైసిపి ఎమ్మెల్యేలు, చైర్పర్సన్, మాజీ ఎమ్మెల్యే మద్దతు

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసి) ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 1/70 చట్టం పరిరక్షణ, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాలకు చట్టం చేయాలంటూ నిర్వహించిన అరణ్య గర్జన సభకు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే ఏం.విశ్వేశ్వర రాజు, అరకు ఎమ్మెల్యే రాగం మత్యలింగం, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జిసిసి మాజీ చైపర్సన్ డా. శోభాస్వాతి రాణి వైసిపి శ్రేణులు సభావేదికపైకి వచ్చి అరణ్య గర్జనకు మద్దతు తెలుపుతూ జే ఆదివాసీ అంటూ నినాదాలు చేసారు.

నేడు జరిగే రాష్ట్ర మన్యం బంద్ జయప్రదం చేయాలి

దుంబ్రిగుడ, ఆగస్టు 7, ప్రభాతవార్త:

ఈనెల 8 న జరిగే రాష్ట్ర మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి టి సూర్యనారాయణ పిలుపునిచ్చారు. అరకు సంతలో బంద్‌ను విజయవంతానికి ఆదివాసులందరూ సహకరించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 9 న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా సందర్భంగా 100%రిజర్వేషన్ పై సిఎం తక్షణమే ఉత్తర్వులు జరిచేయాలి. 1/70పరిరక్షించాలి. అల్లూరి జిల్లాను జోన్1లోనే కొన్నాసాగిస్తూ జి.ఓ..జారిచేయాలని డిమాండ్ చేశారు. జరిగే రాష్ట్ర మన్యం బంద్‌ను ఆదివాసీ నిరుద్యోగ యువత, ప్రజానీకం, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజా సంఘాలు వేలాది సంఖ్యలో పాల్గొని బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె. రామచందర్, పి.సురేంద్ర. కె.లైకోన్.పి.మత్తు పాంగి. మోహన్ దాస్, వి.పరన్న, తదితరులు పాల్గొన్నారు.

నేటి రాష్ట్ర మన్యం బంద్‌ను విజయవంతం చేయాలి

అరకులోయ, ఆగస్టు 7, ప్రభాతవార్త :

జీవో నెంబర్ 3 కు ప్రత్యామ్నాయ జీవో ఆర్డినెన్స్ జారీ చేయాలి, గిరిజన ప్రాంతంలో ప్రత్యేక ఉద్యోగాల నియామక చట్టం చేయాలని, 1 బై 70 చట్టం పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అక్రమ ఒప్పందాలు కు జారీ చేసిన జీవోలు 13, 51, 29, 2 రద్దు చేయాలని, అల్లూరి సీతారామరాజు జిల్లా ను జోన్ 1 కొనసాగిస్తూ గెజిట్ విడుదల చేయాలని నేడు నిర్వహిస్తున్న మన్యం బంద్‌ను జయప్రదం చేయడానికి మండల కేంద్రంలో ఉన్న వర్తకులు స్వచ్చం దంగా దుకాణాలు మూసి సహకరించగలరని, అలాగే ఆదివాసీ ప్రజా సంఘాలు మేధావులు, మహిళాలు యువత బంద్‌లో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ విస్తృత ప్రచారం జరిగింది. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బాలదేవ్ మండల కార్యదర్శి జి బుజ్జి బాబు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కె రామారావు, సుంకర మెట్ట మాజీ సర్పంచ్ జి. చిన్న బాబు, విద్యార్థి సంఘం నాయకులు ఐసు బాబు గిరిజన సంఘం మండల నాయకులు కె రమేష్ కె బుజ్జి బాబు, సురేష్ బాలు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు శాకాంబరి అలంకరణ

అరకు రూరల్ , ఆగస్టు 7, ప్రభాతవార్త :

అరకులోయలో వెలసిన గ్రామదేవత శ్రీశ్రీశ్రీ కనకదుర్గాంబిక అమ్మవారిని శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం శాకాంబరి దేవిగా అలంకరించారు. పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ప్రత్యేకంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. అలాగే సాయంత్రం అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా కుంకుమ పూజ జరిగింది. ఈ సందర్భంగా భవానీపీఠం ఆలయ కమిటీ సభ్యులు గురు భవాని చందు పాడి మాట్లాడుతూ శాకాంబరి దేవి సమస్త ప్రజలకు సస్యశ్యామలం, సకాలంలో వర్షాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. కాగా వచ్చే మంగళవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి భక్తులు సారెను సమర్పించనున్నట్లు తెలిపారు.

దాబుగుడలో సబ్ రేషన్ డిపో ఏర్పాటు చేయాలి

అరకు రూరల్, ఆగస్టు 7, ప్రభాతవార్త :

అరకులోయ మండలం మాదల గ్రామ పంచాయతీ పరిధిలోని దాబుగుడ గ్రామం లో సబ్ రేషన్ డిపో మంజూరు చేయాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు శుక్రవారం మండల తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు రమేష్ మాట్లాడుతూ దాబుగుడ, రక్తకండి, దోమల జోరు, తుంగగెడ్డ, కమలతోట గ్రామాల్లో ప్రధానంగా పివిటీజీ కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. ఈ ఆరు గ్రామాల్లో సుమారు 800 మంది జనాభా, 150 కు పైగా తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నప్పటికీ, ప్రస్తుతం మాదల రేషన్ డిపోపై ఆధారపడాల్సి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దాబుగుడలో సబ్ రేషన్ డిపో మంజూరు చేయకపోతే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దీనికి స్పందించిన తహసిల్దార్ రాజా శ్రీధర్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన సంఘం మండల నాయకులు బుజ్జిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

జేఏసి అరణ్య గర్జన భారీ సభ విజయవంతం

పాడేరు, ఆగస్టు7, ప్రభాతవార్త:

1/70 చట్టం పరిరక్షణ, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం చట్టం చేయాలంటూ డిమాండ్ చేస్తూ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసి) శుక్రవారం పాడేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన అరణ్య గర్జన భారీ బహిరంగ సభ కు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా గిరిజనులు హాజరు కావడంతో గర్జన సభ విజయవంతం అయింది. ఈ అరణ్య గర్జనసభకు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాసాడ ఈశ్వరరావు అధ్యక్షత వహించగా ,ఈ సభకు హాజరైన జేఏసి రాష్ట్ర చైర్మన్ రిటైర్డ్ జిల్లా కలెక్టర్ తమర్భ బాబురావు నాయుడు సుదీర్ఘంగా జీఓనంబర్ 3 రూప కల్పన, అలాగే సుప్రీం కోర్టు జి ఓ 3 కొట్టివేసిన అంశాలపై మాట్లాడుతూ ప్రభుత్వం దానికి అనుగుణంగా జి ఓ తీసుకు రావడానికి చేస్తున్న ప్రయత్నాలు జిఓ3కు యధావిధిగా ఉండేలా జి ఓ రూపకల్పనకు జేఏసి చేస్తున్న కృషిని

బా ఉండవు నాయుడు వివరించారు. అలాగే 1/70 చట్టం పరిరక్షణకు జేఏసి చేస్తున్న కృషిని వివరించారు. ఈ సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి పలువురు వక్తలు గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ సభలో జే ఏ సి జిల్లా చైర్మన్ రామారావు దొర మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, చట్టాలు కాపాడుకోవడానికి భారత రాజ్యాంగం పొందుపరిచిందన్నారు. ఈ అరణ్య గర్జన సభలోఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ స్టేట్ చైర్మన్ తమర్భ బాబురావు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ అల్లూరి జిల్లా చైర్మన్ రామారావు దొర, తెలంగాణ తుడుము దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతీ అరుణ్ కుమార్, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాసాడ ఈశ్వరరావు, ముఖి శేషాద్రి, భారత్ ఆదివాసి పార్టీ, ఏపీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు,మినుముల ప్రసాద్, ఏపీ జేఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ కంగాల శ్రీనివాస్, మట్ల కృష్ణారెడ్డి, మన్యం జేఏసీవైస్ చైర్మన్ కొండగొర్రె ఉదయ్ కుమార్, సాగబోయిన పాపారావు (ప్రొఫెసర్), తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ వివేక్ భాయ్, పలసీ, కృష్ణారావు, ఏపీ సిపిఎస్ అధ్యక్షులు మోరి మోహన్, మజ్జి సురేష్ కుమార్, బోండా అప్పలరాజు, వంతాల రాంబాబు,గిరిజన విద్యార్థి సంఘం(+ూఖ)నాయకులు రాష్ట్ర అధ్యక్షులు కీరసాని కిషోర్, బూడిద మాధవరావు (జిల్లా ప్రధాన కార్యదర్శి), మణుగూరు బాబూజీ (జిల్లా అధ్యక్షులు) సురేష్ కుమార్ సింహాచలం, పార్ధు, ప్రభాకర్, రవీంద్ర, కొర్ర బలరాం (జికేవీధి జేఏసీ), బి.చంటి (అనంతగిరి) పోతురాజు పెదబయలు రెయ్యలకృష్ణ (ముంచం గిపుట్టు), గురుదర, లోచల రామకృష్ణ, జన్ని సింహాచలం, మల్లేష్ రావు , రామచంద్రరావు, రీమెలీ పాల్, ప్రజాప్రతినిధులు అరకు శాసనసభ్యులు రేగం మత్యలింగం, పాడేరు శాసనసభ్యులు మత్యరాస విశ్వేశ్వ రరాజు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శతకబుల్లిబాబు, తేదబారికి సురేష్, ఆదివాసీలు పాల్గొన్నారు.

రైతన్న మీకోసం వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

రాంబిల్లి, ఆగస్టు 07, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్న మీకోసం పోస్టర్‌ను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ దిమిలి గ్రామంలో ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట సంరక్షణ, నీటి వినియోగం, వ్యవసాయ సలహాలపై అవగాహన కల్పించేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అప్పన్నపాలెం గ్రామాన్ని తరలించడం లేదు..

గొరపూడి రైతులతో మాట్లాడిన కలెక్టర్ విజయ్ కృష్ణన్

రాంబిల్లి, ఆగస్టు 07, ప్రభాతవార్త

ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్) రెండో విడత భూ సేకరణలో ఉన్న గొరపూడి శివారు అప్పన్నపాలెం గ్రామాన్ని తరలించడం లేదని కలెక్టర్ విజయ్ కృష్ణన్ స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఆమె గొరపూడి రైతులతో సమావేశమై సేకరించే భూములపై చర్చించారు. హైకోర్టు తీర్పులో చెప్పిన మేరకు భూములకు చెల్లించే నష్టపరిహారం విషయమై ఆర్ అండ్ ఆర్ కోర్టుకు రైతులు వెళ్లకపోవడంపై ప్రశ్నించారు. వారం రోజుల్లో దీనిపై రైతులు స్పష్టత ఇవ్వాలని చెప్పారు. లేదంటే తామే ఆర్ అండ్ ఆర్ఆర్ కోర్టుకు వెళ్లి భూములకు ఇచ్చే పరిహారం డిపాజిట్ చేసేందుకు వెనుకాడమని కలెక్టర్ చెప్పారు. గొరపూడితో పాటుగా భూసేకరణలో తొలగించే కుటుంబాలకు మండలంలో బీసీటీ భూముల వద్ద పునరావాసం కల్పిస్తామని చెప్పారు. తొలగించే కుటుంబాలకు అప్పన్నపాలెం గ్రామానికి సమీపంగా సేకరించే భూములను కేటాయించాలని కొందరు గ్రామస్తులు కోరారు. కలెక్టర్‌తో జరిగిన చర్చల్లో తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు లాలం భరత్, పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు లాలం శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు. భూసేకరణపై కలెక్టర్ సమీక్ష రెండో విడత సెజ్ భూసేకరణలో ఉన్న భూములపై కలెక్టర్ విజయ్ కృష్ణన్ అధికారులతో సమీక్షించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, అడ్డు రోడ్డు, నర్సీపట్నం, ఆర్డీఓలు రామలక్ష్మి, రమణ, ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్‌డిసి ఎస్.డి.అనిత, తహసిల్దార్ రత్నంతో సేకరించే భూములపై సమీక్షించారు. జిరాయితీ చింతువా గ్రామంలో ఆరో బ్లాకులో కోర్టులో ఉన్న 129 ఎకరాలపై కలెక్టర్ ఎస్‌డిసిని అడిగి తెలుసుకున్నారు. కోర్టులో కేసు ఉండడంతో ఈ భూములకు అవార్డు చేయలేదని ఎస్‌డిసి చెప్పారు. భూసేకరణలో ఉన్న రైతుల భూములకు సంబంధించి పరిహారం చెల్లించవలసినవి ఉంటే తక్షణమే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో ఏపీఐఐసీ డి జెడ్ ఎమ్ సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావ నివారణపై రైతులకు అవగాహన

యూరియా ఎరువులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

రాంబిల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో నిర్వహించిన "ఎల్‌నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక" కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు యూరియా ఎరువులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేం దుకు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, సాంకేతిక సలహాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాంబిల్లి జడ్పీ హైస్కూల్‌లో అభయ బాక్స్ ఏర్పాటు : డీఎస్పీ మోహన్ రావు

రాంబిల్లి, ఆగస్టు 07, ప్రభాతవార్త

విద్యార్థుల భద్రతను మరింత బలోపేతం చేయ డానికి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం పరవాడ డీఎస్పీ మోహనరావు, రాంబిల్లి పోలీస్ సిబ్బంది, అభయ టీమ్ సభ్యులు కలిసి అభయ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. అభయ బాక్స్ వినియోగం, సమస్యలు లేదా భద్రతకు సంబంధించిన అంశాలను నిర్భయంగా తెలియజేసే విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే వ్యక్తిగత భద్రత, అపరిచితుల పట్ల అప్రమత్తత, అత్యవసర పరిస్థితుల్లో ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులకు సురక్షితమైన, భద్రమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి

అనకాపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త

వర్షాకాలంలో శీతల వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సూచించారు. అనకాపల్లి జోన్ పరిధిలో 83వ వార్డు లక్ష్మీదేవిపేట సమీపంలో కోటా రోడ్డు, మధ్య వీధి ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే ప్రోగ్రాం నిర్వహించారు. అనకాపల్లి జోనల్ కమీషనర్ కె.చక్రవర్తి మాట్లాడుతూ ఈ వర్షకాల సమయం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు. వారానికి ఒకసారి అందరూ ఫ్రైడే డ్రై డే పాటించాలని కోరారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కొత్త నిబంధనలను అనుసరించి చెత్తను నాలుగు రకములుగా తడి, పొడి, హానికర ఈ వ్యర్థములగా విభజించి మా సిబ్బందికి అందించవల సిందిగా కోరారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక నాయకులు దొడ్డి రాము, కొణతాల గణేష్, కొణతాల బాలు, యస్ఐ మాడుగుల అప్పారావు, మలేరియా ఇంచార్జ్ కోదండ రామ్, సెక్రెటరీలు అప్పారావు, దుర్గరావు, మోహిని, లోవ, శిరీష, సూపర్‌వైజర్లు, ఇతర పబ్లిక్ హెల్త్ సిబ్బంది, జివియంసి సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

అండర్ రైల్వే బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించండి : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

అగనంపూడి, ప్రభాతవార్త

లంకెలపాలెం అండర్ రైల్వే బ్రిడ్జి వెంటనే ప్రారం భించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం లంకెలపాలెం లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సమస్య రైల్వే అండర్ బ్రిడ్జి నేడు సహకారం అవడం శుభపరిణామం అన్నారు. పైడివాడ అగ్రహారం నుండి పరవాడ వరకు రోడ్డులో మరమ్మతులు చేసి కొత్త రోడ్డు వేయాలని అధికారుల ఆదేశించారు. అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలపై చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కార్పొరేటర్లు రౌతు శ్రీను, దుల్ల రామునాయు, నాయకులు గవర సోమశేఖర్, పిల్లశివ, రామారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు తేల్చాలంటూ.... వైఎస్ఆర్ సిపి నిరసన దీక్ష

గొలుగొండ ఆగస్టు 7, ప్రభాతవార్త

డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకత వకలపై విచారణ చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఒక్కరోజు నిరసన దీక్ష పట్టారు. 2025 డీఎస్సీలో చోటుచేసుకున్న అవకతవకలు నెగ్గి తేల్చి, బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు శోభ హైమావతి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, నియోజకవర్గం పరిశీలకులు మాజీ ఎంపీ బీసెట్టి వెంకట సత్యవతి డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మండలాల వారీగా చేపడుతున్న నిరసన దీక్షలో డీఎస్సీ పేపర్ లీకేజ్ ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలు జరిగాయని వీటిపై తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ దోపిడీలో విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ పోస్టులు అమ్ముకున్నారని ఆరోపించారు. ఒక్కరోజు నిరీక్షణ దీక్షలో మండలంలో అన్ని పంచాయతీల నుండి మాజీ సర్పంచులు ఎంపీటీసీలు నిరసన దీక్షలో పాల్గొన్నారు. జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు ఎంపిపి గజ్జలపు మణికుమారి అనకాపల్లి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు లోచుల సుజాత, వైసిపి మాజీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, కోపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థినులతో హోమ్ మంత్రి అనిత సెల్ఫీ

నక్కపల్లి, ప్రభాతవార్త

నక్కపల్లిలో ఉన్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత క్యాంప్ కార్యాలయం వద్ద ఆమెను కలిసేందుకు వచ్చిన నక్కపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థినిలతో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తన ఫోన్లో సెల్ఫీ దిగి విద్యార్థినులను ఆనందింపజేశారు. మిమ్మలను కలుసుకోవడం ఎంత సంతోషంగా ఉందని విద్యార్థినిలు ఆనందంతో చెప్పారు.

చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలి : ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త

అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడం, నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో అంగన్వాడి కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంటపాత్రలు, అలాగే విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి టీచర్లకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పసిపిల్లల పోషకాహార సంరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జననం నుంచి ఆరు నెలల వయస్సు పూర్తయ్యే వరకు శిశువులకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే సందేశంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సీడీపీఓ రమణకుమారి, ఏసీడీపీఓ శశికళ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరి, 83వ వార్డు జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మంగఈశ్వర్, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికి పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ విశేష కృషి : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త

అగ్నికుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ, పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికి, పేదల సంక్షేమానికి విశేష కృషి చేసిన గొప్ప సమాజ సంస్కర్త అని కొనియాడారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, జిల్లా ప్రణాళిక అధికారి రామారావు, బీసీ సంక్షేమ అధికారిణి శ్రీదేవి, బీసీ సంఘాల నాయకులు, కమ్యూనిటీ సభ్యులు, పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఎంతో ముఖ్యం : డాక్టర్ గోపికృష్ణ

అగనంపూడి ప్రభాతవార్త

బిడ్డకు తల్లిపాలు ఎంతో ముఖ్యమని అగనంపూడి ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ డా.గోపికృష్ణ అన్నారు. తల్లిపాల వారోత్సవ సందర్భంగా అంగనప్పుడు ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో ప్రతి ఒక్కరూ తల్లిపాలు గురించి తెలుసుకోవాలని అన్నారు. డబ్బా పాలు కన్న తల్లిపాలు మేలు అన్నారు. పిల్లల డాక్టర్ వత్సవలస, డాక్టర్ ప్రమీల, డా.ప్రసన్న, ఏవో రవి రాజు, నర్సింగ్ సూపర్డెంట్ హేమ లక్ష్మి, పాల్గొన్నారు.

మండల బిజెపి పార్టీ అధ్యక్షుడిగా గుమ్మడి గణేష్ నియామకం

గొలుగొండ ఆగస్టు 7, ప్రభాతవార్త

బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడిగా గుమ్మడి గణేష్‌ను ఏకగ్రీవంగా ఆమోదించి నియమించినట్లు జిల్లా నుంచి వచ్చిన త్రికోణ కమిటీ ప్రకటించింది. మండల కేంద్రంలో త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నిర్ణ యం తీసుకున్నట్లు తెలిపారు. ఏకగ్రీవంగా గుమ్మ డి.గణేష్ మండల అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. మండలంలో బీజేపీ కార్యకర్తలు మండల అధ్య క్షులుగా ఎన్నుకోవడంపై గుమ్మడి గణేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్ర మంలో పోలవరం జిల్లా బీజేపీ పార్టీ పరిశీలకులు గాదె శ్రీనివాసరావు, జిల్లా బీజేపీ పార్టీ పరిశీలకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు, 07 ప్రభాతవార్త

పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు హోం మంత్రి వంగలపూడి అనిత అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులు అందజేశారు. 33 మందికి గాను రూ.31,51,284ల చెక్కులు అందజేశారు. మంత్రి అనిత మాట్లాడుతూ అనారోగ్యం లేదా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగంగా నిలుస్తుందని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండలశాఖ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, కులం దాసు నూకరాజు, మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, రాష్ట్ర పార్టీ నాయకులు వినోద్ రాజుతోపాటు పార్టీ నాయకులు గుర్రం రామకృష్ణ, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెదేపా ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం

ఎలమంచిలి, ఆగస్ట్ 07, ప్రభాతవార్త

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు, గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్ పాల్గొన్నారు. ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి వినతుల స్వీకరించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు, సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలను ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026లో భాగంగా ఓటర్ డ్రాఫ్ట్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించాలని, సరైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. సీనియర్ నాయకులు రాజన రమేష్ కుమార్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, మండల అధ్యక్షులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లి నానాజీ, లాలం భరత్, పీల తులసీరామ్, పెంటకోట విజయ్, దాడి రమేష్, రాంబిల్లి పిఎసిఎస్ చైర్మన్ ఎరిపల్లి చిట్టిబాబు క్లస్టర్ ఇన్‌చార్జులు, బొద్ధపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, దంట్ల వెంకటస్వామి, యూనిట్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

మాకవరపాలెం ఆగస్టు 7 ప్రభాతవార్త

ప్రతి గర్భవతి తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి, అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ జి.వి.రమణి అన్నారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని గిడుతూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిడిపిఓ రమణి తల్లిపాల ప్రాధాన్యతను బిడ్డలు ఎదుగుదలకు ముర్రుపాలు అవసరాన్ని వివరిం చారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన ర్యాలీలు సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని రమణి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంపీహెచ్ఓ లగుడు సత్తిబాబు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మూకల సంధ్యారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ అంగన్వాడీ కార్యకర్తలు, అధిక సంఖ్యలో గర్భిణీ స్త్రీలు బాలింతలు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు వాతావరణానుకూల సాగు చేపట్టాలి

కశింకోట, ఆగస్టు 7, ప్రభాతవార్త

ఎల్ నినో ప్రభావం ఆరుతడి పంటలు సాగు చేయా లని రైతులకు వ్యవసాయ శాఖ వీ.హెచ్.ఏ శ్రీనివాస రావు, సుందరయ్యపేట నూకాంబిక ప్రకృతి వనరులు కేంద్రం నిర్వాహకురాలు కుంద్రపు అరుణలు అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లపాలెం, గైతులపాలెం రైతులకు స్వయంగా వారి పంట పొలాలకు వెళ్లి అవగాహన కల్పించారు. వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శాకాంబరిగా భక్తులకు విశేష అలంకారంతో దర్శనమిచ్చిన దుర్గాదేవి అమ్మవారు

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని చిన దొడ్డిగల్లు గ్రామంలో కొలివైయున్న దుర్గాదేవి ఆలయంలో ఆషాడ మాసం చివరి శుక్రవారం రోజు కావడంతో భక్తులతో ఆలయ పరిసర ప్రాంతం కిటకిటలాడింది. ఆలయ కమిటీ నిర్వాహకులు వెలగా సూరిబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి పూలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు, చల్లపల్లి రమణ దంపతులు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేశారు.

ఒడ్డిమెట్టలో 'రెండు ఏళ్ల నమ్మకం'-అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికి" ప్రచారానికి విశేష స్పందన

మహిళలతో కలిసి కోలాటంలో పాల్గొన్న మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు7 ప్రభాతవార్త

నక్కపల్లి మండలంలోని ఒడ్డిమెట్ట గ్రామంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. "రెండు ఏళ్ల నమ్మకం– అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికి" ప్రచార కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామానికి వచ్చిన ఆమెకు టిడిపి పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, టిడిపి యువ నాయకుడు పైల చిరంజీవి, కొరిమి సూర్య గణేష్, ఇందుకూరి రవిరాజు, పైల విగ్నేశ్వరుడు, గంగ సత్యనారాయణ, పెద్ద రమణ, పైల గణేష్, పైడిశెట్టి గణేష్, పెట్ల రమేష్, పోతల అప్పలస్వామి తదితరులు, గ్రామస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా మంత్రి వంగల పూడి అనిత తొలుత ఒడ్డిమెట్ట గ్రామంలోని శ్రీ వినాయక స్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసీనాయుడు, మాజీ జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ తోట నగేష్, జనసేన పార్టీ ఇంచార్జ్ గడ్డం బుజ్జి, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, పార్టీ జిల్లా, మండల నాయకులు వైబోయిన రమణ, పిఎసిఎస్ అధ్యక్షులు దార్ల కృష్ణ, వెలగ శ్రీనివాసరావు, అయినంపూడి అప్పలరాజు, పళ్ళ రాంబాబు, కల్లేపల్లి వెంకటపతి రాజు, మహిళ నాయకులు మనీషా బేగం, ఎలమంచిలి పద్మ, కమెల్ల శివరామకృష్ణంరాజు, అనిల్ రాజు, బిజెపి రాష్ట్ర నాయకులు పాకలపాటి రవి వర్మ, వినోద్ రాజు, గోసల చినతాతరావు, మెరుగు నాగేశ్వరరావు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా సుధాకర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి కార్యకర్తలు ఐకమత్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, ఆగస్ట్ 07, ప్రభాతవార్త

పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కూటమి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ జనసేన, టిడిపి, బిజెపి ఓటమి కార్యకర్తల ఆధిపత్య పోరు పక్కన పెట్టి ఐకమత్యంగా పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు, పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు బోద్దపు శ్రీనివాసరావు, తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె నానాజీ, జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, పిట్టా శ్రీనివాసరావు, బిజెపి, ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేసిన హోమ్ మంత్రి అనిత

నక్కపల్లి, ప్రభాతవార్త

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో యూనిట్, క్లస్టర్, సమన్వయ కమిటీ సభ్యులతో మంత్రి అనిత శుక్రవారం సాయంత్రం సమావేశమై పార్టీ భవిష్యత్తు కార్య చరణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతతో పాటు పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వంద శాతం విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసీనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, అమల కంటి అబద్ధం, పార్టీ రాష్ట్ర నాయకులు వినోద్ రాజు, గుర్రం రామకృష్ణ, కురందాసు నూకరాజు, దార్ల కృష్ణ, అయినంపూడి అప్పలరాజు, మెరుగు నాగేశ్వరావు, గోసల చిన్న తాతారావు, వెలగ శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

"రైతన్నా మీకోసం" వారోత్సవాలు ప్రారంభం

పోస్టర్‌ను విడుదల చేసిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, ఆగస్టు 07, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "రైతన్నా మీకోసం" వారోత్సవాలు మండలంలో ప్రారంభమయ్యాయి. శుక్రవారం మండలంలోని తేరువుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, వారి సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం రైతులకు అండగా నిలవడమేనని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి మోహన్ రావు జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు లాలం సోము నాయుడు, రమేష్, శంకర్రావు, నాయుడు బోజ జయరాం, వ్యవసాయ విస్తరణ అధికారులు దేవుడు, మోహన్, భాస్కర్ రైతులు పాల్గొన్నారు.

తగ్గింపు ధరలకు నాణ్యమైన బియ్యం విక్రయాలు ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, ఆగస్ట్ 07, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తగ్గింపు ధరల బియ్యం విక్రయాల కార్యక్రమాన్ని మండలంలోని తేరువుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 1వ తేదీ నుంచి రైతు బజార్లు, రైస్ మిల్లుల ప్రత్యేక అవుట్‌లెట్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నారు. ప్రత్యేక కౌంటర్‌లో విక్రయాలను ఎమ్మెల్యే పరిశీలించి, ప్రజలకు బియ్యాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం తగ్గించాలనే లక్ష్యంతో నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించే చర్యలు చేపట్టిందన్నారు. అధికారులు, కూటమి నాయకులు ఊట కూటి రమేష్ నాయుడు,జయరాం రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త

అనకాపల్లి మండలం, మార్టూరు గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలోని వసతులు, నిర్వహణపై ఆరా తీశారు. అలాగే చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలుతో పాటు వారికి అందుతున్న పోషకాహారం గురించి సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా మమేకమై, వారితో కొంతసేపు సరదాగా గడిపారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సంరక్షణ అందేలా నిరంతరం కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రైతులకు తక్కువ వడ్డీతో రుణాల పంపిణీ

నక్కపల్లి,ప్రభాతవార్త

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతుల అభ్యున్నతే లక్ష్యంగా తక్కువ వడ్డీపై తనఖా రుణాలను మంజూరు చేసి, రైతులకు చెక్కులను అందజేశారు. సొసైటీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ రైతులు అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కోసూరి శ్రీను, మనబాల కొండబాబు చేతుల మీదుగా రైతులకు రుణాల చెక్కులు అందజేశారు. సొసైటీ సీఈఓ ఖాన్, సిబ్బంది గోవింద్, నగేష్, వరలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎయిర్ పోర్ట్ ట్రాఫిక్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్

మాధవధార, ఆగస్టు 07, ప్రభాతవార్త

రాష్ట్ర డీజీపీ ఇటీవల విశాఖలో కంచరపాలెం ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించారు. అయితే ఎయిర్ ట్రాఫిక్ స్టేషన్ హౌస్ ఆఫీసర్గా శ్రీకాంత్ను నియమించారు. విశాఖ సీపీ, ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీ జోన్ 2 ఉత్తర్వులు శ్రీకాంత్ ఎయిర్ పోర్ట్ ట్రాఫిక్ స్టేషన్ హౌస్ ఆఫీసర్గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతపై,ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. స్టేషన్ పరిధిలో పెరుగుతున్న వాహన రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాబోయే జీవీఎంసీ ఎన్నికలలో 50,51వ వార్డులలో నుంచి బరిలోకి దిగనున్న యువత

మాధవధార, ఆగస్టు 07, ప్రభాతవార్త

రాబోయే జీవీఎంసీ ఎన్నికలలో జీవీఎంసీ 50,51 వ వార్డుల నుంచి యువత ఎన్నికల బరిలోకి పోటీ చేసేందుకు దిగనున్నట్లు ప్రభాతవార్తకు తెలిపారు. ఇప్పటి వరకు గడిచిన ఎన్నికలలో తగిన ప్రాధాన్యత కల్పించకపోవడం, నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత కల్పిస్తామంటూ మాటలు చెప్పుకొని రాజకీయ అవసరాలకు వాడుకోవడం, ఇతర జిల్లాల నుంచి వలస వచ్చి ఆర్థికంగా,రాజకీయపరంగా స్థిరపడిన వారిపై లేనిపోని అబద్ధపు ప్రచారాలు సృష్టించి విద్వేషాలు తెస్తున్నారని అటువంటి వారి వెనక తిరిగి వారిని ప్రోత్సహించడం కన్నా, ఎన్నికల బరిలోకి దిగి పోటీ చేసి తమకంటు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇటీవల గత కొద్ది కాలంగా ఢిల్లీ కేంద్రంగా యువత రోడ్డు మీదకు వచ్చి కేంద్ర మంత్రి పదవిని సైతం కదిలించడంలో కీలకపాత్ర పోషించారని అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికలలో బరిలోకి దిగనున్నట్టు నిర్ణయించుకున్నట్లు కొందరు తెలిపారు. అయితే ఇతర జిల్లాల నుంచి వలస వచ్చి స్థిరపడిన వారిని వేరుగా చూస్తుండడంతో ఇటీవల అటువంటి వలస వచ్చిన వందలాది కుటుంబాలు కూడా రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకొని రానున్న జీవీఎంసీ ఎన్నికలలో 50,51వ వార్డులలో తమకు మద్దతు కల్పించే వ్యక్తులను ఎన్నుకోవాలని, అవసరమైతే వారంతా కలిసి ఒక అభ్యర్థిని ఎన్నుకొని బరిలోకి దించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే ఇటీవల ఈ రెండు వార్డులలో ఎక్కడ నిర్మాణాలు జరిగిన, ఏ పనులు కావాలన్న దానికంటూ ప్రత్యేకంగా కొందరు నేతలు ఒక ధరను నిర్ణయించారని, అటువంటి వారిని రేపు ఎన్నికల్లో గెలిపిస్తే ఐదు సంవత్సరాల పాటు వారి కింద బానిసల్లాగా బతకాలని,ఎన్నికల వచ్చే సమయంలో స్వార్థ ప్రయోజనాల కోసం మంచి మాటలు చెప్పి ఎన్నికలు ముగిసిన తర్వాత వెన్నుపోటు పొడుస్తున్నారని ఇటువంటి రాజకీయాలకు ప్రజలు ఆకర్షితుల కాకుండా యువతను ఎన్నుకోవాలని నిస్వార్థ రాజకీయాలకు మద్దతు పలకాలని అటువంటి వారిని ప్రోత్సహించాలని, రానున్న ఎన్నికలలో ఆర్థిక బలం,కుటుంబ బలం,రాజకీయ బలం ఉన్న వ్యక్తులు పార్టీల తరుపున లేకుంటే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకుంటున్నట్లు ప్రభాతవార్తకు తెలిపారు.

రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలి

ఆనందపురం, ఆగస్టు 7, ప్రభాతవార్త

రైతన్న మీకోసం కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పంట నమోదు, పంట పరిస్థితుల నమోదును ఖచ్చితంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్యామల సూచించారు. ఆనందపురం మండలంలో శుక్రవారం బోని, పెద్దిపాలెం, గొట్టిపల్లి, వెల్లంకి, గిడిజాల, తర్లువాడ, భీమన్నదొరపాలెం గ్రామాలలో నిర్వహించిన –రైతన్న మీకోసం' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతులకు పంటల పరిస్థితులు, ఎల్నినో ప్రభావం, నీటి వినియోగం, పంట సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, పీఏసీఎస్ ప్రతినిధులు, వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది సమన్వయంతో రైతులను నేరుగా కలిసి ఎల్నినో ప్రభావం, పంటల యాజమాన్యం, నీటి వినియోగం, పంట సంరక్షణ చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. సాగులో ఉన్న ప్రతి పొలాన్ని గుర్తించి సంబంధిత పంటను ఏపీ ఎయిమ్స్ యాప్లో నమోదు చేయడంతో పాటు పంట ఆరోగ్య స్థితి, నీటి లభ్యత, ప్రస్తుత పంట పరిస్థితిని కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.హెచ్. సంధ్యారత్న ప్రభ, ఉద్యాన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఆరిలోవలో ఖాళీ బిందెలతో మహిళలు పెద్ద ఎత్తున నిరసన

ఎఈ ఆఫీస్ ఎదుట సిపిఎం ధర్నా, రాస్తారోకో

ఆరిలోవ, ఆగస్టు 7, ప్రభాతవార్త

ఆరిలోవ ప్రజల దాహార్తి తీర్చాలని సిపిఎం విశాఖ తూర్పు నియోజకవర్గం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో బాలాజీనగర్ దుర్గాలమ్మ గుడి వద్ద ఉన్న ఎఈ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో, మహిళలు ప్రజలు పెద్దఎత్తున నిరసనకు దిగారు. అధికారులు లేరని తెలియడంతో రోడ్డుపై రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. కొద్దిసేపటికే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్కు అంతరాయం కలిగింది. అయినా ప్రజలు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతుండటంతో రాస్తారోకోకు ప్రజలు సహకారంలొనగానే సహకరించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ గంగారావు మాట్లాడుతూ ఆరిలోవ ప్రాంతంలో శ్రీహరినగర్, గాంధీనగర్, రవీంద్రనగర్, బాలాజీనగర్, ముస్తఫాకాలనీ, భరత్నగర్, ఎస్టీకాలనీ, టిబిసి పాయింట్, నెహ్రూనగర్, రాజీవ్నగర్, దుర్గానగర్, సూర్యతేజనగర్, లక్ష్మీనగర్, 40గజాలు, దుర్గాబజార్, శివాజీనగర్, ఆరిలోవ కాలనీలతో పాటు కొండవాలు ప్రాంతాల్లోని సంజయ్ గాంధీనగర్, సింహగిరికాలనీ తదితర కొండ ప్రాంతాల్లో నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏ రోజు మున్సిపల్ కొళాయి వస్తుందో తెలియక పనులు మానుకొని నీటి కోసం పడిగాపులు కాస్తున్నారని, దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు గా టిఎస్ఆర్ కాంప్లెక్ నుండి 10వ వార్డు డ్రైవర్స్ కాలనీ వరకు వస్తున్న నీటిని 11, 12, 13వార్డులలో అన్ని కాలనీలకు సరఫరా చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాతైన ఫీడ బోర్లు స్థానంలో కొత్తబోర్లు వేయాలని, హెల్త్ సిటీ హాస్పిటల్స్ అక్రమ బోర్లను సీజ్ చేయాలని, ప్రైవేట్ నీటి వ్యాపారం దందాను అరికట్టాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మరోవైపు ఆరిలోవ లక్ష్మండికి నీరందిస్తున్న ముడసర్లోవ రిజర్వాయర్ కాపాడుకోవాలంటే గూగుల్ డేటా సెంటర్ను ఈ ప్రాంతంలో అనుమతులు ఇవ్వరాదని హెచ్చరించారు. రిజర్వాయర్కు ఏలేరు కెనాల్ నుండి నీటిని పైపులైను ద్వారా నింపి నిల్వలు చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే గాని, మొన్న వచ్చిన మంత్రి లోకేష్ గాని ఈ ప్రాంతం మంచినీటి కోసం మాట్లాడకుండా ఎందుకు వెళ్ళిపోయారని ప్రశ్నించారు. సిపిఎం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, బి.సూర్యమణి, కె.కుమారి, పి.వెంకటరావు, గౌరీ, రమణమ్మ, బసి నాయుడు, డి. నాగరాజు, రమణ, కాంత, మణి, రమణ పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు

పద్మనాభం, ఆగస్టు 7, ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వ హయాంలో దగాపడ్డ డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ మద్ది చిన్న శ్రీను రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏపీజేఏసీ వారు కార్యక్రమంలో భాగంగా గత సంవత్సరం డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతలకు నిరసనగా శుక్రవారం పద్మనాభం జంక్షన్లో మండల వైసిపి అధ్యక్షులు లక్ష్మణరావు, ఎంపీపీ రాంబాబు ఆధ్వర్యంలో నిరుద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన డీఎస్సీ పరీక్షల్లో భారీ స్కాంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సిబిఐతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్సీలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం శిబిరాన్ని సందర్శించిన [illegible] వరకు నిరసన శిబిరంలో కూర్చొని సంఘీభావం తెలిపిన మజ్జి సిరమును అభినందించి నిమ్మరసం ఇచ్చి నిరసనను విరమింప చేశారు. నిరుద్యోగులు, వైసిపి విద్యార్థి విభాగం, నాయకులు పాల్గొన్నారు.

వైద్యులు, ఆరోగ్య సిబ్బందిపై హింసను అరికట్టాలి

నేడు ఒజీఎస్వీ ఆధ్వర్యంలో 'అభయ దినోత్సవం' అవగాహన ర్యాలీ

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త

వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బందిపై హింసను అరికట్టాలనే సందేశంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విశాఖపట్నం ప్రసూతి మరియు స్త్రీరోగ వైద్యుల సంఘం (ఒజీఎస్వీ) ఆధ్వర్యంలో 'అభయ దినోత్సవం' సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి ఈ ర్యాలీ జరుగుతుంది. ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ, ఒజీఎస్వీ అధ్యక్షురాలు డా. కె.వి.ఎస్.ఎం. సంధ్యా దేవి, కింగ్ జార్జ్ ఆసుపత్రి సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ డా.ఐ.వాణి అతిథులుగా హాజరుకానున్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బందితో పాటు ప్రజలు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఒజీఎస్వీ విజ్ఞప్తి చేసింది.

అనంతవరం గ్రామంలో విత్తన గుళికలు తయారీపై రైతులకు అవగాహన

పద్మనాభం, ఆగస్టు 7, ప్రభాతవార్త

మండలంలో అనంతవరం గ్రామంలో విత్తన గుళికలు తయారీపై శుక్రవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విత్తన గుళికల తయారీపై సంస్థ ప్రతినిధులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సాధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్యామల ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామంలో సుమారు టన్ను వరి విత్తనాలను గుళికలుగా తయారు చేసే విధానంపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షాలు కురిసే నేపథ్యంలో విత్తన గులుకులు నాటితే మొలక శాతం ఎక్కువగా వస్తుందని ఆమె వివరించారు. ఈ విధానము రైతులకు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆనందపురం, ఆగస్టు 7, ప్రభాతవార్త

ఆనందపురం మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ టెక్నికల్ కోఆర్డినేటర్ (డీటీసీ) పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోస్టుకు ఎంబీఏ (మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్) విద్యార్హత తప్పనిసరి. ఇంటర్వ్యూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆనందపురంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98665 77942 నంబర్లో అధికారులను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

పార్టీ బలోపేతమే ధ్యేయం : భాజపా నేత కెఎన్ఆర్

గాజువాక,ఆగస్టు 7,ప్రభాతవార్త

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని భాజపా రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్, గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పిలుపునిచ్చారు. గాజువాక నియోజకవర్గ పరిధిలోని గంగవరం, ఉక్కునగరం మండల కార్యవర్గ సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. గంగవరంలో మండల అధ్యక్షుడు పేర్ల అప్పారావు అధ్యక్షతన, ఉక్కునగరంలో మండల అధ్యక్షురాలు జిలకర్ర భువనేశ్వరిదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో కెఎన్ఆర్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వర్రి లలిత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెఎన్ఆర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుల సూచనల మేరకు నియోజక వర్గంలోని 9 మండలాల్లోనూ ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు జిలకర్ర రమణ, సియ్యాద్రి అప్పలరాజు, పేర్ల సత్యారావు, రంజిత్, శ్రీను, దేవి, ఏసురత్నం, రాజు, భారతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం కేజీబీవీ విద్యార్థుల వినూత్న ఆలోచనలకు టాటా ట్రస్ట్ ప్రశంసలు

పద్మనాభం, ఆగస్టు 7, ప్రభాతవార్త

మండలంలో కృష్ణాపురం గ్రామ పరిధిలో ఉన్న కేజీబీవీ విద్యార్థులుశుక్రవారం గీతం యూనివర్సిటీలో 21వ శతాబ్ద నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమంలో విద్యార్థులు వినూత్న ఆలోచనలను టాటా ట్రస్ట్ అభినందించింది. అయితే విద్యార్థులు తయారుచేసిన వెహికల్ ఓవర్ లోడ్ డిటెక్టర్ అనే ప్రాజెక్టును టాటా ట్రస్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ బాబి పరిశీలించి ఉత్తమ ప్రాజెక్టుగా నిలిచిందని పాఠశాల ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ తెలిపారు. ఈ ప్రాజెక్టు పనితీరు, వినియోగం, దాని వెనుక ఉన్న ఆలోచనలను విద్యార్థులు స్వయంగా వివరించారని ఆమె అన్నారు. విద్యార్థుల సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని అధికారులు అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'ఇంటింటికీ తెలుగుదేశం'

గాజువాక,ఆగస్టు 7,ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకునేందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. 66వ వార్డు అజీమ్బాబా నగర్లోని 211వ బూత్ పరిధిలో బూత్ కన్వీనర్ అన్సర్ వలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పల్లా మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, దీపం–2, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్లు, ఎన్టీఆర్ వైద్య సేవలతో ప్రభుత్వం అన్ని వర్గాలకూ అండగా నిలుస్తోందన్నారు. గాజువాకలో గతంలో ఇచ్చిన 301 జీవో పట్టాలతో పాటు, ప్రస్తుతం 25 జీవో ద్వారా హౌస్ కమిటీ పట్టాలను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. 45 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు మహమ్మద్ రఫీ, వార్డు ముర్తజా, రెహమాన్, అన్సర్ వలి, మదీనా, మున్వర్, టీ బ్రహ్మానందం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఒజీఎస్వీ "అభయ దినోత్సవం" అవగాహన ర్యాలీ నేడు

విశాఖపట్నం, ఆగస్టు 7 ప్రభాత వార్త

విశాఖపట్నం ప్రసూతి స్త్రీరోగ వైద్యుల సంఘం (ఒజీఎస్వి) ఆధ్వర్యంలో అభయ దినోత్సవం సందర్భంగా వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బందిపై హింసను అరికట్టాలనే సందేశంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆగస్టు 8, శనివారం ఉదయం 8 నుండి 9.00 గంటల వరకు ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహింస్తున్నట్లు ఒజీఎస్వి పబ్లిక్ అవేర్నెస్ కమిటీ,చైర్ పర్సన్, కార్యదర్శులు డా.పి.సుధా పద్మశ్రీ, సునంద రాణిలు తెపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ అదనపు డీఎంఈ, ఒజీఎస్వీ అధ్యక్షురాలు డా. కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) సూపరింటెండెంట్ అదనపు డీఎంఈ డా.ఐ.వాణి గఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, వైద్యులు, ఆరోగ్య సేవల సిబ్బంది, ప్రజలు ఈ అవగాహన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని వారు ఒజీఎస్వి తరపున విజ్ఞప్తి చేసారు.

మిలీనియం' ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్లో 23 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త

మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో, ఎస్బీ సాఫ్ట్వేర్ సర్వీసెస్ సంస్థ సహకారంతో నిర్వ హించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్లో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జూనియర్ రియాక్ట్.జేఎస్, నోడ్.జేఎస్ డెవలపర్, మొబైల్ యాప్ డెవలపర్ పోస్టులకు నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో సుమారు 60 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఫ్రంట్ఎండ్ డెవలప్మెంట్, జావా, పైథాన్, నోడ్.జేఎస్, రియాక్ట్.జేఎస్ వంటి సాంకేతిక నైపుణ్యాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరిలో 23 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, 15 మంది మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్లో శిక్షణ పొందిన విద్యార్థులు కావడం విశేషం. ఎంపిక ప్రక్రియలో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, కొత్త విషయాలు నేర్చుకునే ఆసక్తిని ఎస్బీ సాఫ్ట్వేర్ సర్వీసెస్ జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్లు టి.చరణ్ సాహు, కె.ఎల్.మణి శంకర్ అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి క్యాంపస్ డ్రైవ్లు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్నట్లు తెలిపారు. మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ హెచ్ఆర్ మేనేజర్ బి.దివ్యజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఎస్బీ సాఫ్ట్వేర్ సర్వీసెస్కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించడంతో పాటు డ్రైవ్ విజయవంతానికి కృషి చేసిన శిక్షణ, ప్లేస్మెంట్ విభాగం సిబ్బందిని అభినందించారు.

ఆంధ్ర మెడికల్ కళాశాల - కేజీహెచ్లో ఘనంగా ముగిసిన ప్రపంచ తల్లిపాల వారోత్సవం

విశాఖపట్నం, ఆగస్టు7 ప్రభాతవార్త



ఆంధ్ర వైద్య కళాశాల, కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్) శిశువైద్య విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవం "బ్రెస్ట్ ఫీడింగ్ ఫర్ ఎ సూస్తా యినబుల్ స్టార్ట్ ఇన్ లైఫ్ – స్ట్రెంగ్తహేన్ వాట్ వర్క్స్ " అనే ప్రపంచ థీమ్తో నిర్వహించబడింది. వారోత్సవం సందర్భంగా శిశువైద్య విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులు, పీజీ, యూజీ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, ఎన్ఆర్సీ, డీఈఐసీ, స్కూల్ హెల్త్ విభాగాల సిబ్బంది చురుకుగా పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన ప్రపంచ తల్లిపాల వారోత్సవం, ప్రపంచ ఓఆర్ఎస్ వారోత్సవం వంటి ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రతి సంవత్సరం అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తూ సమాజంలో ఆరోగ్య అవగాహన పెంపొందిస్తున్న శిశువైద్య విభాగాన్ని అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, శిశువైద్య విభాగాధిపతి ప్రొఫెసర్ డా.బి.ఎస్.చక్రవర్తితో కలిసి వారోత్సవంలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. శిశువైద్య విభాగ ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవాణి అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. వారోత్సవ కార్యక్రమాలను అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎం.గిరిధర్ సమర్థవంతంగా సమన్వయం చేయగా, ముగింపు కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తాటం నాయుడు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో తల్లిపాలపై శాస్త్రీయ అవగాహన పెంపొందించడం, ప్రతి శిశువుకు జీవితంలో ఉత్తమమైన ప్రారంభాన్ని అందించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ వారోత్సవం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

లంకవాణిపాలెం గ్రామకంత భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలి

ప్రజా దర్బార్లో జాయింట్ కలెక్టర్, మాడుగుల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన మాజీ సర్పంచ్ వేచలపు దొరబాబు

అనకాపల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా, కె.కోటపాడు మండలం, లంకవాణి పాలెం గ్రామంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న గ్రామ కంత భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రజా దర్బార్లో గ్రామ ప్రజల తరఫున మాజీ సర్పంచ్ వేచలపు దొరబాబు వినతిపత్రం సమర్పించి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే గ్రామ ప్రజలు నివసిస్తున్న గ్రామకంత భూముల్లో 1952–1956 మధ్య జరిగిన సెటిల్మెంట్ సమయంలో రెవెన్యూ రికార్డుల్లో జరిగిన పరిపాలనా పొరపాటు కారణంగా కొంత భూమి శ్రీ సదానంద దివ్య కేశవస్వామి దేవస్థానం పేరున నమోదైందని తెలిపారు. దీంతో దశాబ్దాలుగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆర్.సి.నెం.285/2023/ ఎస్.ఏ., తేదీ 17–07–2023 ప్రకారం తహసీల్దార్, మండల సర్వేయర్ తదితర రెవెన్యూ అధికారులు నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో సర్వే నెంబర్లు 59/1, 59/2, 59/3, 62/2, 62/5, 62/6, 65/1, 65/2, 65/3, 65/4 గ్రామకంత స్వభావం కలిగిన భూములేనని స్పష్టంగా నివేదించినప్పటికీ, ఇప్పటివరకు రెవెన్యూ రికార్డుల్లో అవసరమైన సవరణలు జరగలేదని తెలిపారు. దీని కారణంగా గ్రామ ప్రజలు ఇంటి పట్టాలు పొందడం, బ్యాంకు రుణాలు తీసుకోవడం, గృహ నిర్మాణ అనుమతులు పొందడం వంటి ప్రాథమిక హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సుమారు 800 మంది గ్రామ ప్రజల భవిష్యత్తు ఈ సమస్యతో ముడిపడి ఉందని పేర్కొంటూ, ప్రభుత్వ రికార్డుల్లో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్ది సంబంధిత సర్వే నెంబర్లను గ్రామకంత భూములుగా నమోదు చేయాలని, ఇప్పటికే నిర్మించుకున్న నివాస గృహాలకు శాశ్వత చట్టబద్ధ రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో మరియు సంబంధిత రెవెన్యూ అధికారులను కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నివేదిక, మండల సర్వేయర్ నివేదిక, ఎఫ్ఎంబీ స్కెచ్లు, టోపోగ్రాఫికల్ మ్యాపులు, ఇతర సంబంధిత ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించినట్లు మాజీ సర్పంచ్ వేచలపు దొరబాబు తెలిపారు. ప్రజా దర్బార్లో ఈ సమస్యను జాయింట్ కలెక్టర్ మరియు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సమస్యకు ప్రభుత్వం త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపించి, గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి ఆధారంగా పంటలు పండించండి

భూమిని విష రసాయనాలతో నింపొద్దు -ప్రకృతి ఆధారిత పంటలే ఆరోగ్యకరం -ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద కూరగాయలు పండించాలి -విశాఖ జిల్లా, ఎపిసిఎన్ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.సత్య శ్యామల

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త

ప్రకృతి ఆధారంగా పంటలు పండించండి అని ఎపిసిఎన్ఎఫ్ విశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.సత్య శ్యామల కోరారు. శుక్రవారం ఉదయం విశాఖ జంతుప్రదర్శనశాలకు చేరువలో ఉన్న విశాఖ వ్యాలీ విద్యాసంస్థలో ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ అధ్యక్షతన విద్యార్థులు కూరగాయలు, ఆకు కూరలు, ట్రే నర్సరీ, ఒక ప్రాచీన గ్రామం మినియేచర్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సత్యశ్యామల మాట్లాడుతూ భూమిని విష రసాయనాలతో నింపొద్దు అని కోరారు. ప్రకృతి ఆధారిత పంటలే ఆరోగ్యకరం అని వివరించారు. విద్యార్థులకు ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం విషయంలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించడం అవసరం అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద కూరగాయలు పండించాలి అని కోరారు. డా.ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు అన్ని రకాల కళల పట్ల శిక్షణ ఇవ్వడం జరిగుతోంది అని వివరించారు. అంతేకాక ఆయా విభాగాలకు ఇంచార్జ్లను ఏర్పాటు చేశామని వివరించారు. విద్యార్థులకు ఎన్ని విధాలుగా ఏమేమి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగుతుంది తెలియజేశారు. తమ విద్యార్థులకు అన్ని రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరిగుతోందని పేర్కొన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం, పర్యావరణ పరిరక్షణ, శీతో ష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలని వారికి అవగాహన కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. అగ్రి స్కిల్ సిఇఒ వి.మెహర్ ప్రసాద్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పాల్గొని మాట్లాడారు.

ఎయులో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం,ఆగస్టు 7, ప్రభాతవార్త

ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (ఆర్యుఎస్ఎ) ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 24 నుండి 28 వరకు "ఎమర్జింగ్ ఫ్రాంటియర్స్ ఇన్ బయోటెక్నాలజీ: ఏఐ, ఫర్మెంటేషన్ టెక్నాలజీ అండ్ బయోమాన్యుఫాక్చరింగ్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్డీపీ)ను నిర్వహిస్తోంది. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కు సంబంధించిన పోస్టర్ను ఏయు ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు అకాడమిక్ డి ఆచార్య కె.శ్రీనివాసరావు, రీసెర్చ్ డెవలప్మెంట్ డీన్ ఆచార్య వి.వల్లి కుమారి, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య పి.రాధిక పాల్గొన్నారు. బయోటెక్నాలజీ రంగంలో వస్తున్న నూతన అంశాలపై అధ్యాపకుల జ్ఞానాన్ని, బోధనా నైపుణ్యాలను పెంపొందించడం, ఉన్నత విద్యలో ఉత్తమ ప్రమాణాలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. బయోటెక్నాలజీ పరిశోధన, ఆవిష్కరణలు మరియు పారిశ్రామిక విధానాలను వేగంగా మార్చివేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనువర్తనాలు, ఫర్మెంటేషన్ టెక్నాలజీ, బయోమాన్యు ఫాక్చరింగ్ వంటి మూడు కీలక రంగాల్లోని తాజా పురోగతిని విస్తృతంగా పరిశీలించేందుకు ఈ ఐదు రోజుల ఎఫ్డిపి ఒక వేదికను అందిస్తుంది. ప్రముఖ విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు, పరిశ్రమలకు చెందిన ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, నిపుణులతో నిపుణుల ఉపన్యాసాలు, సాంకేతిక సెషన్లు, చర్చలు ఈ ప్రోగ్రామ్లో ఉంటాయి.ఈ ఎఫ్డిపి ముఖ్యంగా విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలలు, అటానమస్ కళాశాలలు, ప్రత్యేకించి ఆంధ్ర విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలకు చెందిన బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీ, బయోకెమిస్ట్రీ మరియు ఇతర లైఫ్ సైన్సెస్ విభాగాల అధ్యాపకులకు ఉద్దేశించబడింది. సమకాలీన జ్ఞానం, ఆచరణాత్మక అవగాహన నూతన సాంకేతిక పోకడలను అధ్యాపకులకు అందించి, వాటిని బోధన, పరిశోధన, ఆవిష్కరణలు పాఠ్యాంశాల రూపకల్పనలో సమర్థవంతంగా అనుసంధానించేలా చేయడం దీని లక్ష్యం. బయోటెక్నాలజీలోని అత్యాధునిక రంగాలలో నిపుణులతో సంభాషించడానికి, ఆలోచనలను పంచుకోవడానికి మరియు విద్యా, పరిశోధనాత్మక భాగస్వామ్యాలను నెలకొల్పుకోవడానికి ఈ ప్రోగ్రామ్ ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తుంది. అలాగే, విద్యావేత్తలలో సామర్థ్య పెంపును ప్రోత్సహించడం, పరిశ్రమల అవసరాలు, జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆవిష్కరణల ఆధారిత బోధన, పరిశోధనలను పెంపొందించడం కూడా దీని ముఖ్య ఉద్దేశం విశ్వవిద్యాలయాలు అనుబంధ కళాశాలల అధ్యాపకులు ఈ ఎఫ్డిపిలో పాల్గొని, విద్యా, పారిశ్రామిక రంగాల ప్రముఖ నిపుణుల అనుభవం, మార్గదర్శకత్వం ద్వారా ప్రయోజనం పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందని కార్యక్రమ కన్వీనర్ ఆచార్య పి.రాధిక అన్నారు.

వెలంపేట స్లమ్కు మహర్దశ..

రీ-డెవలప్మెంట్కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ -177 కుటుంబాలకు ఆధునిక గృహాలు.. -విశాఖలో తొలి ప్రధాన స్లమ్ రీ-డెవలప్మెంట్ ప్రాజెక్టుల్లో ఒకటిగా వెలంపేట

విశాఖపట్నం, ఆగస్టు 7, ప్రభాతవార్త

విశాఖ నగరంలోని వెలంపేట స్లమ్ రీ–డెవలప్మెంట్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పట్టణ పేదలకు మెరుగైన, గౌరవప్రదమైన నివాస వసతులు కల్పించాలన్న లక్ష్యంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్లో తొలి ప్రధాన స్లమ్ రీ–డెవలప్మెంట్ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలవనుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్) కార్యక్రమం కింద ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వెలంపేటలో జీవీఎంసీకి చెందిన 1,986.45 చదరపు మీటర్ల స్థలంలో ప్రస్తుతం నివసిస్తున్న 177 కుటుంబాలకు అక్కడికక్కడే ఆధునిక గృహాలను నిర్మించనున్నారు. గరిష్ఠంగా 45 మీటర్ల ఎత్తుతో బహుళ అంతస్తుల గృహ సముదాయాలను నిర్మించి, పట్టణ పేదలకు సురక్షితమైన, నాణ్యమైన నివాస వసతులు కల్పించనున్నారు. జీవీఎంసీ రూపొందించి సమర్పించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను పరిశీలించిన అనంతరం, ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సూచనల మేరకు సవరించిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కమిషనర్ వివరించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సురేష్ కుమార్ జీవోఆర్టీ నంబర్ 1012 ద్వారా ఆగస్టు 7న ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును డిజైన్–బిల్డ్–ఫైనాన్స్–ట్రాన్స్ఫర్ (డీబీఎఫ్టీ) విధానంలో జీవీఎంసీ అమలు చేయనుంది. నిర్మాణ వ్యయానికి బదులుగా 1:4 నిష్పత్తిలో ట్రాన్స్ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్)ను గరిష్ఠ బిడ్డింగ్ ప్రమాణంగా నిర్ణయించి, పోటీ టెండర్ల ద్వారా డెవలపర్ను ఎంపిక చేయనున్నారు. ప్రాజెక్టు వేగవంతమైన అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ బిల్డింగ్ రూల్స్–2017లో ప్రత్యేక సడలింపులు కల్పించింది. భవన ఎత్తు, సెట్బ్యాక్లు, పార్కింగ్ నిబంధనల్లో అవసరమైన వెసులుబాటుతో పాటు జీవీఎంసీ, యూడీఏ, సీ అండ్ డీఎంఏలకు చెల్లించాల్సిన కొన్ని ఫీజులు, ఛార్జీల నుంచి మినహాయింపులు కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. వెలంపేట రీ–డెవలప్మెంట్ను వీఈఆర్ పరిధిలో కాలపరిమితిలో పూర్తి చేసి, రాష్ట్రంలోని ఇతర పట్టణ ప్రాంతాల్లో మురికివాడల పునరాభివృద్ధికి ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రాజెక్టు విజయవంతమైతే ఇతర నగరాల్లోనూ ఇదే తరహా పునరాభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆధునిక గృహాలతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, అంతర్గత రహదారులు, కమ్యూనిటీ సౌకర్యాలు వంటి సమగ్ర మౌలిక వసతులను కల్పించి వెలంపేటను ఆదర్శ నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ కట్టుబడి ఉందని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.

సిబిఐ విచారణకు భయమెందుకు?

- న్యాయం అడుగుతున్న అభ్యర్థులపై దాడులెందుకు
- వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ నిలదీత

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: డిఎస్సీ లీకేజీపై సిబిఐ విచారణకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం భయపడుతుందని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ ఆరోపించారు. తప్పు చేయకుంటే న్యాయం చేయమని ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై దాడులు ఎందుకు చేయిస్తున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. డిఎస్సీ అక్రమాల గుట్టు కప్పెట్టేందుకే ప్రజాస్వామ్య యుతంగా ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై నిస్సిగ్గుగా టిడిపి నేతలే స్వయంగా దాడులు చేస్తున్నారన్నారు. డిఎస్సీ 2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసిపి అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. విజయవాడలో రిలే దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డిఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సిబిఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని అన్నారు. మీకు చిత్తశుద్ధి ఉంటే విచారణకు నిలబడాలన్నారు. డిఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలన్నారు.

డిఎస్సీ నియామకాల్లో అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: డిఎస్సీ–2025 నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై స్వతంత్ర సిబిఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్‌సిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజు కూడా రిలే నిరాహార దీక్షలు ఉద్ధృతంగా కొనసాగాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో కొత్తపేట ఉద్రిక్తత నెలకొంది. పూర్ణానందపేట బాప్టిస్ట్ నగర్‌లో వైస్సార్సీపీ దీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలను ఇబ్బంది పెట్టేలా దీక్షా శిబిరం ఏంటని పెయిడ్ ఆర్టిస్ట్‌లతో దొంగ శిబిరాలు నడుపుతున్నారంటూ టిడిపి ఆందోళన చేపట్టింది. బుద్దా వెంకన్న నేతృత్వంలో శిబిరం వద్దకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. మార్గమధ్యంలో బుద్దా వెంకన్నను ఆయన ఇంటికి తరలించారు.

విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి

కొవ్వూరు (నెల్లూరు), ఆగస్టు 7 ప్రభాతవార్త: డిఎస్సీ–2025 నియామకంలో జరిగిన అక్రమాలు అవకతవకలపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు విద్యార్థులు, నిరుద్యోగ యువత తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ పేరుతో వేలాది పోస్టులు భర్తీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో అభ్యర్థులకు అన్యాయం జరిగేలా వ్యవహరించిందని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా, నకిలీ సర్టిఫికెట్లపై అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘుకుమార్‌రెడ్డి, కొవ్వూరు, సర్వేపల్లి పరిశీలకులు కొండూరు అనిల్‌బాబు, వీరి చలపతిరావు, నియోజకవర్గంలోని వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నెల్లూరులో కొనసాగుతున్న రిలే దీక్షలు

నెల్లూరు(పిడి), ఆగస్టు 7 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డిఎస్సీ 2025లో జరిగిన అవినీతికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయ్యాలని డిమాండ్ చేస్తూ తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక వీఆర్సి సెంటర్‌లో నిర్వహిస్తున్న జంబోవార్ రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండవరోజు కొనసాగాయి. రెండవరోజు శుక్రవారం వైకాపా నేతలు, నెల్లూరు నగర నియోజకవర్గ నాయకులు, కార్పోరేటర్లు, విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి దీక్షా శిబిరాల్లో నిరసనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతూ మెగా డిఎస్సీ పేరుతో సుమారు 4 లక్షల మంది అభ్యర్థులను ఈ కూటమి ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు. డిఎస్సీలో జరిగిన అవినీతి అక్రమాలను పూర్తిస్థాయిలో వెలుగులోకి తీసుకువచ్చేందుకు సిబిఐతో విచారణ చేపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అవినీతికి బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ తన పదవికి రాజీనామా చెయ్యాలన్నారు. లోకేష్ రాజీనామా చేసేవరకు తమ నిరసన కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించటం జరుగుతుందన్నారు.

భాగ్యనగర్ అమ్మవారర్లకు దుర్గమ్మ పట్టువస్త్రాలు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 7 ప్రభాతవార్త: భాగ్యనగర అమ్మవార్లకు బెజవాడ శ్రీ కనక దుర్గమ్మ నుండి శుక్రవారం పట్టు వస్త్రాల సమర్పణ చేశారు. తెలంగాణ బోనాలు ఉత్సవాలు సందర్బంగా హైదరాబాద్ శ్రీ భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర ఉమ్మడి దేవాలయాలలో కొలువై శ్రీ మహంకాళీ దేవాలయం, ఉప్పుగూడ. శ్రీ సింహవాహిని మహంకాళీ దేవాలయం, లాల్ దర్వాజా శ్రీ మహంకాళీ దేవాలయం, గౌలిపురా. శ్రీ జగదాంబ దేవాలయం, సుల్తాన్ షాహి శ్రీ బేల ముత్యాలమ్మ దేవాలయం, హరిబౌలి, శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం, హరిబౌలి, శ్రీ అక్కన్న మాదన్న దేవాలయం, హరిబౌలి, శ్రీ మహాంకాళేశ్వర దేవాలయం, మీర్ ఆలంమండి దేవతా మూర్తులకు విజయవాడ శ్రీ కనక దుర్గమ్మ సన్నిధి నుండి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెంది, వర్ధిల్లాలని ఆశిస్తూ వస్త్రాలు సమర్పించినట్లు చైర్మన్ తెలిపారు. హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ బాధ్యులు విజయవాడ బృందానికి స్వాగతం పలికి వివిధ ఆలయాలకు తోడ్కొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు ఎల్.దుర్గాప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు బడేటి ధర్మారావు, అవ్వారు శ్రీనివాసరావు, టి హరికృష్ణ, పి రాఘవ రాజు, టి వెంకట రమణారావు, వేద పండితులు, సూపరెండెంట్ డివివి సత్యనారాయణ, ఫెస్టివల్ సెక్షన్ గుమస్తా పి శిరీష తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మని దర్శించుకున్న మంత్రి ఆనం: బెజవాడ దుర్గమ్మ ఆలయంలో రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వీఐపీ దర్శనాలతో పాటు సాధారణ భక్తుల దర్శనం కూడా సజావుగా కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలిచ్చారు. ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, షటిల్ సర్వీసులు, అత్యవసర సేవలను ముందుగానే సిద్ధం చేయాలని ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆలయ మాస్టర్ ప్లాన్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఆనం పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను రాష్ట్ర ప్రతిష్టకు తగ్గట్టుగా అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

దుర్గమ్మకి వైభవంగా ఆషాఢం సారె: శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి భక్తులు తరలి వచ్చారు. ఆషాఢ సారె 23వ రోజు

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం

పట్టువస్త్రాలు సమర్పణకు వచ్చిన బృందానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

శుక్రవారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది. సారె బృందాలకు ఉచిత దర్శనం, ఆశీర్వచనం అందించారు. ఉదయం నుండి అమ్మవారి దర్శనార్థం భక్తులు 11 గంటల తరవాత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో అంతరాలయ దర్శనం, వీఐపీ బ్రేక్ తాత్కాలిక నిలిపివేసి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాలయ దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం లభించింది.

త్వరలో నూతన ప్రసాద భవనాల ప్రారంభం: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నూతన ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాద భవనాల్ల ప్రారంభోత్సవానికి సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ భవనాల ప్రారంభోత్సవానికి సంబంధించి దేవాదాయ శాఖ నుండి అధికారిక ఉత్తర్వులు రావడం, ఆలయ వేద పండితులు నిర్ణయించే పవిత్ర ముహూర్తం ప్రకారం శ్రావణ మాసం మొదటి లేదా రెండవ వారంలో ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లపై శుక్రవారం ఈవో వి.కె. శీనా నాయక్ సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ నూతన భవనాలు భక్తులకు అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఇంజినీరింగ్, లడ్డూ ప్రసాదం తయారీ విభాగం, అన్నప్రసాద విభాగాలు సమన్వయంతో సంయుక్త కార్యాచరణ రూపొందించుకోవాలని, ఈవో ఆదేశించారు. ప్రారంభోత్సవ సమయానికి యంత్రాల పనితీరు, మౌలిక వసతులు, విద్యుదీకరణ, మరియు ప్రసాదాల తయారీ ప్రక్రియ ఎక్కడా అంతరాయం లేకుండా ఉండేలా విభాగాల వారీగా పనులను విభజించి శరవేగంగా పూర్తి చేయాలన్నారు. వేద పండితుల నిర్ణయం ప్రకారం ముహూర్తం ఖరారైన వెంటనే దేవాదాయ శాఖ కమిషనరు అనుమతితో ప్రారంభోత్సవ తేదీని అధికారికంగా వెల్లడిస్తామని, శ్రావణ మాసంలో భక్తులకు నూతన భవనాల ద్వారా మరింత మెరుగైన సేవలందిస్తామని ఈవో తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు, ప్రసాదం పోటు మరియు అన్నప్రసాద విభాగాల అధికారులు, ఆలయ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకి నృత్యాభిషేకం: దుర్గమ్మకి విజయవాడకు చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి బి.స్వర్ణలత బృందం శుక్రవారం ప్రదర్శించిన నృత్యాభిషేకం భక్తులను ఆకట్టుకుంది. మూషిక వాహన, జయ జయ, చక్కని తల్లి, అంతా రామమయం, ముద్దుగారే యశోద, తాండవకృష్ణ, పలుకే బంగారమాయెనా, ఇదిగో భద్రాద్రి జతి స్వరంఅంశాలు దర్శనానికి విచ్చేసిన భక్తుల మన్ననలందుకున్నాయి. ప్రదర్శన అనంతరం కళాకారిణి స్వర్ణలత వారి బృందాన్ని దేవస్థాన అధికారులు అభినందించి గౌరవించారు.

అపోలో - హైదరాబాద్ వర్సిటీ ఒప్పందం పునరుద్ధరణ



హైదరాబాద్ యూనివర్సిటీ-అపోలో యూనివర్సిటీల మధ్య వున్న ఒప్పందంను పునరుద్దరించుకున్న ఇరు యూనివర్సిటీలు.

చిత్తూరు(హెల్త్), ఆగస్టు 7 ప్రభాతవార్త: విద్య, పరిశోధన, శిక్షణా రంగాల్లో సహకారంను మరింత విస్తరించడానికి హైదరాబాద్ యూనివర్సిటీ-అపోలో యూనివర్సిటీలు తమ భాగస్వామ్యంను కొనసాగించాలని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో ఇరు సంస్థల మధ్య గతంలో కుదిరిన అవగాహన ఒప్పందంను శుక్రవారం తాజాగా పునరుద్దరించాయి. ఈ ఒప్పందం కింద విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా శిక్షణ కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు నిర్వహించడంతో పాటు సంయుక్త పరిశోధనలు, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, అధ్యాపకులు- విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు చేపట్టనున్నారు. జీవశాస్త్రాలు, వైద్య శాస్త్రాలు, ప్రజా ఆరోగ్యం, మనోవిజ్ఞానం, దృష్టి శాస్త్రం, నిర్వహణ రంగాల్లో ప్రత్యేకంగా సహకారంను పెంపొందించనున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక పరిశోధన అనుభవం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. మూడేళ్ళపాటు అమలులో వుంటే ఈ ఒప్పందం అవసరమైతే పొడిగించుకునే అవకాశం వుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనిర్సిటీ నుండి వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం.నాగర్కర్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టిన్, రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ ఎస్. అకాడెమిక్ వ్యవహారాల అధిపతి డాక్టర్ ప్రభాకర్ కె పాల్గొనగా, హైదరాబాద్ యూనివర్సిటీ నుండి ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ జె.అనురాధ, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, మేనేజ్‌మెంట్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ జీవిఆర్‌కె ఆచార్యులు, అధ్యాపకులు రంజిత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో 70 అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం రూ.181.91 కోట్ల విడుదలకు అనుమతి

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో 70 అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల కాలానికి నిధులను మంజూరు చేసింది. పేదలకు రాయితీతో కూడిన ఆహార సరఫరా మూడేళ్ల ఒప్పంద కాలానికి రూ.181.91 కోట్ల విడుదలకు అనుమతించింది. ఫిబ్రవరి, 2026 నుంచి మార్చి, 2029 వరకు ఈ మొత్తానికి పరిపాలనాపరమైన ఆమోదం లభించింది. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి మార్చి, 2026 రెండు నెలలకు రూ. 9.18 కోట్లు, 202627 ఆర్థిక సంవత్సరంలో రూ. 57.51 కోట్లు, 202728 ఆర్థిక సంవత్సరానికి 57.69 కోట్లు, 202829 ఆర్థిక సంవత్సరానికి రూ. 57.51 కోట్లు మొత్తంగా రూ. 181.91కోట్లను దీని కోసం ఖర్చు చేయనుంది. హెచ్‌కేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ సంస్థ ఈ భోజనాల సరఫరాకు ముందుకు వచ్చిందని, బయోమెట్రిక్ ఆధారంగా రియల్ టైం టోకెన్ డేటాతో వారికి బిల్లుల చెల్లింపు చేయాలని మున్సిపల్ పరిపాలన శాఖ విడుదల చేసిన ఉత్తర్వులో పేర్కొంది.

తుపాకితో కాల్పులు.. ఒకరి దారుణ హత్య

పెద్దపంజాణి, ఆగస్టు 7 ప్రభాతవార్త: పెద్దపంజాణి మండలం వీరప్పల్లి పంచాయతీ మారప్పల్లె గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన కలకలం రేకెత్తించింది. గుర్తు తెలియని దుండగులు ఆ వ్యక్తిని నాటుతుపాకీతో కాల్చిచంపినట్లు గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతిచెందిన వ్యక్తికి భూవిలు ఉండటమే కారణమని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మారప్పల్లి గ్రామంలో మేకల రెడ్డెప్ప కుటుంబం నివసించేది. మేకల రెడ్డెప్పకు కుమారుడు శ్రీనివాసులు (50)ఉన్నాడు ఇతను వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబీకులతో కలసి గ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన పొలానికి కొంత దూరంలో మేకల రెడ్డెప్ప కుమారుడు శ్రీనివాసులు రక్తపు మడుగులో పడి ఉండటాన్ని అతని భార్యగుర్తించి కేకలువేసి విషయాన్ని గ్రామస్థులకు తెలిపింది.శ్రీనివాసులు మృతదేహానికి దగ్గరలోనే నాటుతుపాకి పడిఉన్నది. దీంతో ఎవ్వరో కావాలనే శ్రీనివాసులును హతమార్చి ఉంటారని శ్రీనివాసులు కుటుంబీకులు పేర్కొన్నారు. కాగా కుటుంబ తగాదాలతోనే శ్రీనివాసులును హతమార్చి ఉంటారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తివిషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

భర్తను చంపేందుకు భార్య మాస్టర్‌ప్లాన్

ప్రమాదంలా చిత్రీకరించాలని ప్రియునికి మేసెజ్‌లు

గమనించిన భర్త పోలీసులకు ఫిర్యాదు

మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాతవార్త: మానవ సంబంధాలు రోజు రోజుకు హీనంగా తయారవుతున్నాయి. ఇటీవల కాలంలో భర్తలను చం పిన భార్యల కేసులు అనేకం ఉన్నాయి. ఇలాంటి సంఘటనే మహ బూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో భర్తను హత్య చేసేందుకు భార్య ప్రియ నితో ప్రణాళికలు రచించడంతో అది కనిపెట్టిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డోర్నకల్ మండలం చిలుకోడుకు చెందిన గాదే రాజేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా రాఘవాపురానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. గత నెల 27న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లిన సమయంలో భార్య మరో వ్యక్తితో చనువుగా ఉండటాన్ని గమనించినట్లు రాజేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పెద్దల సమక్షంలో మాట్లాడాలని నిర్ణయించి మరుసటిరోజు తన అన్నను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. భార్యతో కనిపించిన వ్యక్తి ఆ సమయంలో తనను వెంబడించినట్లు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేయగా అతను తప్పించుకుని వెళ్లి పోయాడని తెలిపాడు. అనుమానం మరింత పెరగడంతో భార్య మొబైల్‌ను పరిశీలించానని, అందులో ఉన్న చాటింగ్ చూసి షాక్‌కు గుర య్యానని రాజేశ్వరరావు చెప్పాడు. ఇంట్లో చంపొద్దని, బయట యాక్సి డెంట్‌గా కనిపించేలా హత్య చేయాలని భార్య, ఆమెకు పరిచయం ఉన్న పురిమెట్ల సైదులుకు పలుమార్లు మెసేజ్‌లు పంపినట్లు ఆరోపించాడు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగిన సంభాషణల స్క్రీన్‌షాట్లను కూడా పోలీసులకు సమర్పించాడు. భార్య, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి కలిసి తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ ఈ నెల 1న డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదలీ చేయగా కేసు నమోదుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

ఘాట్‌రోడ్డులో బైక్ ప్రమాదం.. ఒకరు మృతి

రాపూరు (నెల్లూరు), ఆగస్టు 7 ప్రభాతవార్త: రాపూరు.. చిట్వేలి ఘాట్‌రోడ్డులోని 8వ కిలోమీటర్ వద్ద శుక్రవారం బైక్ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రాపూరు మండలం, గరిమనపెంట గ్రామానికి చెందిన కూచిపాటి ప్రసాద్ (26), సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వెంగయ్య (20)గా గుర్తించారు. 108 సిబ్బంది వెంగయ్యను రాపూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిజెపి-అకాలీదళ్ మళ్లీ జట్టు!

మోడీ-సుఖ్‌బీర్‌బాదల్ భేటీతో పొలిటికల్ బజ్ • 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలపై ఆసక్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 7: వచ్చే యేడాది జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ మిత్రపక్షాలైన బీజేపీ, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) మళ్లీ చేతులు కలపనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శుక్రవారం భేటీ కావడం రాజకీయ వర్గాల్లో ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో మోడీతో బాదల్ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు పార్టీల మధ్య పొత్తు అంశంపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బీజేపీ-అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాలుగా కొనసాగిన పొత్తు 2020లో ముగిసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాల నేపథ్యంలో అకాలీదళ్ ఎన్డీయే నుంచి వైదొలగాలని నిర్ణయించింది. అప్పటి నుంచి ఇరు పార్టీలు విడివిడిగా రాజకీయ ప్రయాణం కొనసాగిస్తున్నాయి. 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ వేర్వేరుగా పోటీ చేశాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది.పొత్తు తెగిపోయినప్పటికీ ఇరు పార్టీలకు చెందిన సీనియర్ నేతల మధ్య అప్పుడప్పుడు జరుగుతున్న సమావేశాలు మళ్లీ పొత్తు పునరుద్ధరణపై ఊహాగానాలకు తావిస్తున్నాయి. తాజాగా మోడీ-సుఖ్‌బీర్ బాదల్ భేటీ కూడా ఈ అంశంపై రాజకీయంగా కీలక సంకేతంగా మారింది.పొత్తు పునరుద్ధరణకు అనుకూలంగా నేతలుఅకాలీదళ్, పంజాబ్ బీజేపీ రాష్ట్ర విభాగం, ఆర్ఎస్ఎస్.. మూడు వర్గాలూ ఇరు పార్టీల పొత్తును పునరుద్ధరించేందుకు అనుకూలంగా ఉన్నట్లు వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన కొందరు నేతలు కూడా అకాలీదళ్‌తో మళ్లీ పొత్తు పెట్టుకోవాలని కోరుకుంటున్నట్లు సమాచారం. తుది నిర్ణయం బీజేపీ కేంద్ర నాయకత్వానిదేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఏడాది మార్చిలో మోగా పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాత్రం అకాలీదళ్‌తో పొత్తు ఉండబోదని స్పష్టంగా ప్రకటించారు. దీంతో తాజా పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి బలమైన ఉనికి ఉండగా, గ్రామీణ పంజాబ్‌లో అకాలీదళ్‌కు గణనీయమైన ప్రభావం ఉంది. ఈ రెండు బలాలను కలిపితే ఎన్నికల్లో ప్రయోజనం పొందవచ్చని విశ్లేషిస్తున్నారు. పంజాబ్‌లో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా పొత్తుపై నిర్ణయం సరైన సమయంలో తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే పొత్తు పునరుద్ధరణ జరిగితే గతంలో మాదిరిగా అకాలీదళ్‌కు జూనియర్ పార్ట్‌నర్‌గా ఉండేందుకు బీజేపీ సిద్ధంగా లేదని తెలుస్తోంది.

అందరూ సమన్వయంతో పనిచేసి ‘సర్’ను విజయవంతం చేయాలి

- ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు శేషగిరిరావు

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్‌జిల్లాలో సర్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు జిల్లాస్థాయి అధికారులు, ఈఆర్‌ఓలు, ప్రజాప్రతినిధులు, బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు, రాజకీయపార్టీల ప్రతినిధులు అందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు, రాష్ట్రలేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అండ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ కార్యదర్శి యం.శేషగిరిరావు సూచించారు. విజయవాడలోని కలెక్టరేట్‌లోని ఏవిఎస్.రెడ్డి సమావేశ మందిరంలో శుక్రవారం సర్ ప్రక్రియపై పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ఓటర్లజాబితాలో సవరణలకు సంబందించి వచ్చిన క్లెయిమ్‌లు అన్నిటిపైనా వారం రోజుల్లో పూర్తిస్థాయి విచారణ జరిపి తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రతిరోజూ 70 కేసులపై విచారణ పూర్తిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపే సమయంలో సంబందిత వ్యక్తుల స్టేట్‌మెంట్‌లను రికార్డు చేయాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సంబందించిన సమాచారాన్ని నిబంధనల మేరకు రాజకీయపార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

వైకాపా రిలే దీక్షలతో... దద్దరిల్లిన చిత్తూరు జిల్లా

చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త: డిఎస్సీ-2025లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని, డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం వైకాపా నాయకులు, శ్రేణులు నిర్వహించిన రిలే నిరాహారదీక్షలు చిత్తూరు జిల్లాలో విజయవంతం అయ్యాయి. జిల్లా కేంద్రం చిత్తూరుతో పాటు యాదమరిలో జరిగిన రిలే నిరాహారదీక్షలకు మాజీ మంత్రి, వైకాపా రాయలసీమ రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. చిత్తూరులో వైకాపా ఇన్‌ఛార్జ్ ఎంసి విజయానందరెడ్డి, పలమనేరులో నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్ వెంకటేగౌడ, జిడినెల్లూరులో జిడినెల్లూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కృపాలక్ష్మీ, నగరిలో మాజీ మంత్రి ఆర్‌కె రోజా, యాదమరిలో పూతలపట్టు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు జరిగాయి. రిలే దీక్షల్లో పాల్గొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ డిఎస్సీ అవకతవకలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని, డిఎస్సీ అక్రమాలపై సత్వరం నిష్పక్షపాతంగా సిబిఐతో విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయవాడలో 23న సృజనోత్సవం, సాహిత్య సాంస్కృతిక సందడి

విజయవాడ, ఆగస్టు 7 ప్రభాతవార్త ప్రతినిధి: సాహిత్య సాంస్కృతిక సారధులను ప్రోత్సహిస్తూ, భాష సంస్కృతులను మరింత మెరుగు పరిచే దిశగా మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆగస్టు 23న ఆదివారం విజయవాడలో జరపబోతున్న సృజనోత్సవం సాహిత్య సాంస్కృతిక సందడి కార్యక్రమం విజయవంతం కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ ్మశ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమ కరపత్రాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వాహకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం డా. జి.లక్ష్మీ ్మశ మాట్లాడుతూ కవుల్ని, కళాకారుల్ని ప్రోత్సహించే సృజనోత్సవం వంటి సాహిత్య, సాంస్కృతిక సందళ్ళు సమాజాన్ని జాగృతం చేయడంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. వాడుక భాష పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని ముందుగానే జరపతల పెట్టడం అభినందనీయమన్నారు. సాహిత్య సాంస్కృతిక వికాసం కోసం, భాషాభివృద్ధి కోసం చేసే ఇలాంటి కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం నుండి సహకారం అందిస్తామని అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు



సాహిత్య సాంస్కృతిక సందడి కరపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

కలిమిశ్రీ మాట్లాడుతూ భాష, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకోసం జరపబోతున్న ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు వుంటాయన్నారు. కవి సమ్మేళనం కోసం 83329 03156 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

8skl13:8skl13.qxd 07-08-2026 23:25 Page 1

రాజాం మున్సిపాలిటీకి వాటర్ ట్యాంకులు అందజేత

రాజాం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

రాజాం పురపాలక సంఘం పరిధిలో జి.యం.ఆర్. వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజాం మున్సిపాలిటీకి 16 లక్షలు విలువ చేసే రెండు ట్రాక్టర్లు మరియు నీళ్ల ట్యాంకర్లను అందజేయడం జరిగింది. మున్సిపల్ కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు అభ్యర్థన మేరకు జియంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సౌకర్యం లేని ప్రజల దాహార్తి తీర్చడం కోసం రెండు ట్రాక్టర్లు మరియు 5000 లీటర్లు కెపాసిటీ కలిగిన రెండు నీళ్ల ట్యాంకర్లను బహూకరించారు. జిఎంఆర్ ప్రతినిధి ఆర్.అన్నంనాయుడు చేతుల మీదుగా ఈ ట్రాక్టర్లు మరియు ట్యాంకర్లు బహుకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజాం మునిసిపాలిటీ ఏఈ వెంకట్ రామరాజు, జియంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు సాయి కిషోర్, శివ మోహన్ మరియు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి రైల్వే సమస్యలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

న్యూఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును మర్యాద పూర్వకంగా జెడఅర్ యుసిసి సభ్యులు శ్రీనివాస్ రౌలో తదితరులు కలిశారు. ఇచ్ఛాపురం, జాడుపూడి, సోంపేట, బారువ, మందస రైల్వేస్టేషన్‌లో హాల్ట్‌లు, ప్రయాణీకులు సదుపాయాలు కోసం వివరించారు. ఇచ్ఛాపురం నార్త్ కేబిన్ వద్ద, గొల్ల కంచిలి, అంపురం, కంచమ్మగుడి వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల అవసరంపై చర్చించారు. రైల్వే అధికారులతో చర్చించి పరిష్కారం చేయమని కోరారు. అలాగే జాడుపూడి జాతీయ రహదారిపై వద్ద ఓవర్ బ్రిడ్జ్ మీద అండర్ పాస్ మీద లైటింగ్ సదుపాయాలు గూర్చి వివరించారు. ప్రమాదాలు జరుగుతున్నాయని నేషనల్ హైవే పీడీతో మాట్లాడి లైట్‌లు మంజూరు చేయించారని చెప్పారు. ఈ సందర్భంగా ఈ పనులు సిఫార్సు చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కి సమస్యలు పరిష్కరించిన కింజరాపు రామ్మోహన్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. పర్యటనలో ఏ ఎం సి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పి.సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విత్తన బంతులతో అటవీ ప్రాంతం అభివృద్ధి

కంచిలి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

విత్తన బంతులతో అడవి ప్రాంతమంతా విస్తారంగా దట్టంగా అభివృద్ధి చేయొచ్చని అటవి శాఖ మందస డివిజన్ ఉప పరిధి అధికారి టి.దేవరాజ్ అన్నారు. శుక్రవారం కంచిలి మండలం భోగాబేని అడవి ప్రాంతంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, అటవీ శాతం పెంచేందుకు పలాస రేంజ్ అధికారి పి.అమ్మన్నాయుడు సూచనల మేరకు వన సంరక్షణ సిబ్బంది విద్యార్థులచే పేడ 70%, మట్టి 30%తో కానుగ, వేప, చింత, మది, రావి, మామిడి, కరక మొదలగు రోక్ష విత్తనాలను సేకరించివాటిని బంతులుగా తయారు చేసి జిల్లాలో 6,38,100 బంతులను అడవిలో డ్రోన్లు విద్యార్థులతో చల్లించారు. బొగాబెణి ప్రాంతంలో 1.68,100 బంతులను చల్లించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు భానుమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

తెంబూరు రోడ్డుకు ఇరువైపులా ట్రీగార్డులతో మొక్కులు

టెక్కలి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

టెక్కలి గ్రామపంచాయతీ పరిధిలో రైల్వే గేట్ నుంచి వలియాసాగరం ఫ్లైఓవర్ వరకు ఉన్న తెంబూరు రోడ్డుకి ఇరువైపులా నారాయణ ఐ హాస్పిటల్ వారి సహాయంతో 50 మొక్కలను ట్రీ గార్డులతో సహా నాటడం జరిగింది. ఇది డాక్టర్ సుధీర్ కుమార్ మొదలవలస మరియు బి.ఎన్.కె ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బొడ్డేపల్లి పాపారావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో టెక్కలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఎం.రేణుక, డిప్యూటీ ఎంపీడీవో కె.సింహాద్రి, మండల ఇంజనీరింగ్ అధికారి కె.లక్ష్మునాయుడు, వి.బి.జి-రాంజీ ఏపీవో బగాది ప్రసాద్, స్థానిక నాయకులు కోళ్ల లవకుమార్, ప్రఫుల్ల కుమార్ పోరిడా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాపాయస్థితిలో చిన్నారిని ఆదుకోవాలి

కవిటి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

పాము కాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో చిన్నారి కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతూ దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి చోటుచేసుకుంది. మడియారిపుట్టుగ గ్రామానికి చెందిన డి.రాజు, హారతిల కుమార్తె చిన్నారి చిన్ని ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ చిన్నారి చికిత్సకు ఆ కుటుం బానికి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో దాతల సహాయం కోసం ఆ కుటుంబం ఎదురు చూస్తున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కనుక దయ గల దాతలు ఫోన్ పే నెంబర్ నర్తు శేషగిరి 7207119285కు సహకారం అందించగలరని తండ్రి రాజు కోరుకుంటున్నారు.

పాఠశాలల్లో విద్యా, వసతి ప్రమాణాలు మెరుగుపడాలి

సీతంపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త :

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యా, వసతి ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పవర్ స్వప్నిల్ జగన్నాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఐటిడిఏ కార్యాలయంలో ఆశ్రమ పాఠశాలలు గురుకులాలు ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ డిప్యూటీ వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఐవీఆరఎస్ కాల్స్ ద్వారా పాఠశాలల్లోని విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలు, భోజన నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై నేరుగా అభిప్రాయాలు సేకరిస్తోందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా పాఠశాలల పనితీరును మరింత సమర్థవంతంగా అంచనా వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఐవీఆరఎస్ కాల్స్ ప్రాముఖ్యతపై పూర్తి అవగాహన కల్పించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే కాల్స్‌కు తప్పనిసరిగా స్పందించేలా చర్యలు తీసుకోవాలని హెచఎంలు, వార్డెన్లకు సూచించారు. ఈ సమావేశంలో డీడీ అన్నదొర, వెంకట గణేష్. ఏటిడబ్ల్యూఓలు, రాంబాబు మల్లికార్జున్. జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు, పాలక నారాయడు తదితరులు పాల్గొన్నారు. వారానికి ఒక్కరోజే ప్రజా గ్రీవెన్స్: ఐటీడీఏలు ప్రతి సోమవారం శుక్రవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ ఇకపై సోమవారం ఒక్కరోజే నిర్వహించడం జరుగుతుందని పిఓ తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ప్రజా గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని వీటిని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చేనేతలకు అండగా... కూటమి ప్రభుత్వం

అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి అప్పలకొండ

వీరఘట్టం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

నేతన్నల కుటుంబాలకు కూటమి ప్రభుత్వ అండగా నిలుస్తుందని, వారి కళ్ళల్లో ఆనందాన్ని చూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి రాగాల అప్పలకొండ అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నేతన్నల కుటుంబాలకు ఇప్పటికే ప్రభుత్వం అండగా ఉందని ఆమె చెబుతూ, ఇందులో భాగంగా వారికి ఉచిత విద్యుత్తు, వివిధ రాయితీలు వంటి ఎన్నో అవకాశాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. తాజాగా ప్రభుత్వం వారి బాగోగుల కోసం మరో ముందడుగు వేసిందన్నారు. 'నేతన్న సేవలో' పథకం కింద ప్రభుత్వం తాజాగా ఒక్కొక్క కుటుంబానికి 25 వేల రూపాయలను జమ చేయనుందన్నారు. 7వ తేదీన 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని దీనిని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ఎంతో సంతోషదాయకమని ఆమె అన్నారు.

రోడ్డుపై మట్టిని తొలగించారు



సంతబొమ్మాళి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

వార్త ప్రభావం

సంతబొమ్మాళి-కోటబొమ్మాళి ప్రధాన రహదారిలో దుర్గం పేట వద్ద ఉన్న రోడ్డుపై మట్టిని ఎట్టకేలకు తొలగించారు. ఈ సిమెంట్ రహదారి నిర్మాణం చేపట్టి దాదాపు రెండు నెలలు గడిచినా ఒక వైపు మట్టిని వదిలేయడంతో వన్ వేగా మారి వాహనాలు రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. దీనిపై వార్త దినపత్రికలో 'రోడ్డు వేశారు మట్టి తీయడం మరిచారు' అనే శీర్షికతో ప్రమాదకరంగా మారిన దుర్గంపేట రహదారి కథనం వెలువడింది. దీనిపై అధికారులు స్పందించి శుక్రవారం చదును చేసే ట్రాక్టర్ బ్లేడు సహకారంతో రోడ్డుపై మట్టిని తొలగించారు. అయితే ఈ రోడ్డుపై మట్టి వేసి దాదాపు రెండు నెలలు దాటిన నేపథ్యంలో రోడ్డుకు అంటుకున్న మట్టి పూర్తి స్థాయిలో రావడం లేదని తొలగిస్తున్న కూలీలే అంటున్నారు. దీంతో ఈ సిమెంట్ రోడ్డు మట్టి రోడ్డును తలపిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపించి గుత్తేదారునితో రోడ్డుపై ఉన్న మట్టిని పూర్తి స్థాయిలో తొలగించి రహదారిని రెండు వైపులా వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ఊరికి ఉపకారి... మాచర్ల మహేష్

సొంత నిధులతో సాగునీటి కాలువల జంగిల్ క్లియరెన్స్

వీరఘట్టం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

ఊరికి ఉపకారిగా ఉంటూ...అనునిత్యం ప్రజలకు అండగా...వారి బాగోగుల కోసం అహర్నిశలు పరితపిస్తూ... ఎల్లవేళలా మంచి పనులు చేయాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్న మహా నాయకుడు మండలంలోని విక్రమపురం గ్రామానికి చెందిన బిజెపి నాయకులు, మాజీ సర్పంచ్ మాచర్ల మహేష్. ఈయన ఎక్కడ ఉన్నా, గ్రామ ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన పనులను సకాలంలో చక్కబెట్టి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు మహేష్. గ్రామ అభివృద్ధి కోసం ఎన్నో మంచి మంచి కార్యక్రమాలు చేసిన ఆయన తమ గ్రామానికి సాగునీరు అందక, ఉబాలకు ఆటంకంగా మారడంతో తాజాగా శుక్రవారం రైతులకు అండగా నిలబడి మహేష్ సూచనలతో ఆయన సోదరుడు మాజీ సర్పంచ్ మాచర్ల వెంకటరమణ నేతృత్వంలో రైతులతో కలిసి తన స్వంత నిధులతో జెసిబిని ఏర్పాటు చేసి పిల్ల కాలువల్లో ఉన్న జంగిల్‌ను క్లియరెన్స్ చేయించి సాగునీరు వచ్చే విధంగా, రైతులు ఆనందపడేలా చేశారు మహేష్. ఎవరో వస్తారు... ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా నేనున్నానంటూ ముందుకు వచ్చి రైతులకు అండగా నిలబడిన మహేష్‌ను గ్రామ ప్రజలు కొనియాడుతూ జేజేలు పలుకుతున్నారు. సాగునీరు అందకపోతే తమ పరిస్థితి ఏంటి అంటూ రైతులు వారికి వారే ప్రశ్నించుకుంటున్న తరుణంలో దేవుడిలా వచ్చి సాగునీటి సమస్యకు పరిష్కారం చూపించిన మహేష్ కు తామంతా జీవితాంతం రుణపడి ఉంటామని రైతన్నలు చెబుతూ, ఆయనకు ఎల్లవేళలా అండగా ఉంటామని, గ్రామానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న ఆయనే మా తిరుగులేని నాయకుడు అంటూ కొండంత విశ్వాసంతో కొనియాడుతున్నారు గ్రామ ప్రజలు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహూకరణ

సంతబొమ్మాళి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

మండలంలోని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పంగ తిరుపతిరావు, పూర్వపు టెన్త్ విద్యార్థులు చక్క సమగ్న, వాడ్రేవు తరణికుమారి, నిమ్మగడ్డ రోజాలు పాఠశాలకు సౌండ్ సిస్టమ్‌ను బహుకరించారు. సుమారు 23వేల రూపాయలు విలువ కలిగిన ఈ సౌండ్ సిస్టమ్‌ను పాఠశాల విద్యార్థుల నడుమ ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్నకు అందజేసారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలకు చాలా అవసరమైన సౌండ్ సిస్టమును బహుకరించటము చాలా సంతోషంగా ఉందని, దీనిని ప్రతీరోజూ ప్రార్థనా సమయములో ఉపయోగిస్తామని, పాఠశాలకు ఇటువంటి వనరులు సమకూర్చటం మిగతా వారికి స్ఫూర్తినిస్తుందని గ్రామస్తులు తల్లిదండ్రులు వివిధ రకాలుగా సహకరిస్తున్నారని, ఇదేవిధంగా మీరందరూ సహకరిస్తే పాఠశాలను మీరు, మేము కలిసి పాఠశాల ను ప్రగతిపథంలో నడపడానికి మరింత వీలవుతుందని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, అన్నాజీరావు, శారదాంబ, మురళీధర రాజు, రాము, సూర్య ప్రకాష్, పి.శ్రీధర్, విజయలక్ష్మి, రోషిని, మల్లేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, దయాసాగర్, కె.శ్రీధర్, మార్కండేయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, తూట.భాస్కరరావు పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఎల్‌నినో నివారణ, కార్యచరణ ప్రణాళికపై అవగాహన

మెళియాపుట్టి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

మెలియాపుట్టి మండలంలో రైతు సేవా కేంద్ర పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వెంకటాపురం రైతు సేవ కేంద్రం పరిధిలో పాతపట్నం ఎమ్మెల్యే మావిడి గోవిందరావు పాల్గొని రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ముఖ్యంగా ప్రస్తుతం ఏల్‌నినో ప్రభావం ఉన్నందువలన వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు కార్యక్రమంలో రైతులు పండిస్తున్న పంట పొలాలను సందర్శించి పంట స్థితిగతులను ఆన్లైన్ ద్వారా సబ్మిట్ చేయడం జరుగుతుంది. దీనికి కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుంది. రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఎప్పటికప్పుడు అందించాలని పాతపట్నం శాసనసభ్యులు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసిల్దార్ పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా వ్యవసాయ అధికారి ఎస్.దానకర్ణుడు, వ్యవసాయ సహాయకులు క్రాంతి, లోకేష్, షణ్ముఖ, పిఏసిఎస్ అధ్యక్షులు సలన మోహన్‌రావు, మండల టిడిపి నాయకులు నంబాల వెంకటరావు, ఏఎంసి చైర్మన్ ప్రతినిధి దినకర్, కూటమి నాయకులు భాస్కర్ గౌడ్ శేఖర్, ఎండయ్య, లక్ష్మీనారాయణ పలువురు రైతులు పాల్గొన్నారు.

రెండేళ్ల కూటమి పాలనలో సమగ్ర రాష్ట్రాభివృద్ధి : కూన

ఆమదాలవలస, ఆగస్టు 7, ప్రభాతవార్త :

గత వైసిపి ప్రభుత్వం కారణంగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంతో గాడిలో పెట్టి రెండేళ్ల కూటమి పాలనలో సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని రాష్ట్ర పీయూసీ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అవివేక పూరిత నిర్ణయాలు ఆర్థిక క్రమశిక్షణ లోపం కారణంగా రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొందని ఆయన విమర్శించారు. ప్రజలు ఆ పరిస్థితిని గుర్తించి కూటమి ప్రభుత్వానికి స్పష్టమైన ప్రజా తీర్పు ఇచ్చారని ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1.49 లక్షల కోట్లు అభివృద్ధి పనులకు రూ.1.34 లక్షల కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. రుణాల రీషెడ్యూలింగ్‌కు రూ.8,269 కోట్లు ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు రూ.30,849 కోట్లు గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బిల్లుల చెల్లింపునకు రూ.1,937 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక పరిపాలనా సమస్యల నుంచి బయటపడుతూ పునర్నిర్మాణం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అప్పుల రాష్ట్రాన్ని అవకాశాల రాష్ట్రంగా మార్చే దిశగా టిడిపి, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రాభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

చేనేత వస్త్రాల బహుకరణ.. ప్రధాని ఆత్మీయ ఆతిథ్యం

రణస్థలం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తమ కుటుంబ సమేతంగా ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఆత్మీయ కలయికలో విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని చేనేత కార్మికులు తమ చేతులతో స్వయంగా నేసిన ప్రత్యేక చేనేత దుస్తులను ఎంపీ కుటుంబ సభ్యులు ప్రధానికి కానుకగా అందించారు. స్థానిక నేతన్నల నైపుణ్యాన్ని, శ్రమను ప్రతిబింబించేలా ఉన్న ఈ వస్త్రాలను ప్రధాని మోదీ ఎంతో సంతోషంగా స్వీకరించారు. అనంతరం కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబాన్ని సాదరంగా ఆహ్వానించిన ప్రధాని, వారితో ముచ్చటించి ఆత్మీయ ఆతిథ్యాన్ని అందించారు. చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తూ స్థానిక కార్మికులు తయారుచేసిన దుస్తులను ప్రధానికి బహుకరించడం పట్ల స్థానిక నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సోమన్నపేటలో తల్లిపాల వారోత్సవాలు

సంతకవిటి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

మండలంలో సోమన్నపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు అంగన్వాడీ కార్యకర్త సత్యవతి ఐమా ఆశా కార్యకర్త భవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి తన శిశువుకు తొలి ఆరు నెలలపాటు తల్లిపాలు అందించాలని, తల్లిపాలు శిశువుకు జీవనాధారం అంటూ, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించినట్లు తెలియజేశారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది ఆశ కార్యకర్త , గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

శాస్త్రీయ సేద్యంతోనే పంటల రక్షణ

కొత్తూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :

మారుతున్న వాతావరణ పరిస్థితులు, సూపర్ ఎల్‌నినో సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు రైతులు శాస్త్రీయ సాగు విధానాలను పాటించాలని లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు సూచించారు. కర్లెమ్మ పంచాయతీలో నిర్వహించిన 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తక్కువ నీటితో పండే చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వాలని, సూక్ష్మ సేద్య పద్ధతుల ద్వారా నీటిని పొదుపు చేయాలని కోరారు. కూటమి నాయకులు లోతుగడ్డ భగవాన్ నాయుడు, బోర శ్రీరాములు, పడాల వెంకట క్రిష్ణ, ఎద్దు శ్రీనివాసరావు, వాసు, రాజారావు, శమ్మాన ఉదయ్ కుమార్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

పీహెచ్‌సీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

బూర్జ, ఆగస్టు 7, ప్రభాతవార్త :

బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి ఎసఈ పి.సత్యనారాయణ కాంట్రాక్టు సూరిబాబుకి ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన బూర్జలో చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. మనలో నాణ్యత పాటిస్తూ మరో రెండు నెలల్లో పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు డీఈ గణపతి రావు, జెఈ ఆంజనేయ నాయక్ , తదితరులు పాల్గొన్నారు.

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలి

సీతంపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త :

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న జరపాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డక తేజేశ్వరరావు, న్యాయ సలహాదారులు ఏ.మన్మధరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సీతంపేట కేంద్రంగా 11న ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించడానికి ఐటిడిఏ అధికారులు నిర్ణయం తీసుకున్నారని దీనిని తాము వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి ఏడాది జరిగే విధంగా ఆగస్టు 9న ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.కాంతారావు, రాష్ట్ర సభ్యులు నిమ్మక కాంతారావు , తదితరులు పాల్గొన్నారు.

కూన రవికుమార్ చొరవతో రొట్టవలస రైతులకు ఊరట

సరుబుజ్జిలి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

మండలంలో గల రొట్టవలస గ్రామ రైతులు తాత ముత్తాతల నుండి సాగులో ఉన్న భూములు పట్టాదారు పాసుపుస్తకాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే, పి.యు.సి చైర్మన్ కూన రవికుమార్ చొరవతో సరుబుజ్జిలి మండల రెవెన్యూ సర్వే టీం ద్వారా సర్వే చేయడం జరుగుతుంది. అనంతరం ఆన్లైన్ చేసి పాస్ పుస్తకాలు అందజేయుటకు ఎమ్మెల్యే సుముఖత వ్యక్తం చేస్తుండడంతో రైతులు ఆనందంతో సర్వే వాళ్లకు సహకరిస్తున్నారు. రొట్టవలస గ్రామ మాజీ ఎంపీటీసీ తాడేల వెంకటరమణ, సర్పంచ్ ప్రతినిధి మూడడ్ల రమణ, గ్రామ పెద్దలు, రైతులు, తొత్తడి వైకుంఠరావు, రాజారావు, తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు, తవిటి నాయుడు, రాజారావు. సురవరపు రమణ, బెవర రాజారావు, అమ్మి నాయుడు, కొమ్ము మురళి, సింహాచలం, రైతులు పాల్గొని మూడవరోజు సర్వే కొనసాగించారు.

నిధులు దుర్వినియోగంపై మాజీ సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు

కోటబొమ్మాళి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

కోటబొమ్మాళి మేజరు పంచాయతీలో 2021-22 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాలు వరకు పంచాయతీ జనరల్ ఫండ్ 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, పీఎఫ్ఎంఎస్ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదక మేరకు మాజీ సర్పంచ్ కాళ్ల సంజీవరావుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీస్ శుక్రవారం అందిందని ఎంపీడీవో కె.నారాయణరావు తెలిపారు. మొత్తం రూ.2,09,70,143లు నిధులు వినియోగించినట్లు నమోదు కాగా అందులో రూ.1,95,03,258లు వివిధ పంచాయతీ నిధులు ఉపసంహరించబడినట్లు గుర్తింపు జరిగిందని, ఇందులో రూ.12,37,055 నేరుగా సర్పంచ్ కాళ్ల సంజీవరావు బ్యాంకు ఖాతాకు బదిలీ చేయబడిందని, రూ.21,21,555 బిల్లులు, ఓచర్లు, ఇన్వాయిస్‌లు సమర్పించకుండా ఖర్చు చేసినట్లు గుర్తించారు. అలాగే పంచాయతీ నిధులను సరఫరాదారులకు చెల్లించాల్సిన చోట సర్పంచ్ ఖాతాకు బదిలీ చేయడం జీవో ఎంఎస్. నెం 432 నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఫీల్డ్ తనిఖీలో పనులు జరిగినట్టు కనిపించినప్పటికీ, వాటికి సంబందించిన ఖర్చుల రికార్డులు లేవని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. రూ.21,21,555కు సంబందించిన ఖర్చులకు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఈ మొత్తాన్ని దుర్వినియోగంగా పరిగణించారు. సర్పంచ్, ఆయన భార్యకు నిధులు బదిలీ చేయడంతో పాటు సరైన రికార్డులు లేకుండా చెల్లింపులు అమోదించబడినందున సర్పంచ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. ఈ మేరకు 10 రోజులోపు దీనిపై వివరణ ఇవ్వాలని లేకుంటే దుర్వినియోగమైన మొత్తాన్ని మీ నుంచి వసూలు చేయడం, మీపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నారు.

వాహన చోదకులకు 'అభయం', 'సంకల్పం" అవగాహన సదస్సు

సరుబుజ్జిలి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

మండల కేంద్రంలో గల నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జగ్గారావు మరియు కానిస్టేబుల్ ప్రభాకర్ 'అభయం' అనే అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రోడ్డు ప్రయాణంలో ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ని తప్పకుండా దరించాలన్నారు. హెల్మెంట్ మీకు మాత్రమే కాదు మీ కుటుంబానికి రక్షణ నిస్తోంది అని తెలియజేశారు. కొందరు వాహన చోదకులు ఫ్యాషన్‌గా హెల్మెట్‌ను ధరించకుండా పక్కన పెట్టుకొని డ్రైవ్ చేయడం అది మీ కుటుంబానికి రక్షణ కాదని తెలియజేశారు. అలాగే 'సంకల్పం' కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రయాణంలో మత్తు పదార్థాలు సేవించి ప్రయాణించడం ప్రయాణికులకు చాలా ప్రమాదకరమని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో వాహన చోదకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఆమదాలవలస, ఆగస్టు 7, ప్రభాతవార్త :

డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ చేపట్టాలని కోరుతూ ఆమదాలవలస వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో భాగంగా రెండవ రోజు శుక్రవారం బూర్జ మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అక్రమాలపై వెంటనే సీబీఐ విచారణ జరిపించి, మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బూర్జ మండల వైసీపీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, జడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, వావిలపల్లి మురళి, కృష్ణ, బొడ్డేపల్లి వెంకటసత్యం, మామిడి కిరణ్ కుమార్, జల్లు బలరాం, ఎం.వెంకట వాసుదేవరావు, వెంకటరమణ, రాంబాబు, ఇప్పిలి రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ పరిశీలకులు కరిమి రాజేశ్వరరావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, దుంపల శ్యామల రావు, పొడుగు శ్రీనివాసరావు, పి.రాజు, గురుగుబెల్లి పెంటయ్య, ముచుపల్లి నర్సింహమూర్తి సంఘీభావం తెలిపారు.

కూటమి పాలనలోనే సంక్షేమం సాధ్యం

లావేరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :

కూటమి పాలనలోనే సంక్షేమం సాధ్యం ఆ పార్టీ విజయనగరం జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు వడ్డీపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని బెజ్జిపురంలో నిర్వహించిన ఇంటింటా ప్రచారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని ఇప్పటికే ప్రకటించిన పథకాలన్నీ అమలు చేసిందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బెజ్జిపురం పంచాయతీ పార్టీ అధ్యక్షుడు ఇజ్జాడ సన్యాసినాయుడు, మాజీ జెడ్పీటీసీ పిన్నింటి మధుబాబు, సీనియర్ నాయకులు ఇజ్జాడ అప్పారావు, ఇజ్జాడ విశ్వనాథం, పిన్నింటి భాష, పిన్నింటి నరసింహం, పిన్నింటి గౌరి, వడ్డిపల్లి సురేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

రాజాం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

రాజాం పట్టణం మల్లికార్జున్ కాలనీకి చెందిన సాయి నరేష్ అనే యువకుడు ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందాడు. మృతుడు బజాజ్ ఫైనాన్స్ కంపెనీ సంస్థలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా పొందూరు నుంచి రాజాం వస్తుండగా అంతకపల్లి దగ్గరలో రాజాం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ హారన్ మోగించకుండా అజాగ్రత్తగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందంటూ మృతుడు తల్లి ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

ఫ్యాషన్ ఫ్యాషన్

పరికిణీకి పూల ఓణీ

అప్పుడే కాలేజీలో అడుగుపెట్టిన అమ్మాయైనా.. ఇద్దరు పిల్లల తల్లయినా.. మనవళ్లు, మనవరాళ్లని చూసుకుని మురిసిపోయే బామ్మయినా.. మనసు పారేసుకునే దుస్తులేవంటే లంగాఓణీ పేరు చెప్పాల్సిందే! దాని అందమే వేరు. అందుకే తరాలెన్ని మారినా ఫ్యాషన్ ప్రపంచంలో రారాజిలా వెలుగుతోంది వస్త్ర శ్రేణి. అమ్మాయిలు లక్ష్మీదేవిలా నట్టింట తిరిగితే చక్కని ఆనందం. చటుక్కున కట్టేసుకోవాలన్నా.. బుట్టబొమ్మలా కనిపించాలన్నా లంగాఓణీ కాకుండా మరొకటి ఉంటుందా? అలాగని ఎప్పుడూ పట్టేనా? మరీ మెద్దగా కనిపించినా బాగోదు. కాబట్టి కొత్తగా కోరుకునేవారు మనసు పారేసుకుంటోంది ఈ పూల ఓణీలపైనే! పరికిణీ పట్టుదైనా, కాటన్, రేయాన్, నెట్ వంటి ఆధునిక రకానిదైనా వీటిని జతచేసి మురిసిపోతున్నారు మెత్తని సిల్క్ ఓణీ.. దానిపై ఆకర్షించే కలంకారీ, పిచ్‌వాయీ, మధుబని.. వంటి ఎన్నో ఏళ్లనాటి కళలతోపాటు మోడరన్ ఆర్ట్‌ని అద్దుకున్న పూలు.. చూడచక్కగా లేవూ? పూల సుకుమారం ఉన్న అమ్మాయిలు వాటినే చుట్టుకుని మరింత మెరవడం భయమనిపించట్లేదు? సందర్భమేదైనా చక్కగా ఇమిడిపోవాలి అనుకునే అమ్మాయిలకు ఈ మినిమల్ ఫ్యాషన్ మరింత నప్పడం ఖాయం. పైగా సందర్భాన్ని బట్టి.. దీన్నే లెహెంగా స్టైల్‌లోనూ వేసుకోవచ్చు.



రాచరిక పాలనలో పాలనా వాణిజ్యం యుద్ధ నైపుణ్యం తెలిసిన వారికి వారసత్వం దొరుకుతుంది. అందుకే రాజకుటుంబంలోని వారసులు తొలుత గురుకులాల్లో యుద్ధ విద్యనభ్యసించడం తెలిసిందే రాజులు మారినా రాజ్యాలు పోయినా మిగిలివున్న రాజకుటుంబాలు సైతం వంశ పారంపర్య విధానాలను ఇంకా కొన సాగిస్తూనే ఉన్నాయి.

ఈ తెగువరి ఓ రాకుమారి

డెన్మార్క్ రాజ కుటుంబంలో ఒక సరికొత్త చారిత్రక అధ్యాయం మొదలైంది. ఆ దేశ రాజు ఫ్రెడరిక్ ఎక్స్, రాణి మేరీల కుమార్తె, 19 ఏళ్ల ప్రిన్సెస్ ఇసాబెల్లా సైన్యంలో చేరారు. పూర్తిస్థాయి సైనిక సేవల్లోకి అడుగుపెట్టిన తొలి మహిళా రాజవంశీకురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. డెన్మార్క్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 11 నెలల తప్పనిసరి సైనిక శిక్షణలో భాగంగా ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. హైస్కూల్ విద్య పూర్తికాగానే, స్లాగెల్సే లోని హోల్స్టెబ్రో బ్యారక్స్‌లో ఉన్న 'గార్డ్ హుస్సార్ రెజిమెంట్‌'లో ఆమె రిపోర్ట్ చేశారు. ఎలాంటి ప్రత్యేక హంగులు లేకుండా ఆమె సాధారణ సైనికురాలిగా విధుల్లో చేరడం విశేషం. అయితే శిక్షణ సమయంలో సాధారణ సైనికులకు ఇచ్చే జీతభత్యాలను తీసుకోకూడదని ప్రిన్సెస్ ఇసాబెల్లా నిర్ణయించుకున్నారు. తన తల్లిదండ్రుల ఆర్థిక అండతోనే ఉంటానని, ప్రభుత్వ వేతనం తనకు వద్దని స్పష్టం చేసిందామె! ఆమె సోద రుడు, యువరాజు క్రిస్టియన్ కూడా గతంలో ఇదే రెజిమెంట్‌లో శిక్షణ పూర్తి చేసుకు న్నారు. యూరప్, ఆర్కిటిక్ ప్రాంతాల్లో మారుతున్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో డెన్మార్క్ తన రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేస్తోంది. ఇందులో భాగంగానే సైనిక సేవా కాలాన్ని 4 నెలల నుంచి 11 నెలలకు పెంచింది. అంతేకాకుండా, తొలిసారిగా మహిళలకు కూడా తప్పని సరి సైనిక సేవను వర్తింపజేసింది. ఈ కొత్త సంస్కరణల కింద శిక్షణ పొందుతున్న తొలి బ్యాచ్‌లోనే ప్రిన్సెస్ ఇసాబెల్లా చేరడం విశేషం.

చిట్కా

చింత జరానామ్ మనుష్యానామ్: చింతించడం అనేది వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. కనుక అనవసరపు చింతలతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి.

సతం విహాయ భోక్తవ్యం: ఆహారం తీసు కొనే సమయం వచ్చినప్పుడు, ఎంతటి పనినైనా కూడా పక్కన పెట్టండి. నిదానంగా భోజనం చేయం డి. వేగంగా తినడం, పని ఉందని అసలు భోజనమే మానివేయడం చాలా అనర్థదాయకం.

విష్ణు స్వరూపమైన వేంకటేశ్వరస్వామి కలియుగ దైవంగా భక్తుల పూజలు అందుకుంటున్నాడు. ఆ స్వామిని పూజించడం వలన కష్టాల నుంచి గట్టెక్కడం జరుగుతుంది. కష్టాలను తీర్చువాడే వేంకటేశ్వరుడు అని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. వేంకటేశ్వర స్వామి దర్శన మాత్రం చేతనే పాపాలు

వేంకటేశ్వరస్వామి పూజ

పటాపంచలైపోతాయి .. దోషాలు తొలగిపోతాయి. అలాంటి ఆ స్వామిని ఆరాధించడం వలన లక్ష్మీదేవి ప్రీతి చెందుతుంది. వేంకటేశ్వరస్వామి హృదయ స్థానంలో లక్ష్మీ దేవి కొలువై ఉంటుంది. కనుక వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్న ప్రతి వారికి లక్ష్మీదేవి దర్శన భాగ్యం కూడా లభిస్తుంది. ఆ తల్లి కరుణా కటాక్ష వీక్షణాలు కూడా భక్తులపై ప్రసరించబడ తాయి. ఇక తనని పూజించడం వలన సంతోషించే అమ్మవారు, స్వామివారిని పూజించేవారి పట్ల మరింత కరుణ చూపుతుందట. స్వామిని అంకితభావంతో సేవించేవారి ఇంట లేమి అనేది లేకుండా చూస్తుందట. అలాంటివారి దరిదాపులకు దారిద్రం .. దుఃఖం రాకుండా చేస్తుందనేది మహర్షుల మాట. అమ్మవారి ప్రాణనాథు డైన స్వామివారిని పూజించడం వలన, ఆ తల్లి అనుగ్రహం కూడా లభిస్తుంది.

కొల్లార్డ్ గ్రీన్స్

నూతన సంవత్సర రోజున కొల్లార్డ్ గ్రీన్స్ తినడం వల్ల ఏడాది పొడవునా ఆర్థిక శ్రేయస్సు లభిస్తుందనే నమ్మకం ఉంది. అనేక దేశాల్లో కొల్లార్డ్ గ్రీన్స్ సంప్రదాయ ఆహార వంటకం. దక్షిణ యుఎస్‌లో ప్రజల ఆరోగ్యకరమైన ప్రధాన ఆహారాలలో ఇది ఒకటి. ముఖ్యంగా సెప్టెంబర్–ఫిబ్రవరి నెలలో మొక్క పిండి పదార్థాల్ని చక్కెరలుగా మార్చడం, కొన్ని ప్రోటీన్‌ల్ని పునరుద్ధరించడం ద్వారా చలికి ప్రతిస్పందించడం వల్ల ఆకులు రుచికరంగా ఉంటాయి. క్యాబేజీలో లాగా ఆకులు టైట్ హెడ్స్ కాకుండా లూజ్ లీఫ్‌గా ఉంటాయి. ఈ ఆకులు మందంగా, మృదు వుగా, పెద్దగా 10–12 అంగుళాల పొడవుతో లేతరంగు సిరలతో విశాలమైన కాండాలతో ఉండి కొద్దిగా ముడతలు పడి ఆకులు 1.25 మీటర్ల ఎత్తులో వెడల్పుగా ఉండా కనిష్ట కాండం మీద రొసెట్టేగా ఏర్పడి చూడడానికి కాలే లాగా ఉంటుంది. కొల్గార్డ్ గ్రీన్స్ హెడ్ క్యాబేజిలాగా ఒక గుత్తిలా కాకుండా, వదులు గా ఆకులతో పెరుగు తాయి. వీటిని సలాడ్స్, స్లావ్‌లు, స్మూతీ లు, సూప్‌లు, ఆమ్లెట్‌లో, శాండ్‌విచ్‌లు చుట్టలలో చుట్టి తాజాగా తినడం సులభం. వీటిని సలాడ్స్, స్లావ్‌లు, స్మూతీలు, సూప్‌లు, ఆమ్లెట్‌లో శాండ్‌విచ్‌లు చుట్టలలో చుట్టి తాజగా తినడం సులభం. పచ్చి కొల్లార్డ్ ఆకుకూరలు ఘాటైన, ఉప్పగా ఉండే రుచిని కల్గి ఉంటాయి. వీటిని వండినప్పుడు లేదా ఆవిరి మీద ఉడికించి నప్పుడు తేలికపాటి రుచిన కలిగి మట్టి రుచిని కల్గి ఉంటాయి.

ఆరోగ్య ప్రయోజనాలు: కొల్లార్డ్ ఆకుకూరలో కాల్షియం విటమిన్ 'కె' ఎక్కుగా ఉండడం వల్ల దంతాల ఎముకల ఆరోగ్యానికి ఉపయోగ పడుతుంది. దీని వల్ల కాల్షియం శోషణ జరిగి ఆస్టియోఫోరోసిస్ రాకుండా కీళ్ళ ఆరోగ్యానికి మంచి చేస్తుంది. ఈ ఆకుకూరలోని విటమిన్‌లు, ల్యూటిన్ జియాక్సంతిన్ అనే కెరోటినాయిడ్స్ రేచీకటి, కంటి శుక్లాలు డయాబెటిక్ రెటినోపతి, గ్లకోమా వంటి

కంటి వ్యాధులు 57% తగ్గుతాయని ఒక అధ్యయనంలో తెలిసింది. ఈ క్రూసి ఫెరస్ ఆకుకూరల్ని తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడం వల్ల రక్త ప్రసరణ మెరుగై 16% గుండె జబ్బులు, స్ట్రోక్ వ్యాధుల్ని అరికట్టివచ్చు. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఫైబర్ ఆరోగ్యకరమైన గట్ బాక్టీరియాని పెంచి జీర్ణకోశ ఆరోగ్యాన్ని పెంపొదించడం వల్ల హెలికో బాక్టీరియా వంటి జీర్ణకోశ ఇన్ఫెక్షన్స్‌ని అరికట్టవచ్చు. వీటిలోని అధిక ఐరన్ ఎర్రరక్త కణాల్ని ఉత్పత్తి చేసి రక్తహీనతని నివారిస్తుంది. అధిక ఫోలేట్స్ వల్ల గర్భధారణ సమ యంలో పుట్టుకతో వచ్చే లోపాల నివారణలో సహాయపడుతుంది. కొల్లార్డ్ గ్రీన్స్‌లోని గ్లూకోసినోలేట్స్, సల్ఫర్ సమ్మేళనాలు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ని తగ్గించి పాంక్రియాటిక్, అన్నవాహిక కేన్సర్, రొమ్ము, లంగ్, పెద్దప్రేగు కేన్సర్ల్ని నివారించి దెబ్బతినకుండా కేన్సర్ కణాల వ్యాప్తిని నిరోధించగలవు. వీటిలోని విటమిన్ కె, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు శరీరంలోని మంటల్ని, వాపుల్ని తగ్గిస్తాయి. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడు తుంది. కాబట్టి ఎక్కువ సేపు కండుపు నిండినట్లుండి అతిగా తినలేదు. దీనివల్ల బరువు తగ్గుతాయి. డయాబెటిక్స్‌లో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. దీనిలోని కొలిన్స్ శరీరంలోని క్రొవ్వుని గ్రహించి శరీరంలో హోమోసిస్టీన్ ఎక్కువ ఏర్పడ కుండా చేస్తుంది. కొల్లార్డ్ గ్రీన్ ఊపిరితిత్తుల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలోని ఆంటీ, ఆక్సిడెంట్స్ మెనోపాజ్ సమస్యలకి స్త్రీల వ్యాధులకి, నరాల, కండరాల సంకోచాలకు ఉపయోగపడుతుంది. హార్మోన్ల, అసమతుల్యతని తగ్గించి నిద్రలేమి సమస్యల్ని దూరం చేస్తుంది. చర్మం, జుట్టు సమస్యల్ని నివారిస్తుంది. హార్మోన్ల అసమతుల్యతని తగ్గించి నిద్రలేమి సమస్యల్ని దూరం చేస్తుంది. వీటిలోని అధిక ఆక్సలేట్స్ జింక్, కాల్షియం, ఐరన్, ఖనిజాల శోషణకు ఉపయోగపడుతుంది. ఒక కప్పులో 10 మిగ్రా ఆక్సలేట్స్ ఉంటాయి. ఇవి ఎక్కువైతే వీటి శోషణ లోపం ఏర్పడి శారీరక వ్యాధులేర్పడతాయి. ఇది పిల్లల్లో ఆటిజం, హైపర్ ఆక్టివిటీని తగ్గించి ఏకాగ్రత, జ్ఞాపకశకి ని పెంచి మెదడు ఆరోగ్యాని కుపయోగపడుతుంది. వీటిలో విటమిన్ కె, రక్తం గడ్డకట్టడాన్ని ప్రోత్స హిస్తుంది. కొల్లార్డ్ గ్రీన్స్ జీవితకాలం 3–5 సంవత్సరాలుంటుంది.

డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

'డీసీ' వైల్డ్ గ్యాంగ్‌స్టర్ కథ : అరుణ్ మాథేశ్వరన్

డిసి కథ ఆలోచన ఎప్పుడు మొదలైంది?
నేను ఎప్పటినుంచో చెప్పాలనుకున్న కథ ఇది. ఒక పార్టీలో లోకేష్‌ని కలిశాను. ఈ ఆలోచన ఆయనకు చెప్పి, మనిద్దరం కలిసి చేస్తే బాగుంటుందని అన్నాను.

టైటిల్‌లో దేవదాస్, చంద్ర, పార్వతి కనిపిస్తున్నారు. కానీ ట్రైలర్‌లో పూర్తిగా గ్యాంగ్‌స్టర్ కథలా ఉంది.
దేవదాస్, చంద్ర, పార్వతి అనే మూడు పాత్రల కోర్ ఐడియా మాత్రమే దేవదాస్ నుంచి తీసుకున్నాం.

లోకేష్ కనగరాజ్ చాలా బిజీ డైరెక్టర్. ఆయనను హీరోగా ఎలా ఒప్పించారు?
లోకేష్ ఇండియాలోనే బిగ్గెస్ట్ డైరెక్టర్. నేను కథ చెప్పిన వెంటనే ఆయనకు బాగా నచ్చింది. అయితే అప్పటికి ఆయన కూలీ సినిమాతో బిజీగా ఉన్నారు.

ఒక దర్శకుడిని డైరెక్ట్ చేయడం ఎలా అనిపించింది? ఇది నాకు కొత్త కాదు. భారతీరాజా, సెల్వరాఘవన్‌ని డైరెక్ట్ చేశాను. అలాగే ధనుష్ గారు కూడా దర్శకుడే. దర్శకులతో పని చేయడం ఈజీగా ఉంటుంది.

డీసీ ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుంది?
ఇది హోప్ ఇచ్చే సినిమా. ఎలాంటి అంచనాలు పెట్టుకోకుండా థియేటర్‌కి వచ్చి సినిమా చూడాలని కోరుకుంటున్నాను. తప్పకుండా కొత్త అనుభూతిని ఇస్తుంది.

వామికా గబ్బి పాత్ర గురించి చెప్పండి?
ఈ సినిమాలో వామికా సెక్స్ వర్కర్ పాత్రలో కనిపిస్తుంది. దేవదాస్‌ను కలిసిన తర్వాత ఆమె జీవితం ఎలా మారుతుంది అనేదే ఆమె పాత్ర ప్రయాణం.

సన్ పిక్చర్స్ గురించి?
సన్ పిక్చర్స్ చాలా ప్రతిష్టాత్మకమైన సంస్థ. ఈ కథను కళానిధి మారన్‌కి చెప్పినప్పుడు ఆయనకు చాలా నచ్చింది.

'ది ప్యారడైజ్' టీజర్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని ప్రతిష్టాత్మక 'పాన్ వరల్డ్' చిత్రం 'ది ప్యారడైజ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రతి ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన స్పందన లభించింది. పోస్టర్, టైటిల్ గ్లింప్స్‌తో పాటు, చిత్రంలోని మొదటి పాట 'ఆయా షేర్' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓడెల ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో, ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఎంతగానో ఎదురుచూస్తున్న ప్యారడైజ్ టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. "ఇక నుంచి ఈ జాగా ఎవరిది... ఈ దేశం ఎవరిది?' అనే నాని పవర్‌ఫుల్ డైలాగ్‌తో ప్రారంభమైన టీజర్ మొదటి ఫ్రేమ్ నుంచే ప్రేక్షకులను 'ది ప్యారడైజ్' ప్రపంచం లోకి తీసుకెళ్తుంది. నాని తన కెరీర్‌లో ఎన్నడూ కనిపించని రగ్డ్, ఫెరోషియస్ అవతార్‌లో ప్రేక్షకులను సర్ ప్రైజ్. జడలతో కనిపించిన ఆయన లుక్, కళ్లలోని క్రూరత్వం, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ మటలో చూపించిన ఇంటెన్సిటీ... ఇవన్నీ కలిసి ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే పాత్రను సూచిస్తున్నాయి. చివర్లో "ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి..." అంటూ నాని చెప్పిన డైలాగ్ టీజర్‌కు పర్ఫెక్ట్ క్లైమాక్స్‌లా నిలిచింది. దర్శ కుడు శ్రీకాంత్ ఓడెల 'ది ప్యారడైజ్' ఎంత డీటైల్డ్ ప్రపంచాన్ని సృష్టించారో ఈ టీజర్ స్పష్టంగా తెలియజేస్తోంది.

తెర

1 బిలియన్ వ్యూస్ దాటిన 'రామాయణ' ట్రైలర్

రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా, నితేష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ: పార్ట్ 1' ట్రైలర్ ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. రామాయణ ట్రైలర్‌కు అరుదైన ఘనత సాధించింది. 1 బిలియన్ వ్యూస్ దాటిన తొలి భారతీయ సినిమా ట్రైలర్‌గా రికార్డ్ క్రియేట్ చేసింది. ట్రైలర్‌కు సినీ అభిమానులు, విమర్శ కులు, సెలబ్రిటీలు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తు తున్నాయి. సినిమా భారీ స్థాయి విజువల్స్, వరల్డ్ క్లాస్ జునీశ్రీ, భావోద్వేగభరితమైన కథనం, అద్భుత మైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా అనే థీమ్ ప్రేక్షకులను బలంగా ఆకట్టుకుంది. ట్రైలర్‌లో మరో ప్రధాన ఆకర్షణ స్టార్ కాస్టింగ్. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ శక్తివంతమైన నటనతో ఆకట్టుకోగా, రావణుడిగా యష్ తన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. సీతగా సాయి పల్లవి తన హుందాతనం, అమాయకత్వం, భావోద్వేగాలతో ప్రశంసలు అందుకుంటున్నారు. శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ లుక్ కూడా మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఈ స్టార్ కాస్టింగ్ ట్రైలర్‌కు మరో పెద్ద బలంగా మారింది. టెక్నికల్‌గా మాత్రమే కాదు... భారతీయుల అత్యంత పవిత్రమైన ఇతిహాసాన్ని ఎంతో నిజాయితీగా, గౌరవంతో, అత్యున్నత స్థాయిలో తెరకెక్కించారనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. భక్తి, భావోద్వేగం, విజువల్ గ్రాండియర్‌ను అద్భుతంగా మేళవించిన ఈ ట్రైలర్ అన్ని తరాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ పూర్తి సినిమాను థియేటర్లలో చూడాలనే ఆసక్తిని పెంచుతోంది. 1 బిలియన్ వ్యూస్ దాటిన తొలి భారతీయ సినిమా ట్రైలర్‌గా రికార్డ్ క్రియేట్ చేసిన రామాయణ సినిమాపై ఉన్న అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. నితేష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఎనిమిది ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న డీఎన్ఈజీ , యష్కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

వసూళ్ల రాణి జెండాయా!

2026లో హాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన నటిగా జెండాయా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. విడుదలైన ఆమె అన్ని చిత్రాలు కలిపి దాదాపు 2 బిలియన్ డాలర్లు వసూలు చేసిన ఆమె చిత్రాలు 'స్పైడర్ మ్యాన్','ది ఒడిస్సీ' చిత్రాల భారీ విజయం సాధించినట్లే ఈ ఘనభర్త టామ్ హాలాండ్‌తో కలిసి అత్యధిక వసూళ్లు సాధించిన జంటగా రికార్డు విడుదలకు సిద్ధమవుతున్న 'డ్యూన్: పార్ట్ 3'తో హవా కొనసాగే అవకాశం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది విడుదలైన తన చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 16,000 కోట్లు) వసూలు చేసి 'అత్యధిక వసూళ్లు సాధించిన నటి'గా అగ్రస్థానంలో నిలిచింది. డిస్నీ చానెల్ బాలనటి స్థాయి నుంచి ప్రపంచ స్థాయి స్టార్‌గా ఎదిగిన జెండాయా, ఇప్పుడు బాక్సాఫీస్‌ను శాసిస్తోంది. ఈ ఏడాది ఆమె కెరీర్‌ను శిఖరాగ్రానికి చేర్చిన రెండు చిత్రాలు 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే', క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన 'ది ఒడిస్సీ'. ఈ రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలలోనూ ఆమె తన భర్త, నటుడు టామ్ హాలాండ్‌తో కలిసి నటించడం విశేషం. 'స్పైడర్ మ్యాన్' తొలి వారాంతంలోనే 927 మిలియన్ డాలర్లు సాధించగా, 'ది ఒడిస్సీ' కేవలం మూడు వారాల్లో 911 మిలియన్ డాలర్ల మార్కును దాటింది. ఈ రెండు సినిమాల అసాధారణ విజయంతో జెండాయాటామ్ హాలాండ్ జంట ఈ ఏడాదికి 'హాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన ప్రముఖ దంపతులుగా నిలిచారు. వీరి చిత్రాల జోరుతో నార్త్ అమెరికా బాక్సాఫీస్ చరిత్రలోనే ఒక వీకెండ్‌లో అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. ఈ ఏడాది చివర్లో 'డ్యూన్: పార్ట్ 3' కూడా విడుదల కానుంది, బాక్సాఫీస్ వద్ద జెండాయా హవా మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచన.

ప్రేక్షకుల డబ్బులకు న్యాయం చేయాలనే లక్ష్యం: 'దందా' దొర సాయి తేజ

మీ సినీ జర్నీ గురించి చెప్పండి?..
ప్రభాస్'అడవి రాముడు' సినిమాలో హీరో చిన్నప్పటి చైల్డ్ కారెక్టర్‌కి డబ్బింగ్ చెప్పాను. 'కొత్తబంగారులోకం', హై స్కూల్ అనే సిరీస్‌లో నటించాను. 'అలా మొదలైంది' సినిమాలోనూ ఓ చిన్న పాత్రను పోషించాను.

ఇంత చిన్న వయసులోనే వ్యాపారస్థుడిగా, నటుడిగా, కంటెంట్ క్రియేటర్‌గా సాధించడం ఎలా అనిపిస్తుంది?..
నేను నిద్ర లేచిన క్షణం నుంచి ఒక కంటెంట్ క్రియేటర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా ఆలోచిస్తూనే ఉంటాను. నన్ను నేను కొత్తగా పరిచయం చేసుకోడానికి ఇదొక మార్గం.

సోషల్ మీడియాలో వచ్చే ప్రశంసలు, విమర్శల్ని ఎలా తీసుకుంటారు?..
సోషల్ మీడియాలో అన్నీ ఉంటాయి. ప్రతీ వీడియోకి కొన్ని కొత్త ప్రశంసలు, కొన్ని తిట్లు వస్తుంటాయి. ఈ కంటెంట్ క్రియేషన్ అనే దాన్ని నేను ఒక బ్రిడ్జ్‌లా వాడతాను.

అరవింద్ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. మిమ్మల్ని విమర్శించే వారు కూడా పొగిడేస్తున్నారు కదా?..
కంటెంట్ క్రియేషన్స్‌లో ఒకే రకమైన పాత్రను పోషించగలను. కానీ సిరీస్, సినిమా వరకు వచ్చే సరికి రకరకాల పాత్రలను పోషించే అవకాశం వస్తుంది.

దర్శకుడు ఆదిత్య దేవులపల్లి మీ గురించి ఎంతో గొప్పగా చెప్పారు?..
నాకు మానిటర్ చూసే అలవాటు ఉండదు. కెమెరామెన్‌ని చూస్తేనే విషయం తెలుస్తుంది. ఫస్ట్ టేక్‌లోనే సీన్‌ను పూర్తి చేయాలని అనుకుంటాను.

సోషల్ మీడియాలో మీకోసం నిలబడే మీ ఫ్యాన్స్ గురించి చెప్పండి?..
ఇదంతా ఒక్క రోజులో సంపాదించింది కాదు. నేను చేసిన కంటెంట్‌లో వాళ్లని వాళ్లు చూసు కున్నారు. అలా చూసుకుని కనెక్ట్ అయ్యారు.

.ఖాళీ టైంలో దొర సాయి తేజ ఎలా ఉంటాడు?..
నేను కూడా అందరిలో ఒకడినే. కాకపోతే నాకంటూ ఓ దారి క్రియేట్ చేసుకున్నాను. అది నా ఆర్థిక పరిస్థితుల వల్ల కావొచ్చు, చిన్నప్పటి నుంచి నాకున్న ప్యాషన్ వల్ల కావొచ్చు. ఇక ముందు నన్ను అందరూ కొత్తగా చూస్తారు.

'దందా' టీం గురించి చెప్పండి?..
ఆదిత్య గారు వంద శాతం సక్సెస్ అయ్యారు. పేపర్ మీద రాసుకున్నది అవుట్ పుట్‌గా తీసుకు రావడం అన్నది మామూలు విషయం కాదు. ఆ విషయంలో ఆదిత్య అన్నకు ప్రశంసలు వస్తున్నాయి.

ఫ్యూచర్ ప్లానింగ్ ఏంటి?..
ప్రతీ ఒక్క సాధారణ వ్యక్తి రిలేట్ అయ్యే కథల్ని థియేటర్‌లో చూపించాలని అనుకుంటున్నాను. జీరో టు హీరో అనే పాత్రలను పోషించాలని కోరుకుంటున్నాను.

'స్టువర్టుపురం స్టూడెంట్స్' ట్రైలర్ విడుదల..

బిగ్ బాస్ ఫేమ్ దివి యాక్షన్ అండ్ డాన్స్ హైలెట్ గా తెరకెక్కిన చిత్రం.. శివ సాయి ప్రొడక్షన్స్ పతాక పై డి. నిరీక్షణ సమర్పణలో, నిఖిల్, దివి ప్రధాన పాత్రలో డి. రామకృష్ణ దర్శకత్వంలో నిర్మాతలు ప్రవీణ్ కుమార్ శ్రీనివాస్‌రెడ్డి నిర్మిస్తున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటర్టైనర్ స్టువర్టుపురం స్టూడెంట్స్. 80 షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటుంది. కాగా ఈ చిత్ర ట్రైలర్ ను ప్రముఖ దర్శకులు వేణు ఉడుగుల లాంచ్ చేశారు. ట్రైలర్ తో పాటు ఆయన సాంగును కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ స్టువర్టుపురం స్టూడెంట్స్ ట్రైలర్ చూశాను .అలాగే సాంగ్స్ కూడా చూశాను. చాలా బాగున్నాయి. ఈ సాంగ్, ఈ ట్రైలర్ నా చేతుల మీదుగా రిలీజ్ చేయటం సంతో షంగా ఉంది. ట్రైలర్ చాలా బాగుంది . అన్నారు. చిత్ర దర్శకుడు రామకృష్ణ మాట్లాడుతూ మా సినిమా ట్రైలర్ విడుదల కోసం అడిగిన వెంటనే కాదనకుండా తన ఆఫీస్ కు పిలిపించుకుని మా ట్రైలరు సాంగ్ ను ఆవిష్కరించిన దర్శకులు వేణు ఉడుగులకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాను. హీరోయిన్ దివి మాట్లాడుతూ మేము అడిగిన వెంటనే ఎంతో రెస్పెక్ట్ ఇచ్చి మా ట్రైలరు సాంగ్‌ని రిలీజ్ చేసిన వేణు ఉడుగులకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

'పళ్ళ బురుసు' నవ్వులు పూయించే ట్రైలర్

అన్నపూర్ణ స్టూడియోస్, నిశిది స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న కుటుంబ కథా చిత్రం 'పళ్ళ బురుసు'. ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణాని నిర్మాతలు. ఉదయ్ చౌహాన్ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, గోమతి, ప్రజ్వల్ యాద్మ, సుజాత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 14న సినిమా విడుదల కానుండగా, తాజాగా కింగ్ నాగార్జున అక్కినేని ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట గ్రామ ప్రజలందరికీ నా నమస్కారం. 'పళ్ళ బురుసు' సినిమా షూటింగ్ లచ్చపేట గ్రామంలోనే జరిగింది. అందుకే ఈ ట్రైలర్‌ను ముందుగా మీ అందరికీ చూపించి విడుదల చేయాలనుకున్నాం. ట్రైలర్ లాంచ్ సందర్భంగా లచ్చపేట గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఓ తండ్రి తన కొడుకుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ట్రైలర్ ఆసక్తికరంగా ప్రారంభమవుతుంది. కారణం ఏమిటంటే... తనకు టూత్‌బ్రష్ కొనివ్వలేదని కొడుకుపై కేసు పెట్టడం. ఇంత చిన్న విషయానికి ఫిర్యాదు చేయడమేంటని పోలీసులు సర్ ప్రైజ్ గురవుతారు. ట్రైలర్ ముందుకు సాగేకొద్దీ తండ్రికొడుకుల మధ్య పెరిగిన భావోద్వేగ, ఒకరినొకరు అర్థం చేసుకోలేని పరిస్థితి హృదయాన్ని తాకేలా చూపించారు. సినిమా టోగ్రాఫర్ వినోద్ కె. బంగారి గ్రామీణ నేపథ్యాన్ని సహజత్వంతో అద్భుతంగా ఆవిష్కరించగా, పవన్ సీహెచ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వినోదం, భావోద్వేగాలను ఎలివేట్ చేసింది.

8vzm15:8vzm15.qxd 07-08-2026 22:55 Page 1

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

శృంగవరపుకోట,ఆగస్టు7,ప్రభాతవార్త:

బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి పాలు ఎంతో ముఖ్యమని పెదఖండేపల్లి సెక్టార్ అంగన్వాడీ సూపర్ వైజర్ నాగరత్నం అన్నారు. శుక్రవారం మరుపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భం గా ఎస్.కోట ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.కార్యక్రమంలో పిల్లల తల్లులు, బాలింతలు,గర్భిణీలు,అంగన్వాడీ కార్యకర్తలు,ఏఎన్ఎం రామలక్ష్మి,ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అరుతడి పంటలు సాగు చేయాలి : చింతల

రామభద్రపురం, ఆగస్టు 7,ప్రభాత వార్త:

ప్రభుత్వ ఆదేశాల మేరకు తేదీ 7 ఆగస్టు 26 నుంచి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది . కార్యక్రమంలో ప్రస్తుతం ఎలనినో ప్రభావం, వాతావరణ పరిస్థితులు పై అవగాహన కలిపించడం జరుగుతుంది అని మండల వ్యవసాయ అధికారి అమరా శివ తెలిపారు. రాష్ట్ర కార్య నిర్వహణ మాజీ కార్యదర్శి చింతల రామకృష్ణ మాట్లాడుతూ నీటి వనరులు లేని వారు అరుతది పంటలు సాగు చేసుకోవాలి అని తెలిపారు. రామభద్రపురం 1 రైతు సేవా కేంద్రంలో నిర్వాహంచిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శ్రీ భవిరెడ్డి చంద్ర గారు ప్రస్తుత ఎలనినో ప్రభావంతో దిగుబడులు తగ్గే అవకాశం వుంది కాబట్టి పంట భీమా కట్టుకోవాలి అని రైతులకు తెలియజేసారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది జి వరలక్ష్మి, జ్యోత్స్న పాల్గొన్నారు.

దళితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి : శ్రీను

రామభద్రపురం, ఆగస్టు 7,ప్రభాత వార్త:

మండలంలో దళిత, గిరిజనలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జూలై 16 నుండి 26 వరకు సామాజిక అధ్యయన యాత్రలు పేరుతో దళిత గిరిజన వాడల్లో ఉన్న సమస్యలపై సర్వే చేయడం జరిగింది .ప్రధానంగా కాకర్లవలసలో గిరిజనులకు స్మశాన వాటిక లేదు .ఎవరైనా చనిపోతే గెడ్డలో దహన సంస్కారాలు నిర్వహించాల్సిన పరిస్థితి. అలాగే కారేడు వలసలు కూడా స్మశాన వాటికకు స్థలం లేదు. వీరు కూడా అదే రకమైన పరిస్థితి మూలాన ఇబ్బందులు పడుతున్నారు. ఇట్ల మామిడిపల్లి దళిత కాలనీలో రోడ్లు ,వీధి కాలువలు లేవు. ఫలితంగా మురుగునీరంతా కాలనీ పరిసర ప్రాంతాల్లోనే నిల్వ ఉండిపోయి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్రామంలో దళితులకు వెనుకబడిన తరగతులకు భూములు సరిహద్దుకు సంబంధించిన సమస్య ఉండటంతో ఇరువర్గాల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. కొండ కేంగువ లో 20 దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూములను ఇతరులు ఆక్రమించుకున్నారు. రాంబద్రపురంలో దళితులకు కొంతమంది ఇళ్ల స్థలాలు లేవు. కాలనీలో రోడ్లు లేవు. జోగేంద్ర వలస లో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ఇతరులు ఆక్రమించుకుంటున్నారు. కావున పైన తెలిపిన సమస్యలన్నిటినీ పరిష్కరించాలని రాంబద్రపురం మండల కార్యదర్శి బలస శ్రీను డిమాండ్ చేశారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

గరుగుబిల్లి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గారికి క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే శ్రీమతి తోయక జగదీశ్వరి గారు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆఫ్ఎఫ్) ద్వారా మంజూరైన 20 లక్షల 35 వేలు విలువైన 27 చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం నాడు అందజేశారు. అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు, అత్యవసర వైద్య ఖర్చులు కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 27 కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం అందించిన సహాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని లబ్ధిదారులు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు, రాష్ట్ర కొప్పల వెలమ డైరెక్టర్ అక్కేన మధుసూదన్ రావు, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు, కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కద్రక కళావతి, గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు, గుమ్మలక్ష్మీపురం మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, జియ్యమ్మవలస మండల పార్టీ అధ్యక్షులు జోగి భుజంగరావు, కురుపాం మండల పార్టీ అధ్యక్షులు కె.వి.కొండయ్య, కొమరాడ మండల పార్టీ అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, గరుగుబిల్లి మండల పార్టీ అధ్యక్షులు మరాడన నారాయణస్వామి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్, ఎంపీటీసీ సభ్యులు కోట సుమన్, సీనియర్ నాయకులు దేవకోటి వెంకటనాయుడు, గురాణ శ్రీరామమూర్తి, సోములు, శ్రీకర్, కిషోర్, రామకృష్ణ, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

త్వరలో వైద్య కళాశాల పనులు పూర్తి : మంత్రి

విజయనగరం, ఆగస్ట్ 7: ప్రభాతవార్త:

త్వరలో ప్రభుత్వ వైద్య కళాశాల పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆయన కలెక్టరేట్ వద్ద శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం వల్ల నాబార్డు ఫండ్స్ మురిగిపోయాయని చెప్పారు. ప్రస్తుతం సాస్కి ఫండ్స్‌తో కొత్తగా పనులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి గట్టిగా కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మెడికల్ కాలేజ్ ఆసుపత్రి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న సర్వజన ఆసుపత్రిని కూడా ప్రభుత్వ ఆసుపత్రిగా కొనసాగించే దిశగా ప్రతిపాదనలను ముందుకు తీసుకు వెళ్తున్నామని మంత్రి వివరించారు. మంత్రితో బాటు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కూడా ఉన్నారు.

దిశపై ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలి

విజయనగరం రిలే నిరాహార దీక్షలో చిన్న శ్రీను

విజయనగరం, ఆగస్టు 7, ప్రభాతవార్త:

విజయనగరం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నిర్వహించిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనల మేరకు నిర్వహించిన విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పాల్గొని, రిలే నిరాహార దీక్షలో కూర్చున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి మాజీ మేయర్ విజయలక్ష్మి , ఇతర మహిళా నాయకురాళ్లు, యువతకు నిమ్మరసం అందించి రిలే నిరాహార దీక్షను విరమింపజేశారు. చిన్న శ్రీను మాట్లాడుతూ, డీఎస్సీ--2025 ఉపాధ్యాయ నియామకాలలో జరిగిన అవకతవకలు వేలాది మంది నిరుద్యోగ యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడినట్టేనని విమర్శించారు. అర్హత, ప్రతిభ ఆధారంగా జరగాల్సిన నియామకాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

27 సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం, ఆగస్టు 7, ప్రభాతవార్త:

కురుపాం నియోజకవర్గం నకు సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆఫ్ఎఫ్) ద్వారా మంజూరైన 20 లక్షల 35 వేలు విలువైన 27 చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు, అత్యవసర వైద్య ఖర్చులు కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 27 కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. సిఎంఆర్ఎఫ్ వంటి పథకాలు ఆపదలో ఉన్నవారికి ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ కష్ట కాలంలో అండగా నిలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు, రాష్ట్ర కొప్పల వెలమ డైరెక్టర్ అక్కేన మధుసూదన్ రావు, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు, కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కద్రక కళావతి, కురుపాం పి ఏ సి ఎస్ అధ్యక్షులు డొల్లు కిషోర్ కుమార్, కోలా రంజిత్ కుమార్ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు , లబ్ధిదారులు పాల్గొన్నారు.

'ప్రజాదర్బార్'లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

భోగాపురం,ఆగస్టు7, ప్రభాతవార్త :

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ముంజేరు క్యాంపు కార్యాలయంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమం, సుపరిపాలన స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. రెవెన్యూ సమస్యలు, ఇళ్ల స్థలాల కేటాయింపు, విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ స్తంభాల మార్పు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.ప్రతి అర్జీని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శ్రద్ధగా పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి, నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వేగవంతమైన పరిష్కారం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందుతోంది. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడం నా బాధ్యత. ప్రతి అర్జీని చివరి దశ వరకు పర్యవేక్షించి, అర్హులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తాను" అని తెలిపారు. ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసి పరిష్కార దిశగా చర్యలు చేపట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల గడప వద్దకే పాలనను తీసుకెళ్లాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి 'ప్రజా దర్బార్' కార్యక్రమం మరో నిదర్శనంగా నిలిచింది.

రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

దత్తిరాజేరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూములు రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ హరికిరణ్ అన్నారు పెదకాదలో శుక్రవారం గ్రామసభ ద్వారా రైతులతో మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే ద్వారా రైతులకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు రైతులు సాగు చేస్తున్న భూమి వివరాలు రీసర్వే సిబ్బందికి తెలియజేయాలన్నారు రీ సర్వే ఆధారంగా కొత్త రికార్డులు తయారు చేయడం జరుగుతుందన్నారు దీనివల్ల భూ యజమానులకు శాశ్వత భూహక్కు పాసుబుక్కులు వస్తాయన్నారు సర్వేకు వచ్చిన అధికారులకు రైతులు సహకరించాలని గ్రామ రైతులకు తెలిపారు. మండల సర్వేర్ శివకుమార్ ఎంపిటిసి సత్యం, గ్రామ పెద్దలు విఆర్ఓ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమం లేకపోతే, సమాజం దారి తప్పుతోంది

పార్వతిపురం, ఆగస్టు7, ప్రభాతవార్త:

రాజ్యమైనా, రాజ్యాంగమైనా, ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలను వెనుక బడ్డ ప్రాంతాలకు, అణగారిన వర్గాలకు అందజేయాలని, అలా అమలు చేయకపోతే, సమాజం దారి తప్పుతోంది అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. ఉత్తరాంధ్ర సంక్షేమ యాత్రలో భాగంగా ఐదవరోజు శుక్రవారం ఆయన అంబెడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ -శ్రీ రజనికుమారి అధ్యక్షతన కళాశాల సాధించిన పురోగతికి సంబంధించిన అధికారులతో, అధ్యాపకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అట్టడుగున ఉన్న వర్గాలకు ప్రభుత్వాలు సంక్షేమాన్ని వాగ్దానం చేసి కోట్ల రూపాయల ఖర్చుతో వారి పిల్లల భవిష్యత్తుకు దారిచూపుతోందని, అలాంటి దారిలో విద్యార్థులను నడిపించాల్సిన బాధ్యత మీదే అన్నారు. ఉద్యోగం అంటే జీతం రాళ్ళు కోసం చేసే పని కాదని, సమాజపు బాధ్యత అని గుర్తు చేశారు. విద్యార్థులు దారితప్పితే, వారి జీవితాలతో పాటు సమాజ జీవితానికీ ప్రమాదమే అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో విజయనగరం మన్యం జిల్లాల సమన్వయకర్త రూపావతి జిల్లా సాంఘిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. శ్యామల, హెల్త్ ఆఫీసర్ రాం ప్రసాద్ సాహితోపాటు ప్రిన్సిపాల్స్ వార్డ్న ఉన్నారు.

41 సార్లు రక్తదానం చేసిన సహాయస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యుడు సంతోష్

దత్తిరాజేరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :

అత్యవసర సమయంలో రక్తదానం చేసిన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యుడు సంతోష్ 41 సార్లు రక్తదానం చేశాడని ఫౌండేషన్ అధ్యక్షులు సాయి కుమార్ అన్నారు విశాఖపట్నం కేర్ హాస్పిటల్ ఓ వ్యక్తికి ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరం పడగా సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యుడు సంతోష్ వెంటనే స్పందించి ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు అత్యవసర సమయంలోమరొకరి ప్రాణాలు కాపాడిన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యుడు సంతోష్ కు ఫౌండేషన్ అధ్యక్షుడు కార్యదర్శి రేవంత్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి .. విషాదంలో తండ్రి

సాలూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :

సాలూరు మండలం పందిరి మామిడి వలస జంక్షన్ వద్ద ట్రాక్టర్ ఢీకొనగా యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. శుక్రవారం రూరల్ ఎస్ఐ రవీంద్రరాజు తెలియజేసిన వివరాలు ప్రకారం కవిరిపిల్లి గ్రామానికి చెందిన బద్రాజు. శంకరరావు అతని భార్య ఇంకా కుమారుడు బద్రాజు.భార్గవ్(15) వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై వెళుతున్నారని తెలిపారు. అలాగే పందిరి మామిడి వలస జంక్షన్ కు వచ్చేసరికి ముందుగా వెళుతున్న ట్రాక్టర్ ను క్రాస్ చేస్తుండగా ఆ ట్రాక్టర్ వీరిని ఢీకొనడం జరిగిందని చెప్పారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనం మధ్యలో కూర్చున్న బద్రాజు భార్గవ్ బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయలుతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ స్థానిక విలేకరులకు తెలియజేశారు.

రైతులు మిశ్రమ పంటలను సాగు చేసుకోవాలి

దత్తిరాజేరు, ఆగస్టు 7, ప్రభాతవార్త :

ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు అంతర మిశ్రమ పంటలు వేసుకోవాలని ఏడిఏ జి శ్రీనివాస్ తెలిపారు శుక్రవారం వి కృష్ణాపురం కే కొత్తవలస రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయ అధికారి కే గోవిందమ్మ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏ డి ఏ మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులను అనుగుణంగా రైతుల పంటలు వేసుకోవాలని వేసుకున్న పంటల్లో నీటిని వృధా కాకుండా ప్రతి నీటి బొట్టు వినియోగించుకోవాలని బిందు డ్రిప్పుతుంపర సేద్యశీ పథకాలను వినియోగించుకోవాలని ఆరుతడి తక్కువ కాలపరిమితి పంటలు అంతర మిశ్రమ పంటల సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు అలాగే ప్రతి రైతు కమతాలునును సందర్శించి వాతావరణ సానుకూల పంటల ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ సిబ్బందికి రైతులకు సూచించారు వ్యవసాయ అధికారి గోవిందమ్మ మాట్లాడుతూ పంటల ప్రణాళిక మరియు ఎప్పటికప్పుడు ప్రణాళిక ఆధారంగా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచి పంట జీవనాధారం తడులను ఉపయోగించి ప్రభావాన్ని తగ్గించి రైతు ఆదాయ భద్రత కాపాడాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకట్ నాయుడు రాము, రైతులు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఇన్చార్జి మంత్రిచే ఆసుపత్రి భవనాలు ప్రారంభం

కురుపాం, ఆగస్టు 7,ప్రభాతవార్త :

కృప నియోజవర్గంలో భద్రగిరి కురుపాంలో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాలను శనివారం మంత్రి అచ్చం నాయుడు ప్రారంభించనున్నారు. గత రెండేళ్లుగా పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి ఎదురుచూస్తున్న భవనాలకి ఎట్టకేలకు మోక్షము కలగనుంది. కురుపాంలో మూడు కోట్లతోనూ భద్రగిరిలో 50 పడకల ఆసుపత్రి భావన నిర్మాణానికి 9 కోట్ల తోనూ ప్రజలకు వైద్య సేవలు అనుకూలంగా ఉండే విదంగత నిర్మాణం చేపట్టారు. వీటిని ఎమ్మెల్యే జగదీశ్వర్ అధ్యక్షున జిల్లా ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చం నాయుడు శనివారం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా జిల్లా ఎమ్మెల్యేలు, తదితర నాయకులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త

ఎల్‌నినో ప్రభావంపై కార్యాచరణ ప్రణాళిక

బలిజిపేట ,ఆగస్టు 7, ప్రభాతవార్త :

మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం ఎల్‌నినో ప్రభావం రైతులకు ఎంత మేర ప్రభావం చూపుతోందని, ఈ ప్రభావం వల్ల ఏఏ పంటలు వేసుకోవాలో రైతన్నలకు ముందుగా సూచిస్తూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పసిఫిక్ మహాసముద్రం ఏర్పడిన ఉష్ణోగ్రత పెరగడం వలన ఈ ప్రభావాన్ని "ఎల్‌నినో "గా పిలవబడే ఈ ప్రభావాన్ని రైతులకు పంట పొలాలకు తక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ కారణంతో తనలు ఇటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వరుసాధార భూములు బట్టి ఏ ఏ పంటలు వేయాలో ముందుగా సూచించి వాటి కార్యాచరణ సిద్ధం కావాలని బలిజిపేట వ్యవసాయ అధికారి శివ గణేష్ రైతులకు వివరించారు శుక్రవారం రైతన్నల దగ్గరికి వెళ్లి రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని పూర్తిగా వివరించడం జరిగింది. రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాతమూరులో తల్లిపాలు వారోత్సవాలపై ర్యాలీ

పాచిపెంట, ఆగస్టు 7, ప్రభాతవార్త:

ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ , పాంచాలి సెక్టార్ పరిధిలో గల మాతుమూరు గ్రామంలో సూపర్వైజర్ ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు తో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఆయన మా ట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బాలమృతం పోషక పదార్థాలు గుడ్లు డ్రై ఫ్రూట్స్ పాలు గర్భిణీలు బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పుట్టిన బిడ్డలకు తల్లిపాలు పెట్టడం వలన చంటి పిల్లలకు చాలా ఆరోగ్యకరమైన ఆయన అన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ సిహెచ్‌డబ్ల్యూ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు సమయపాలన పాటించాలి

బలిజిపేట, ఆగస్టు 7, ప్రభాతవార్త :

మండల వెలుగు సమాఖ్య కేంద్రంలో అంగనవాడి ఆధ్వ ర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో బలిజిపేట అంగనవాడీ ప్రాజెక్టు పిఓ కే రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అం గనవాడీ కేంద్రాలు సమయపాలన, పరిసరాలు పరిశుభ్రత పా టించాలన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్ సులేఖ పద్మావతి, రేవతి.. బ్లాక్ కోఆర్డినేటర్ కామేష్ , టాటా ట్రస్ట్ జగన్ మోహన్, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

డీఎస్సీ-2025 అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి

తెర్లాం, ఆగస్టు 7, (ప్రభాతవార్త):

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 2025 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లో అక్రమాలు చోటు చేసుకున్న విషయం పైన రాష్ట్ర వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు మండల పార్టీ నేతలు శుక్రవారం నిరాహార దీక్షలు ప్రాంభించారు. మండల పార్టీ అధ్యక్షులు తెంటు సత్యం నాయుడు యువసేన అధ్యక్షులు చప్ప ఈశ్వర రావు ల అధ్వర్యంలో చేపట్టిన ధర్నా లో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న డి.ఎస్.సి. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లో వారు పాల్పడిన అక్రమాలపై న తక్షణమే సి.బి.ఐ.చేత దర్యాప్తు నిర్వహించాలని కోరారు.. అందుకు బాధులైన శిక్షించాలన్నారు అందుకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని ఫీజు రీయింబర్స్మెంట్ కూడా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. జెడ్ పి టిసి ప్రతినిధి గర్భాపు రామారావు వైస్ ఎం.పి.పి చేపేన సత్య నారాయణ పలు గ్రామాల పార్టీ సర్పంచ్‌లు బూరి మధుసూదన రావు జి. వెంకట రావు నర్సుపల్లి శ్రీనివాసురావు శనపతి రాంబాబు మర్రాపు జగన్నాథం పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

తెర్లాం, ఆగస్టు 7,(ప్రభాతవార్త):

మండల కేంద్రంలో శుక్రవారం బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె రంగారావు (బేబీ నాయన) తెర్లాం, అరసబలగ గ్రామాలకు చెందిన రైతులకు రాజముద్ర తోకూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణి చేసారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ-హక్కులను శాశ్వతంగా పరిరక్షిస్తూ, భూ-రికార్డుల్లో పూర్తి పారదర్శకత తీసుకురావాలనే లక్ష్యంతో రీ-సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఖచ్చితమైన కొలతల ఆధారంగా నిర్వహించిన రీ-సర్వే వల్ల భూముల సరిహద్దులపై ఉన్న వివాదాలు, సందిగ్ధతలు తొలగిపోవడంతో పాటు రైతులకు స్పష్టమైన యాజమాన్య హక్కులు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు తెర్లాం మండలం టీడీపీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటేష్ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమకోటి గిరిబాబు , జనసేన నాయకులు చందక ఉమామహేశ్వరరావు తెర్లాం మండల తహసీల్దార్ ధనం,ఉప తహసీల్దార్ గొంగడ సత్యన్నారాయణ, వి ఆర్ ఓ లు సబ్బిశెట్టి శ్రీను, దుమ్మిది రాము ,టీడీపీ నాయకులు మర్రాపు యుగంధర్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

వేపాడ, ఆగస్టు 7, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వశీ లక్ష్యంగా పనిచేస్తుందని, ఈ నేపథ్యంలో రెండేళ్లు పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్నామని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు . ముకుందపురంలో 'రెండేళ్ల నమ్మకం - ఇంటింటికీ అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ వీధిలో పర్యటిస్తూ, ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకి దూరంగా ఉండాలి

గరివిడి, ఆగస్టు 7, ప్రభాత వార్త:

యువత మాధకద్రవ్యాల కు దూరంగా ఉండాలని గరివిడి పశువైద్య కళాశాల ఇంచార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసాద రావు అన్నారు. నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థి వ్యవహారాల అధికారి డాక్టర్ ఏ.సుప్రియ, గరివిడి బ్రహ్మ కుమారీలు సంయుక్త ఆధ్వర్యంలో పశువైద్య కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు కి దూరంగా ఉండాలన్నారు.ప్రజలను చైతన్య పరచాలని ఆయన కోరారు. మాధకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతీ ఒక్క విద్యార్థి పాటు పడాలని కోరారు. మత్తు వలన కలిగే దుష్పరిణామాలు పై విద్యార్థులతో బ్రహ్మ కుమారీలు, కళాశాల విద్యార్థి విభాగ ప్రతినిధులు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఓం శాంతి కేంద్రం ఇంచార్జి బ్రహ్మ కుమారి హేమలత, కళాశాల ప్రొఫెసర్లు, పశువైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల సంరక్షణ పై దృష్టి కేంద్రీకరించాలి

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కోటేశ్వరరావు

గరివిడి, ఆగస్టు 7, ప్రభాత వార్త:

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల సంరక్షణ పై చర్యలు చేపట్టాలని చీపురుపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్.కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో రైతన్న మీకోసం -ఎల్‌నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏ డి కోటేశ్వరరావు మాట్లాడుతూ పంటల కు తగినంత తేమశాతం లోపం,తెగులు,కీటకాలు సమస్యలు గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గరివిడి మండల వ్యవసాయ అధికారి పక్కి ప్రసాదరావు, వ్యవసాయ సహాయకులు పర్వేజ్ , తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్.. టీమిండియాకు డూ ఆర్ డై

మిగిలిన 9 మ్యాచ్‌లూ కీలకం

న్యూఢిల్లీ: వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ (డబ్ల్యూటిసి) 2025-27 ఫైనల్ రేసులో భారత్ నిలవడం అత్యంత సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం టీమిండియా ఆడిన 9 టెస్టుల్లో 4 విజయాలతో 48.15 శాతం పాయింట్లతో (డబ్ల్యూటిసి) ఐదో స్థానానికి పరిమితమైంది. అంతేకాకుండా, పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ కంటే కూడా వెనుకబడి ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఆస్ట్రేలియా 87.50 గెలుచుకున్న పాయింట్ల శాతంతో అగ్రస్థానంలో ఉండగా, సౌతాఫ్రికా (75), న్యూజిలాండ్ (72.22), బంగ్లాదేశ్ (58.33) వరుసగా భారత్ కంటే మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఖాతాలో ఇంకా 9 టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉండటంతో ఇకపై ఎలాంటి పొరపాట్లకు తావులేదు. టీమిండియా తన మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తే పాయింట్ల శాతం 74.07కు చేరి ఫైనల్ బెర్త్ దాదాపు ఖాయమవుతుంది. అయితే, ఒక మ్యాచ్ ఓడితే పాయింట్ల శాతం 68.5కు, రెండు ఓటములతో 62.9కు, మూడు ఓటములు ఎదురైతే 57.41కి పడిపోతుంది. డబ్ల్యూటిసి నిబంధనల ప్రకారం ప్రతి విజయానికి 12 పాయింట్లు, డ్రాకు 4 పాయింట్లు లభిస్తాయి, కాబట్టి ఒక్క ఓటమి కూడా భారీ ప్రభావం చూపుతుంది. టీమిండియా ముందున్న షెడ్యూల్ ఎంతో సవాలుతో కూడుకున్నది. ఇక టీమిండియా మొదట శ్రీలంక పర్యటనలో రెండు టెస్టులు ఆడనుంది. అక్కడ స్పిన్ ఎదుర్కోవడం పెద్ద పరీక్షగా మారనుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనలో మరో రెండు టెస్టుల్లో పోటీపడాల్సి ఉంటుంది. చివరగా, ప్రపంచ నంబర్1 టెస్ట్ జట్టు ఆస్ట్రేలియాతో స్వదేశంలో 5 మ్యాచ్‌ల సుదీర్ఘ సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ కేవలం తన మ్యాచ్‌లను గెలవడమే కాకుండా, ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుభమన్ గిల్ సారథ్యంలోని టీమిండియా ఇకపై ఆడే ప్రతి మ్యాచ్ నాకౌట్‌గా భావించి వరుస విజయాలు సాధిస్తేనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కలను నిజం చేసుకోగలదు.

సెయింట్ లూయిస్ రాపిడ్.. బ్లిట్జ్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద

న్యూఢిల్లీ: భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద, జవోఖిర్ సిందరోవ్‌తో జరిగిన చివరి ముఖాముఖి పోరులో కీలకమైన డ్రా సాధించి, ఒక రౌండ్ మిగిలి ఉండగానే గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ రాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ చెస్ టోర్నమెంట్‌లో 20 యేళ్ల భారత స్టార్ 35 పాయింట్లకు గాను 23 పాయింట్లతో ఛాంపియన్‌షిప్‌ను ముగించగా, సిందరోవ్ 22 పాయింట్లతో టోర్నమెంట్‌లో రెండో స్థానంలో నిలిచాడు. ఐదురోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్ అంతటా ప్రజ్ఞానంద తన పట్టును కొనసాగించాడు. చివరి దశలలో సిందరోవ్ గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఈ ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ భారత ఆటగాడి కంటే కేవలం 1.5 పాయింట్ల తేడాతో ఓటమి పాలయ్యాడు. ఈ బ్లిట్జ్ టోర్న మెంట్‌లో 10మంది అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డారు. ఈ ఈవెంట్‌లో తొమ్మిది రాపిడ్ రౌండ్లు, 18 బ్లిట్జ్ రౌండ్లు జరిగాయి. సింక్‌ఫీల్డ్ కప్, జిసిటి గ్రాండ్ ఫైనల్స్‌కు ముందు విలువైన గ్రాండ్ చెస్ టూర్ పాయింట్లకోసం మొత్తం 135గేమ్‌లు ఆడబడ్డాయి. ఈ పోటీలో రెండు ఫార్మా ట్‌లలో మొదటిది, 25నిమిషాల కాలపరిమితి, మొదటి ఎత్తునుండి 10సెకన్ల అదనపు సమయంతో కూడిన 9 రౌండ్ల సింగిల్ రౌండ్‌రాబిన్ ర్యాపిడ్ ఈవెంట్, రెండవది ఐదు నిమిషాల కాలపరిమితి, ప్రతి ఎత్తుకు రెండు సెకన్ల అదనపు సమయంతో ఆడే 18 రౌండ్ల డబుల్ రౌండ్‌రాబిన్ బ్లిట్జ్ ఈవెంట్. స్కోరింగ్ విధానంలో వేగవంతమైన విజయాలకు రెండు పాయింట్లు, డ్రాలకు ఒక పాయింట్ లభించగా, బ్లిట్జ్ విజయాలకు ఒక పాయింట్, డ్రాలకు అర పాయింట్ లభించింది.

కొరియా మాస్టర్స్.. సెమీఫైనల్‌కు అష్మిత, రక్షిత

న్యూఢిల్లీ: భారత్ ప్లేయర్లు అష్మిత, రక్షిత కొరియా మాస్టర్స్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన తమతమ క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ 50వ ర్యాంకర్ అష్మిత, ఆసన్ యి సన్‌సిన్ జిమ్నాసియంలో జరిగిన ఉత్కంఠభరితమైన క్వార్టర్ ఫైనల్‌లో, టాప్ సీడ్ మరియు ప్రపంచ 22వ ర్యాంకర్ అయిన జపాన్‌కు చెందిన హినా అకేచిని 20-22, 21-15, 21-19 తేడాతో ఓడించి, ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సంచలనాన్ని సృష్టించింది. గంటకు పైగా సాగిన పోరులో, ఒక గేమ్ వెనుకబడిన స్థితి నుండి పుంజుకున్న రక్షిత, మూడో సీడ్, తన స్వదేశీయురాలైన తన్వి శర్మను 18-21, 21-19, 21-18 స్కోరుతో ఓడించి సంచలనం సృష్టించింది. అష్మిత ఎండ్స్ తర్వాత అష్మిత బలంగా పుంజుకుంది. స్కోరు 7-7తో సమంగా ఉన్నప్పుడు, ఆమె వరుసగా ఆరు పాయింట్లు సాధించి 13-7 ఆధిక్యానికి దూసుకెళ్లింది. హినా తేడాను 14-16కు తగ్గించినప్పటికీ, భారత క్రీడాకారిణి సంయమనం కోల్పోకుండా, తర్వాతి ఆరు పాయింట్లలో ఐదింటిని కైవసం చేసుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. నిర్ణయాత్మక గేమ్ కూడా అష్మిత అదే రీతిలో సాగి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. అలాగే తొలి గేమ్‌లో రక్షిత 138 ఆధిక్యంతో దూసుకెళ్లగా, ఆ తర్వాత తన్వి అద్భుతంగా పుంజుకుని, తర్వాతి తొమ్మిది పాయింట్లలో ఎనిమిదింటిని వరుసగా సాధించి 8-13 నుంచి 16-14కు చేరుకుని గేమ్‌ను ముగించింది. తర్వాత గేమ్ కూడా మరో హోరాహోరీ పోరుగా సాగింది. కీలక దశలో తన్వి తడబడి, మూడు అనవసర తప్పిదాలు చేయడంతో రక్షిత 19-16 ఆధిక్యాన్ని సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది.

టీమిండియా బౌలర్లు విఫలం

భారీగా 363 పరుగులు చేసిన శ్రీలంక

న్యూఢిల్లీ: శ్రీలంక ఎలెవన్‌తో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తేలిపోయారు. కొలంబో వేదికగా తొలి రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు నష్టానికి 363 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆతిధ్య జట్టు వికెట్లు పడగొట్టేందుకు టీమిండియా బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు ఓపెనర్లు నిశాన్ మధుష్క (66), రవిందు రసంత (71) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వారిద్దరూ వన్డే తరహాలో బ్యాటింగ్ చేసి తొలి వికెట్‌కు ఏకంగా 110 పరుగు భాగస్వామ్యం నెలకొల్పి భారత్ బౌర్లను ఒత్తిడిలోకి నెట్టారు. అయితే సమన్వయ లోపం కారణంగా మధుష్క రనౌట్ కావడంతో భారత్‌కు తొలి వికెట్ దక్కింది. నిశాన్ స్థానంలో క్రీజులోకి వచ్చిన వన్‌డౌన్ బ్యాటర్ పసిందు సూరియబండారా కూడా రాణించాడు. అయితే రసతంత, సూరియబండరా (35)లను వరుస ఓవర్లలో ఔట్ చేసి టీమిండియా కాస్త కమ్‌బ్యాక్ ఇచ్చినట్లు కన్పించింది. కానీ ఆ తర్వాత వచ్చిన పవన్ రత్నాయకే (39), అహాన్ విక్రమ సింఘే(31), కెప్టెన్ సోనల్ దినుష (52), రమేష్ మెండిస్ (32) నిలకడగా ఆడి జట్టు స్కోర్‌ను 350 పరుగుల మార్క్ దాటించారు. ప్రస్తుతం క్రీజులో కేశర సువాంత (9), సుదీరా (1) ఉన్నారు. భారత్ బౌలర్లలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. వీరితో పాటు గుర్నూర్ బ్రార్‌ఘ ఓ వికెట్ తీశాడు. సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్ 13 ఓవర్లు బౌలింగ్ చేసినప్పటికీ ఒక్క వికెటన కూడా తీయలేదు.

వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్.. ఫైనల్‌కు అష్ఫాక్, బసంత్

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన మహమ్మద్ అష్ఫాక్, 2026 ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్ పురుషుల 400 మీటర్ల పోటీలో ఫైనల్‌కు చేరుకున్నాడు. అలాగే హై జంప్‌లో బంసత్ విజయంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. శుక్రవారం నాడు ఈ పోటీల్లో 19 యేళ్ల అష్ఫాక్ హీట్ 5లో 45.81 సెకన్ల సమయం నమోదు చేసి రెండో స్థానంలో నిలిచాడు. సెమీఫైనల్ హీట్ 3లో 46.00 సెకన్ల పరుగుతో మూడవ స్థానంలో నిలిచి ఫైనల్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకున్నాడు.

మరో భారత్ అథ్లెట్ పీయూష్ రాజ్, హీట్ 6లో 47.78 సెకన్ల టైమింగ్‌తో ఐదవ స్థానంలో నిలిచి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయాడు. ఇక పురుషుల హై జంప్‌లో, బసంత్ 2.14 మీటర్ల ఎత్తును అధిగమించి ఫైనల్‌కు అర్హత సాధించగా, 2.05 మీటర్ల అత్యుత్తమ జంప్ చేసిన ఏకే అంబ్రీష్ గ్రూప్ బిలో 12వ స్థానంలో నిలిచి అర్హతను కోల్పోయాడు. ఇక అన్షు మహిళల షాట్‌పుట్ ఫైనల్‌కు తృటిలో అర్హత కోల్పోయింది. ఆమె 15.24 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో అర్హత మార్కుకు 21 సెం.మీ. దూరంలో నిలిచింది. తను చౌదరి కూడా మహిళల 400 మీటర్ల హార్డిల్స్‌లో తన హీట్‌లో 1:00.03 సమయంతో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయింది. పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో, అమిత్ కుమార్ తన హీట్‌లో 54.01 సెకన్ల సమయంతో చివరి స్థానంలో నిలిచాడు.

మరింత పెరిగిన వెండి, బంగారాలు

వెండి రూ.8,000 పెరుగుదల, బంగారం రూ.1.50 లక్షలకు చేరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 7: దేశీయ కమోడిటీ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు శుక్రవారం భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు బలపడటం, అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలు దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సెప్టెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ ధర 1.54 శాతం లేదా రూ.2,271 పెరిగి 10 గ్రాములకు రూ.1,49,793కు చేరింది. సెప్టెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ ఏకంగా 3.56 శాతం లేదా రూ.8,040 ఎగిసి కిలోకు రూ.2,33,876 వద్ద ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర సుమారు 1.9 శాతం పెరిగి ఔన్సుకు 4,300 డాలర్లకు చేరువైంది. దీంతో బంగారం, వెండి వరుసగా బలమైన వారపు పనితీరును నమోదు చేసే దిశగా సాగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 81.74 డాలర్లకు తగ్గింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ సుమారు 76 డాలర్ల వద్ద ఉంది. క్రూడ్ ధరలు తగ్గడం ద్రవ్యోల్బణ ఆందోళనలను తగ్గిస్తుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తక్కువగా ఉంచడం లేదా తగ్గించే అవకాశాలు పెరుగుతాయని మార్కెట్ భావిస్తుంది. వడ్డీ ఆదాయం ఇవ్వని బంగారానికి తక్కువ వడ్డీ రేట్లు అనుకూలంగా ఉంటాయి. అమెరికా కరెన్సీ విలువ స్వల్పంగా తగ్గడం కూడా బంగారం ధరలకు మద్దతుగా నిలిచింది. బంగారం అంతర్జాతీయంగా డాలర్లలో ధర నిర్ణయించబడుతుంది. డాలర్ బలహీనపడితే ఇతర కరెన్సీల కొనుగోలుదారులకు బంగారం చౌకగా మారడంతో డిమాండ్ పెరుగుతుంది. హర్ముజ్ ద్వారా నౌకాయానాన్ని పునరుద్ధరించేందుకు ఒప్పందం సమీపంలో ఉందన్న సంకేతాలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా అమెరికా ఇరాన్ యుద్ధం త్వరలో ముగిసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. చమురు ధరల తగ్గుదల బంగారం ధరలకు మద్దతునిచ్చింది. ఇక మార్కెట్ దృష్టి ఇప్పుడు అమెరికా నాన్‌ఫార్మ్ పేరోల్స్ గణాంకాలపై ఉంది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపై ఈ డేటా కీలక ప్రభావం చూపనుంది. అంచనాల కంటే బలహీనమైన ఉద్యోగ గణాంకాలు వెలువడితే వడ్డీ రేట్ల తగ్గింపుపై అంచనాలు పెరిగి బంగారం, వెండి ధరలకు మరింత మద్దతు లభించే అవకాశం ఉంది. అదే సమయంలో బలమైన ఉద్యోగ గణాంకాలు వెలువడితే ఇటీవలి లాభాల్లో కొంత లాభాల స్వీకరణ చోటుచేసుకోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

ఆర్థిక, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాల ఒత్తిడి

నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ

ముంబయి, ఆగస్టు 7: దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాలు చవిచూసాయి. ఫైనాన్షియల్, ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా మార్కెట్ ప్రారంభం నుంచి ఒడిదొడుకులకు లోనైంది. దిగ్గజ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో బలహీనత కారణంగా ప్రధాన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 455.59 పాయింట్లు క్షీణించి 78,499.17 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ 65.35 పాయింట్లు నష్టపోయి 24,570.65 వద్ద ముగిసింది. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తగ్గించుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ రోజంతా బలహీనంగానే ఉంది. ముఖ్యంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. నిఫ్టీ షేర్లలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ టాప్ లూజర్లుగా నిలిచాయి. ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ బ్రాడర్ మార్కెట్ కొంతమేర తట్టుకుని నిలబడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.22 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.05 శాతం స్వల్పంగా నష్టపోయింది. రంగాల వారీగా చూస్తే ఆటో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లు మార్కెట్‌కు కొంత మద్దతు నిచ్చాయి. నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఐటీ సూచీలు ప్రధాన రంగాల్లో టాప్ గెయినర్లుగా నిలిచి, సూచీల నష్టాలను కొంతవరకు పరిమితం చేశాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.18 పెరిగితే స్మాల్‌కాప్ సూచీ స్థిరంగాను కొనసాగాయి. కమోడిటీ మార్కెట్‌లోబ్రెంట్ ముడిచమురు అక్టోబరు సెటిల్‌మెంట్‌దర 33 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 82.16 డాలర్లుగా కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.19 వద్ద ముగిసింది. అంతకుముందురోజు 95.22కంటే కొంతమేర మెరుగుపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు అక్టోబరు ఐదునాటి ధరలు 1.56శాతంపెరిగి రూ.1,51,176కి చేరాయి.

ఇఎంఐ బకాయిలున్నా ఫోన్ లాక్‌కు ఆర్బీఐ నో

ముంబయి, ఆగస్టు 7: స్మార్ట్‌ఫోన్‌కోసం తీసుకున్న రుణాలు బకాయిలుంటే ఫోన్ లాక్‌చేసే సంస్థలకు ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు జారీచేసింది. ఇవి వచ్చే యేడాది జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఇఎంఐ చెల్లించలేదని వెంటనే ఫోన్‌ను లాక్ చేయడానికి వీల్లేదు. ఫోన్ కొనుగోలు కోసం తీసుకున్న రుణం 30 రోజుల పాటు బకాయిగా ఉంటేనే పరిమితులు విధించవచ్చు. పూర్తిగా ఫోన్‌ను లాక్ చేయాలంటే బకాయి 60 రోజులు దాటాలి. ఈ నిబంధనలు ఫోన్, ట్యాబ్లెట్, ల్యాప్‌టాప్ కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకే వర్తిస్తాయి. వ్యక్తిగత రుణం లేదా ఇతర రుణాల పేరుతో ఇప్పటికే ఉన్న ఫోన్‌ను రిమోట్ ద్వారా లాక్ చేసే అధికారం రుణదాతలకు ఉండదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. ఫోన్‌పై పరిమితులు విధించినా కొన్ని సేవలు తప్పనిసరిగా పనిచేయాలని ఆదేశించింది. ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్, అత్యవసర ఎస్‌వోఎస్ సదుపాయం, ఉద్యోగానికి అవసరమైన కీలక ఫీచర్లు అందుబాటులో ఉండాలి. దీంతో రుణగ్రహీత పూర్తిగా ఇబ్బంది పడకుండా చూడాలని సూచించింది.

682.35 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ ఖజానా

న్యూఢిల్లీ, ఆగస్టు 7: భారత్ విదేశీ మారక నిల్వలు మరోసారి భారీగా పెరిగాయి. జూలై 31తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు వారంలో నిల్వలు 6.118 బిలియన్ డాలర్లు పెరిగి 682.354 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 728.494 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకాయి. ఆ తర్వాత పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో రూపాయి ఒత్తిడికి గురికావడంతో నిల్వలు పలు వారాల పాటు తగ్గాయి. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్లో డాలర్లను విక్రయించాల్సి వచ్చింది. జూలై 31తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 8.75 బిలియన్ డాలర్లు పెరిగి 564.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్ విలువలో లెక్కించే ఎఫ్‌సిఎల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే మార్పుల ప్రభావం కూడా ఉంటుంది. దేశంలోకి మరిన్ని విదేశీ మారకద్రవ్య ప్రవాహాలను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ గత నెలలో పలు చర్యలు చేపట్టాయి. ఇందులో ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్లకు సంబంధించిన చర్యలు కూడా ఉన్నాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు భారత్‌కు సుమారు 32 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య ప్రవాహం వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.వారంలో బంగారం నిల్వల విలువ 1.685 బిలియన్ డాలర్లు పెరిగి 104.743 బిలియన్ డాలర్లకు చేరింది. ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ 48 మిలియన్ డాలర్లు పెరిగి 18.666 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అంతర్జాతీయ ద్రవ్య నిధిసంస్థలో భారత్ రిజర్వ్ పొజిషన్ కూడా 28 మిలియన్ డాలర్లు పెరిగి 4.778 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

మెటాకు అమెరికా కోర్టు రూ.5400 కోట్ల జరిమానా

న్యూమెక్సికో, ఆగస్టు 7: సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి భారత కరెన్సీలో సుమారు రూ. 5,400 కోట్లకు పైగా జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది.

అగ్రిబిజినెస్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ జరిమానా

న్యూఢిల్లీ, ఆగస్టు 7: ప్రముఖ వంటనూనెల తయారీ సంస్థ ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్‌కు ఆహార నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ జరిమానా విధించింది. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని ఫోర్టిఫైడ్ సన్‌ఫ్లవర్ వంటనూనెను తయారు చేసి, విక్రయించినందుకు ఈ చర్య తీసుకుంది.ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్ ఫార్చ్యూన్ బ్రాండ్ పేరుతో వంటనూనెలను విక్రయిస్తోంది. గోవాలో సేకరించిన ఫార్చ్యూన్ ఫ్రయోలా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్ నమూనా ప్రయోగశాల పరీక్షల్లో విఫలమైంది. నూనెలో విటమిన్ డి స్థాయి నిర్దేశిత ప్రమాణాల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు తేలింది.ఈ విషయాన్ని ఎఫ్ఎస్ఎస్ఎఐ శుక్రవారం సోషల్ మీడియా పోస్టు ద్వారా వెల్లడించింది. ఎడబ్ల్యుఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్ (మంగళూరు) పై అడ్జుడికేషన్ ఆర్డర్ జారీ చేసి జరిమానా విధించినట్లు తెలిపింది. గోవాలోని తాజ్ ఫోర్ట్ అగ్వాడా రిసార్ట్ అండ్ స్పా నుంచి ఎఫ్ఎస్ఎస్ఎఐ అధికారులు ఒక లీటర్ ఫార్చ్యూన్ ఫ్రయోల్గా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నమూనాను సేకరించారు. ప్రాథమిక ఆహార ప్రయోగశాల పరీక్షల్లో ఈ ఫోర్టిఫైడ్ నూనె ఫోర్టిఫికేషన్ ఆఫ్ ఫుడ్స్ రెగ్యులేషన్స్, 2018లో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలింది.నమూనాలో విటమిన్ ఎ, విటమిన్ డి స్థాయిలు నిర్దేశిత పరిమితుల కంటే తక్కువగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఎఐ తెలిపింది. దీంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ల ప్రకారం ఉత్పత్తిని నాసిరకంగా గుర్తించారు.కంపెనీ అప్పీల్ చేయడంతో నమూనాను రెఫరల్ లేబొరేటరీలో మరోసారి పరీక్షించారు. ఈ పరీక్షల్లోనూ విటమిన్ డి పరిమాణం నిర్దేశిత స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయింది.దీంతో సెంట్రల్ లైసెన్సింగ్ అథారిటీ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వగా, అడ్జుడికేషన్ దరఖాస్తు దాఖలైంది. అనంతరం గోవా అడ్జుడికేటింగ్ అధికారి అగ్రి బిజినెస్‌పై చర్యలు తీసుకుని, నాసిరకం ఫోర్టిఫైడ్ ఎడిబుల్ ఆయిల్ తయారీ, మార్కెటింగ్‌కు సంబంధించి జరిమానా విధించారు.అయితే జరిమానా మొత్తం ఎంత అన్నది ఎఫ్ఎస్ఎస్ఎఐ వెల్లడించలేదు.ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై గత కొన్ని నెలలుగా ఎఫ్ఎస్ఎస్ఎఐ కఠిన చర్యలు చేపడుతోంది. ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఎనర్జీ డ్రింక్స్, ఆల్కహాలిక్ బెవరేజెస్ తయారీదారులపైనా నియంత్రణ సంస్థ దృష్టి సారించింది

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.